# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 57 | హైదరాబాద్ | గురువారం 14-08-2025 | పేజీలు : 12 | వెల : 1.00





11లో

ఐదేళ్ల తర్వాత భారత్ నుంచి చైనాకు విమాన సర్వీసులు

## నేటి భారతం...

* తల్లిగా లాలిస్తుంది, చెల్లిగా తోడుంటుంది...
* భార్యగా బాగోగులు చూస్తూ.. దాసిలా పనిచేస్తుంది మహిళ..
* అంతటి గొప్ప మానవమూర్తికి మనసారా ధన్యవాదాలు..
* కనులు తెరిచిన క్షణం నుంచి.. బంధం కోసం బాధ్యత కోసం..
* కుటుంబం కోసం.. అందర్నీ కనుపాపలా తలచి..
* ఆత్మీయత పంచి, తనవారి కోసం అహర్నిశలు కష్టించి..
* వారిని సహించి, వారి భవిష్యత్తు గురించి..
* తన ఇంటిని నందనవనం చేసే స్త్రీ మూర్తికి...
* పాదాభివందనం..

– కేసారం. పెంటారెడ్డి

# మహిళలను.. మనుషులుగా చూడండి..



( స్త్రీలు గృహహింస నిరోధక చట్టం 2005 గురించి ఖచ్చితంగా తెలుసుకోవాలి.. )



12లో

- స్త్రీని దేవతగా పూజించే దేశం మనది..
- ఆదిపరాశక్తి అంటాం.. అది నుంచి ఆమెకు కష్టాలే..
- ఎన్ని చట్టాలు వచ్చినా ఆడది అబలగానే మిగిలిపోతోంది..
- గృహ హింసే కాదు సమాజంలో కూడా అసమానతలే..
- ఒక ప్రాణికి జన్మనిచ్చి, తమ ప్రాణాలను ఫణంగా పెడుతుంది..
- ఆలయాన వెలసిన ఆదేవుని రీతి అని చెప్పుకుంటాం అంతే..
- స్త్రీ శక్తి లేకపోతే ఈ ప్రపంచం శూన్యం అవుతుంది..
- ప్రతి స్త్రీతోనూ తల్లిని, చెల్లిని, సోదరిని చూద్దాం..
- ఆదుకునే బొమ్మలా కాకుండా ఆదుకునే అమ్మలా గౌరవిద్దాం..
- ఆకాశమే హద్దుగా మహిళ ఇప్పుడు సాగిపోతోంది..
- ఆమెను రక్షించుకుందాం.. మనల్ని మనం కాపాడుకుందాం..

స్త్రీ లేకుండా ఈ ప్రపంచ మనుగడ సాధ్యం కాదు.. వినా స్త్రీ యా జననం నాస్తి.. వినా స్త్రీ యా గమనం నాస్తి.. వినా స్త్రీ యా జీవం నాస్తి.. వినా స్త్రీ యా సృష్టి యేవ నాస్తి.. అని గొప్పగా చెప్పకుంటాం.. కానీ ఎంతవరకు స్త్రీలను గౌరవిస్తున్నాం.. గౌరవం ఇవ్వకపోయినా పర్వాలేదు కనీసం ఒక మనిషిగా చూస్తున్నామా..? ఎవరికీ వారు తమలో తాము ఈ ప్రశ్నను వేసుకోవాలి.. సమాధానం రాబట్టుకోవాలి.. ఈ భూమ్మీద అత్యంత సహనశీలి మహిళ.. కన్న తల్లి దండ్రులను, సోదరలు, స్నేహితులను విడిచిపెట్టి పుట్టినుంచి నుంచి మెట్టి నింత అడుగుబెడుతుంది స్త్రీ.. అలాంటి స్త్రీని కంటికి రెప్పలా చూసుకునే వారు ఎందరు..? భార్య అనే చిన్న చూపుతో.. తమ ఇంట్లో పనిమనిషిగా కంటే హీణంగా చూస్తుంటారు.. తాను కూడా ఒక ఇంటికి కోడలు అన్న విషయం మరచిన కొందరు అత్తలు తమ కోడల్ని ని రాచి రంపాన పెడుతుంటారు.. ఇది వినాశనానికి దారి తీస్తుంది.. స్త్రీ అంటే కేవలం కోరిక తీర్చుకునే సాధనంగా కాకుండా.. ఒక కుటుంబానికి దారిచూపే చుక్కాని అన్న నిజాన్ని గ్రహించాలి.. అప్పడే ఈ సమాజం పరిపుష్టం అవుతుంది.. దేవుడు అందరి ఇండ్లలో ఉండలేక తన తరపున ఒక స్త్రీని ప్రతి ఇంట్లో వుంచుతాడట.. అది అమ్మ కావచ్చు, ఆలి కావచ్చు, సోదరి కావచ్చు.. ఏ రూపాన ఉన్నా స్త్రీ అనేది ఒక అద్భుతమైన రూపం.. ఆ రూపాన్ని భద్రంగా పదిలపరుచుకుందాం..ప్రతి ఏడాది మార్చి నెలలో ప్రపంచ మహిళా దినోత్సవం జరుపుకుంటాం.. ఆరోజు ఎంతో హంగామా సృష్టిస్తాం.. కానీ ఆ మరుసటి రోజే మర్చిపోతాం.. ఇది కాదుకదా స్త్రీకి మనమిచ్చే నిజమైన గౌరవం..? స్త్రీకి ఒక రోజంటూ ఉండదు.. సర్వకాల సర్వావస్థల యందూ స్త్రీ ఉనికి మనకు ఎంతో అవసరం ఇది గ్రహించమని కోరుతోంది " ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ ".. ఈ క్రమంలోనే గృహ హింస నిరోధక చట్టం 2005 గురించి పూర్తి వివరాలు అందిస్తోంది..



రాఖీ పండుగ.. ఆర్టీసీలో రికార్డు స్థాయిలో

## మహిళల ప్రయాణాలు

- ఆరు రోజుల్లో 3.68 కోట్ల రాకపోకలు
- 2.51 కోట్ల ఉచిత ప్రయాణాలు ఉన్నట్లు ఆర్టీసీ వెల్లడి
- 7 నుంచి 12వ తేదీ వరకు ప్రయాణాలు

12లో

సెమీకండక్టర్ ప్రాజెక్టుపై తెలంగాణకు

## కేంద్రం అన్యాయం చేసింది



తెలంగాణ ప్రతిపాదనను కేంద్రం పక్కన పెట్టిందన్న శ్రీధర్ బాబు

12లో

## 2030 కామన్వెల్త్ గేమ్స్.. ఆతిథ్యం కోసం భారత్ అధికారిక బిడ్..



ఐఓఏ గ్రీన్ సిగ్నల్

భారత్ బిడ్‌కు భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) ఏకగ్రీవ ఆమోదం

12లో

## తెలంగాణలో 4 రోజుల పాటు భారీ వర్షా లు..

మంత్రి ఉత్తమ్ కీలక ఆదేశాలు

12లో


## ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారం వేసే ప్రసక్తే లేదు: సీఎం

ఏపీని 'గ్రీన్ ఎనర్జీ కారిడార్'గా తీర్చిదిద్దుతామన్న చంద్రబాబు

- వినియోగదారులపై విద్యుత్ ఛార్జీల భారం వేయొద్దని అధికారులకు ఆదేశం
- ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలపై దృష్టి సారించాలని కీలక సూచన
- పంపిణీ నష్టాలు, బహిరంగ మార్కెట్ కొనుగోళ్లు తగ్గించాలని స్పష్టం
- వ్యవసాయానికి స్మార్ట్ మీటర్లు వద్దని తేల్చిచెప్పిన ముఖ్యమంత్రి

11లో





కేబీసీలో 'ఆపరేషన్ సిందూర్'

## అధికారులు .. దుమారం

- స్వాతంత్ర్య దినోత్సవ ప్రత్యేక ఎపిసోడ్‌పై చెలరేగిన వివాదం
- సైన్యాన్ని పీఆర్ కోసం వాడుకుంటున్నారని సోషల్ మీడియాలో విమర్శలు
- యూనిఫాంలో రియాలిటీ షోకు హాజరుకావడంపై నెటిజన్ల ఆగ్రహం
- ఆర్మీ ప్రోటోకాల్ నిబంధనలను ఉల్లంఘించారంటూ ఆరోపణలు

ఆగష్టు 13 ( భారత శక్తి ) :ప్రముఖ రియాలిటీ షో 'కౌన్ బనేగా కరోడ్‌పతి' (కేబీసీ)లో భారత సైనిక అధికారులు పాల్గొ నడం వివాదానికి దారితీసింది. పహల్గామ్ దాడి అనంతరం భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'కు సంబంధించిన వివరాలు వెల్లడించిన కల్నల్ సోఫియా ఖురేషి, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ ఈ షోలో కనిపించడంతో సోషల్ మీడియాలో తీవ్ర దుమారం రేగింది. సాయుధ దళాలను వ్యక్తిగత ప్రచారం (పీఆర్), రాజకీయ ప్రయోజనాల కోసం

తరువాయి 12లో

# మోడీ తర్వాత ఎవరు...

గడిచిన 11 ఏళ్లలో బీజేపీ దేశంలో గతంలో ఎన్నడూ లేనంతం బలంగా మారింది. దేశంలోని మెజారిటీ రాష్ట్రాల్లో సొంతంగా అధికారంలో ఉంది. మిత్రపక్షాల మద్దతుతో మరికొన్ని రాష్ట్రాల్లో అధికారంలో ఉంది. ఇక కేంద్రంలో వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చింది. మూడోసారి మెజారిటీ రాకపోయినా.. అధికారం మాత్రం చేజిక్కించుకుంది. దీనికి కారణం మోదీ మేనియా.. ఇది ఎవరూ కాదనలేరు. మోదీ కారణంగానే బీజేపీ అనేక రాష్ట్రాల్లో అధికారం చేపట్టింది. కేంద్రంలో వరుసగా మూడుసార్లు అధికారంలోకి వచ్చి రికార్డు సృష్టించింది. అయితే ఆర్ఎస్ఎస్ 75 ఏళ్లు దాటినవారు రాజకీయాల్లో రిటైర్ కావాలంటోంది. మోదీకి సెప్టెంబర్‌తో 75 ఏళ్లు పూర్తికానున్నాయి. ఈనేపథ్యంలో మోదీ తర్వాత ఎవరు అన్న చర్చ దేశవ్యాప్తంగా జరుగుతోంది. 75 ఏళ్లు తప్పనిసరి కాదని బీజేపీ అంటోంది. విపక్షాలు మాత్రం ఆర్ఎస్ఎస్ నిబంధనలు గుర్తు చేస్తున్నాయి. కౌటిల్యుడు చెప్పినట్లు, ఒక వ్యవస్థ బలంగా ఉండాలంటే, ఒక నాయకుడి అనుపస్థితిలోనూ అది సమర్థవంతంగా నడవాలి. ఈ విషయంలో బీజేపీ సిద్ధంగా ఉందా? విపక్షాల్లో మోదీకి సమానమైన నాయకుడు ఉన్నాడా?నరేంద్ర మోదీ దేశవ్యాప్త ఆకర్షణ, రాజకీయ వ్యూహం, జనసామాన్యంతో సంబంధం కలిగి ఉండే సామర్థ్యం వంటి లక్షణాలతో బీజేపీకి తిరుగులేని నాయకుడిగా నిలిచారు. 2014, 2019, 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఆయన నాయకత్వం బీజేపీకి అఖండ విజయాలను అందించింది. అయితే, బీజేపీలో మోదీ స్థాయి నాయకత్వాన్ని అందించగల నేతలు లేరనే వాదన బలంగా వినిపిస్తోంది. అమిత్ షా, యోగి ఆదిత్యనాథ్, నితిన్ గడ్కరీ, రాజ్‌నాథ్ సింగ్ వంటి నాయకులు ఉన్నప్పటికీ, వారెవరూ మోదీ జాతీయ ఆకర్షణ లేదా ఓటర్లను ఏకతాటిపైకి తీసుకురాగల సామర్థ్యం కలిగి లేరని విశ్లేషకులు భావిస్తున్నారు. అమిత్ షా రాజకీయ వ్యూహకర్తగా బలమైన నాయకుడు, కానీ మోదీ స్థాయి జనాదరణ లేదు. యోగి ఆదిత్యనాథ్ ఉత్తరప్రదేశ్‌లో బలమైన నాయకుడు, కానీ జాతీయ స్థాయిలో ఆయన ప్రభావం పరిమితం. నితిన్ గడ్కరీ, రాజ్‌నాథ్ సింగ్ సీనియర్ నాయకులైనప్పటికీ, వారు జాతీయ నాయకత్వానికి అవసరమైన ఆకర్షణను ప్రదర్శించలేకపోతున్నారు. మోదీ నాయకత్వం బీజేపీని ఒక వ్యక్తి కేంద్రీకృత పార్టీగా మార్చిందని విమర్శకులు ఆరోపిస్తున్నారు. బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే చెప్పినట్లు, "మోదీ లేకపోతే బీజేపీకి 150 సీట్లు కూడా రావు" అనే వ్యాఖ్య ఈ వాస్తవాన్ని స్పష్టం చేస్తుంది. బీజేపీ సంస్థాగత నిర్మాణం బలంగా ఉన్నప్పటికీ, మోదీ స్థాయి నాయకుడు లేకపోతే ఆ పార్టీ ఓటర్లను ఆకర్షించడంలో సవాళ్లను ఎదుర్కొనే అవకాశం ఉంది.విపక్షాల్లోనూ మోదీకి సమానమైన జాతీయ నాయకుడు కనిపించడం లేదు. కాంగ్రెస్ పార్టీ రాహుల్ గాంధీని ప్రధాని అభ్యర్థిగా ప్రొజెక్ట్ చేస్తున్నప్పటికీ, ఆయనకు కాంగ్రెస్ కూటమిలోనే పూర్తి మద్దతు లేదు. మమతా బెనర్జీ వంటి కీలక నాయకులు రాహుల్‌ను ప్రధాని అభ్యర్థిగా అంగీకరించడానికి విముఖత చూపిస్తున్నారు. రాహుల్ గాంధీ తనను తాను బలమైన నాయకుడిగా నిరూపించుకోవడంలో విఫలమవుతున్నారని విమర్శలు ఉన్నాయి. ఆయన ఆలోచనా విధానం, కుల?మత రాజకీయాలపై దృష్టి సారించడం వంటివి బీజేపీ వ్యూహాలకు ఎదురు నిలవలేకపోతున్నాయి. మోదీ కంటే మెరుగైన పాలన అందిస్తానని నిరూపించడంలో రాహుల్ వెనుకబడి ఉన్నారు. ఇక విపక్షాల్లో ఇతర నాయకుల విషయానికి వస్తే అరవింద్ కేజ్రీవాల్, మమతా బెనర్జీ లేదా ఇతర ప్రాంతీయ నాయకులు, జాతీయ స్థాయిలో మోదీకి సవాలు విసిరే స్థాయి ఆకర్షణ లేదా సంస్థాగత మద్దతు కలిగి లేరు. ఈ నేపథ్యంలో, మోదీ రిటైర్మెంట్ తీసుకున్నా, విపక్షాల నుంచి బలమైన ప్రత్యామ్నాయ నాయకత్వం లేకపోవడం దేశ రాజకీయాల్లో నాయకత్వ సంక్షోభాన్ని సూచిస్తోంది.బీజేపీలో 75 ఏళ్ల తర్వాత రిటైర్మెంట్ అనే అప్రకటిత నియమం గతంలో అద్వానీ, ఉమా భారతి, వెంకయ్య నాయుడి వంటి నాయకులపై వర్తింపజేయబడింది. అయితే, ఈ నియమం బీజేపీ రాజ్యాంగంలో లేదు. మోదీ రిటైర్మెంట్‌పై బీజేపీలో ఎటువంటి చర్చ జరగడం లేదు. ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ చేసిన "75 ఏళ్లు దాటితే సేవలు చాలు" అనే వ్యాఖ్య విపక్షాల్లో చర్చను రేకెత్తించినప్పటికీ, బీజేపీ నుంచి ఎటువంటి స్పందన రాలేదు. రాజకీయ విశ్లేషకులు మోహిసినా కిద్వాయ్ చెప్పినట్లు, మోదీ స్వయంగా తప్పుకోకపోతే బీజేపీలో నాయకత్వ మార్పు చర్చకు రాదు. అంతర్జాతీయంగా జరుగుతున్న పరిణామాలు, రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో బలమైన నాయకత్వం అవసరమని ప్రజలు భావిస్తున్నారు. ఈ కారణంగా, మోదీ రిటైర్మెంట్ కోరుకునేవారు చాలా తక్కువ. ఎన్డీఏ మిత్రపక్షాలు, ముఖ్యంగా టీడీపీ, మోదీని సరైన సమయంలో ఉన్న సరైన నాయకుడిగా అభివర్ణిస్తున్నాయి.కౌటిల్యుడు చెప్పినట్లు, ఒక సంస్థ బలంగా ఉండాలంటే, ఒక నాయకుడి అనుపస్థితిలోనూ అది సమర్థవంతంగా నడవాలి. మోదీ ఈ విషయంలో విఫలమయ్యారని విమర్శలు ఉన్నాయి. ఆయన తన స్థాయి నాయకత్వాన్ని అందించగల వారసుడిని సిద్ధం చేయలేకపోయారని ఆరోపణలు ఉన్నాయి. బీజేపీలో ఇతర నాయకులు ఎదగకుండా చేయడం లేదా ఆ స్థాయి నాయకత్వాన్ని ప్రోత్సహించకపోవడం వల్ల మోదీ తర్వాత శూన్యత తలెత్తే అవకాశం ఉంది. ఇదే సమస్య విపక్షాల్లోనూ కనిపిస్తోంది, ఎందుకంటే వారు కూడా మోదీకి సమానమైన నాయకుడిని అందించలేకపోతున్నారు. 2029 లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో, నాయకత్వం ఒక కీలక అంశంగా మారే అవకాశం ఉంది. మోదీ తన రిటైర్మెంట్‌ను ప్రకటించకపోయినా, బీజేపీ తన స్థాయి నాయకత్వాన్ని సిద్ధం చేయడంలో విఫలమైతే, దాని రాజకీయ ఆధిపత్యం ప్రమాదంలో పడవచ్చు. అదే సమయంలో, విపక్షాలు కూడా బలమైన ప్రత్యామ్నాయ నాయకత్వాన్ని అందించడంలో విఫలమైతే, దేశ రాజకీయాల్లో నాయకత్వ సంక్షోభం తీవ్రమవుతుంది.

# లిక్కర్ స్కాం 2వ చార్జిషీటులో జగన్...?

విజయవాడ, ఆగస్టు 13,

ఏపీలో మద్యం కుంభకోణం సృష్టిస్తోంది. వైయస్సార్ కాంగ్రెస్ హయాంలో భారీ మద్యం కుంభకోణం జరిగిందని స్పష్టమౌతోంది. ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణలో నమ్మలేని నిజాలు బయటపడుతున్నాయి. దాదాపు 40 మంది వరకు ఈ కేసులో నిందితులు. ఇప్పటివరకు 12 మంది అరెస్టు అయ్యారు. ఈ నేపథ్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందం తన రెండు ఛార్జ్ షీట్ ను సోమవారం విజయవాడలోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో దాఖలు చేసింది. 200 పేజీలతో కూడిన ఈ ఛార్జ్ షీట్లో ముగ్గురిపై కీలక ఆరోపణలు చేసింది. ప్రధానంగా ఐఏఎస్ అధికారి ధనుంజయ రెడ్డి, ఓ ఎస్ డి కృష్ణమోహన్ రెడ్డి, భారతి సిమెంట్స్ డైరెక్టర్ బాలాజీ గోవిందప్ప ఈ స్కాం లో కీలక పాత్ర పోషించినట్లు వెల్లడించింది. అయితే పలుమార్లు మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి పేరు ప్రస్తావించడం విశేషం. 2019లో వైయస్సార్ కాంగ్రెస్‌అధికారంలోకి వచ్చింది. మద్యం పాలసీని మార్చింది. అప్పటివరకు ప్రైవేటు వ్యాపారులు మద్యం నిర్వహిస్తుండగా.. ప్రభుత్వమే నేరుగా మద్యం దుకాణాలను నడిపింది. రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో ఉండే ఏపీ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ ద్వారా మద్యం విక్రయాలను నియంత్రించింది. అప్పుడే అవినీతికి బీజం పడినట్లు తెలుస్తోంది. ఒక వ్యవస్థాగత సిండికేట్ ఏర్పాటు జరిగిందని.. సిట్ తన ఛార్జ్ షీట్ లో స్పష్టం చేసింది. ఇప్పటికే ప్రాథమిక ఛార్జ్ షీట్ నమోదు చేసిన సిట్.. తాజాగా ఏసీబీ కోర్టులో రెండో ఛార్జ్ షీట్ దాఖలు చేసింది. అయితే ఇందులో అనేక కీలక అంశాలను బయటపెట్టింది. ధనుంజయ రెడ్డి, కృష్ణ మోహన్ రెడ్డి, బాలాజీ గోవిందప్పల పాత్రను స్పష్టం చేసింది. ప్రతి దశలో అనైతికంగా అప్పటి ముఖ్యమంత్రి కార్యాలయ అధికారి ధనుంజయ రెడ్డి జోక్యం చేసుకున్నారని చూపించగలిగింది.అయితే పక్కా ఆధారాలను సేకరించింది ప్రత్యేక దర్యాప్తు బృందం కాల్ డేటా రికార్డులు, గూగుల్ టేక్ అవుట్ ఫైల్స్, ల్యాప్టాప్ డేటా ఆధారంగా వీరి సంప్రదింపులు, అక్రమ లావాదేవీలను సిట్ గుర్తించింది. ఒక్కో లిక్కర్ కేసుకు 150 నుంచి 200 రూపాయల వరకు ముడుపుగా వసూలు చేసినట్లు.. నెలకు సుమారుగా 50 నుంచి 60 కోట్ల వరకు సేకరించినట్లు సిట్ పేర్కొంది. ఈ నగదు హవాలా లావాదేవీల ద్వారా దుబాయ్, ఢిల్లీ, హైదరాబాద్ వంటి ప్రాంతాలకు తరలించినట్లు ఆరోపణలు ఉన్నాయి. అయితే మొత్తం వ్యవహారాలను వివరించే క్రమంలో.. ఛార్జ్ షీట్లో జగన్ పేరును పలుమార్లు ప్రస్తావించింది సిట్.మద్యం కుంభకోణంలో సూత్రధారి జగన్ అని స్పష్టం చేసింది ప్రత్యేక దర్యాప్తు బృందం. అనేక నిర్ణయాల్లో నాటి సీఎం జగన్ పాత్ర ఉందని తేల్చింది. మద్యం అమ్మకాల విధానాల్లో మార్పు ఆయన పనేనని స్పష్టం చేసింది. ఒక వ్యవస్థీకృతమైన విధానం ద్వారా మద్యం కుంభకోణానికి పాల్పడినట్లు స్పష్టం చేసింది ప్రత్యేక దర్యాప్తు బృందం. నేరుగా సీఎం సన్నిహితులకు మద్యం ముడుపులు అందాయని? ఈ కేసులో కీలకంగా వ్యవహరించిన ధనుంజయ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, గోవిందప్ప బాలాజీ భారీగా ఆస్తులు సమకూర్చుకున్నట్లు తెలుస్తోంది. అయితే మనీ లాండరింగ్ ద్వారా దుబాయ్ కంపెనీలకు ముడుపుల సొమ్ము చేర్చింది ఈశ్వర్ కిరణ్ కుమార్ రెడ్డి అని స్పష్టం అయింది. అయితే ఈ మొత్తం నిందితుల మధ్య ఫోన్ సంభాషణలకు సంబంధించిన సమాచారం కూడా సిట్ సేకరించింది. ఫోన్ల లొకేషన్ లతో కీలక సమాచారాన్ని రాబెట్టింది. ఫోరెనిక్స్ విశ్లేషణలతో నిర్ధారణ చేసుకుంది. మద్యం సరఫరా ఆర్డర్లు మార్చేసి? ఆధారాలను సైతం ధ్వంసం చేసినట్లు ప్రత్యేక దర్యాప్తు బృందం గుర్తించింది. అయితే అంతిమ లబ్ధిదారుడు జగన్ అని పరోక్షంగా సంకేతాలు ఇచ్చింది సిట్. తద్వారా మూడో ఛార్జ్ షీట్లో నేరుగా అప్పటి సీఎం జగన్ ప్రమేయాన్ని మరింత నిర్ధారించి? స్పష్టతనివ్వనున్నట్లు అర్థమవుతోంది.

కొత్త డెన్ లు

వైసిపి హయాంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ భారీగా అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణలు ఉన్నాయి. దాదాపు 18 వేల కోట్ల రూపాయలు ప్రభుత్వ ఆదాయానికి గండిపడగా.. 3500 కోట్ల రూపాయల కుంభకోణానికి పాల్పడ్డారు అన్నది ప్రధాన ఆరోపణ. దీనిపై దర్యాప్తు చేపట్టిన ప్రత్యేక దర్యాప్తు బృందం సంచలన విషయాలను బయటపెడుతోంది. దాదాపు ఈ స్కాంలో 40 మంది నిందితులు ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే 12 మంది నిందితులు అరెస్ట్ అయ్యారు. ఇటీవలే రాజంపేట ఎంపీ మిధున్ రెడ్డి అరెస్టు అయ్యారు. ముందుగా సూత్రధారి రాజ్ కసిరెడ్డి అరెస్టు కాగా.. తరువాత వరుస అరెస్టులు కొనసాగుతున్నాయి. అప్పటి సీఎంఓ కీలక అధికారి ధనుంజయ రెడ్డి, జగన్ ఓ ఎస్ డి కృష్ణమోహన్ రెడ్డి, బాలాజీ గోవిందప్ప వంటి వారు అరెస్టయ్యారు. అయితే వీరి ప్రమేయం విషయంలో ఎటువంటి సమాచారం బయటకు రాకున్నా.. ఏ 34 నిందితుడిగా ఉన్న వెంకటేష్ నాయుడు కు సంబంధించిన వీడియోలు వరుసగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. వాటిని పరిశీలిస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం మరింత లోతైన విచారణ కొనసాగిస్తోంది.చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి అత్యంత సన్నిహితుడే ఈ వెంకటేష్ నాయుడు. మద్యం కుంభకోణంలో ఈయన పాత్ర కీలకం అన్నట్టు తెలుస్తోంది. ముఖ్యంగా రాజ్ కసిరెడ్డి సూత్రధారి అయితే.. మద్యం కుంభకోణం ద్వారా కొల్లగొట్టిన సొమ్మును భద్రపరచడం, అప్పటి ప్రభుత్వ పెద్దలకు చేర్చడం వెంకటేష్ నాయుడు ప్రధాన విధిగా తెలుస్తోంది. అయితే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అరెస్టు సమయంలో తమకు ఏ పాపం తెలియదని.. ప్రభుత్వమే కక్ష సాధింపునకు దిగుతోందని సంచలన ఆరోపణలు చేశారు. అయితే ఆయనకు సన్నిహితుడిగా భావిస్తున్న వెంకటేష్ నాయుడు తాజా వీడియోలు, ఫోటోలు సోషల్ మీడియాలో దర్శనం ఇస్తున్నాయి. భారీ డెన్ లు, నోట్ల కట్టలకు సంబంధించిన ఈ వీడియోలు హల్చల్ చేస్తున్నాయి. అంతటితో ఆగకుండా వెంకటేష్ నాయుడు విలాసవంతమైన జీవితానికి సంబంధించిన దృశ్యాలు కూడా కనిపిస్తున్నాయి. దీంతో సిట్ దర్యాప్తు మరింత లోతుగా కొనసాగే అవకాశం కనిపిస్తోంది.వెంకటేష్ నాయుడు కు సంబంధించిన వీడియో ఒకటి తొలుత వెలుగులోకి వచ్చింది. ఒక డెన్ లో భారీ నోట్ల కట్టలు లెక్కిస్తూ ఆయన కనిపించారు. అయితే తాజాగా ఆయన ప్రత్యేక విమానాల్లో విలాసవంతమైన ప్రయాణాలకు సంబంధించిన వీడియోలు కూడా బయటకు వచ్చాయి. ప్రత్యేక విమానాల్లో మద్యం కుంభకోణానికి సంబంధించి సొమ్మును తరలిస్తున్నట్లు కూడా కామెంట్స్ వినిపించాయి. మరోవైపు సినీనటి తమన్నా ప్రత్యేక సెల్ఫీ.. స్పెషల్ ఫ్లైట్లో కనిపిస్తోంది. దీంతో యాపారం చాలా ఉంది అంటూ కామెంట్స్ సోషల్ మీడియాలో వినిపిస్తున్నాయి. మరోవైపు బీఆర్ఎస్ నేత కవితతో సైతం వెంకటేష్ నాయుడు దిగిన ఫోటోలు సోషల్ మీడియాలో సర్కులేట్ అవుతున్నాయి. అయితే మద్యం కుంభకోణం ద్వారా కొల్లగొట్టిన సొమ్మును సేఫ్ జోన్ లో తీసుకెళ్లే బాధ్యత వెంకటేష్ నాయుడు దేనని ప్రచారం జరుగుతోంది. ప్రత్యేక దర్యాప్తు బృందం కూడా వెంకటేష్ నాయుడు చుట్టూ విచారణ చేపడుతున్నట్లు తెలుస్తోంది.

# ఆదోని సర్కారీ స్కూల్ నో అడ్మిషన్స

కర్నూలు, ఆగస్టు 12

రాష్ట్ర విద్యా వ్యవస్థలో ప్రభుత్వం తీసుకొచ్చిన మార్పులతో రాష్ట్రంలో ప్రభుత్వ స్కూల్‌లలో అడ్మిషన్‌ను పెరుగుతున్నాయి. ఈ క్రమంలోనే కర్నూలు జిల్లా ఆదోని పట్టణంలోని నెహ్రూ మెమోరియల్ పురపాలక ఉన్నత పాఠశాలకు బడి తెరిచిన నాటి నుంచి ప్రతి రోజు సిఫారసు లేఖలతో చాలా మంది విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను బడిలో చేర్చుకోవాలని క్యూ కడుతున్నారు. ఇప్పటికే 6 నుంచి పదో తరగతి వరకు పాఠశాలలో 1,725 మంది విద్యార్థులు ఉన్నారు. ఒక్కో గదిలో 120 మందికి పైగా విద్యార్థులు కూర్చుంటున్నారు. ఈ నేపథ్యంలో స్కూల్‌లో విద్యార్థులకు చోటు చాలక పోవడంతో స్కూల్ బయటన నో అడ్మిషన్ బోర్డు పెట్టారు.కూటమి ప్రభుత్వం మధ్యాహ్న భోజనంలో సమూలమైన మార్పులు చేసి సన్న బియ్యంతో విద్యార్థులకు భోజనం వడ్డించడం తల్లికి వందనం కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉన్న అంతమందికి రూ.15 వేలు జమ చేయడంతో ప్రభుత్వ పాఠశాలలకు మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. ఆ పాఠశాలకు ఏటా పదవ తరగతి ఉత్తీర్ణత శాతం పెరుగుతుండడం ఉపాధ్యాయులు, క్రమశిక్షణతో బోధన చేస్తుండడం, ఔఅఅ , క్రీడలకు ప్రాధాన్యత ఇస్తుండడంతో తల్లిదండ్రులు ఆ పాఠశాలలో చేర్చేందుకు ఆసక్తి కనపరుస్తున్నారు.రాష్ట్రంలో అత్యధికంగా విద్యార్థులు చదువుతున్న పురపాలక పాఠశాలల్లో ఆదోని పట్టణంలోని నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాల ఆరో తరగతి నుంచి పదవ తరగతి వరకు విద్యార్థులు చదువుతున్నారు. 2025- 26 విద్యా సంవత్సరానికి 450 పైగా అడ్మిషన్లు చేసుకున్నారు. ఒక్క ఆరో తరగతి లోని 298 పైగా అడ్మిషన్లు అయ్యాయి. ఒక్కో తరగతి గదిలో 120 మందికి పైగా విద్యార్థులు కూర్చుంటున్నారు. తరగతి గదిలో కూర్చోడానికి కూడా స్థలం లేక కొంతమంది నేలపైనే కూర్చొని పాటలు వింటున్నారుఅయితే నెహ్రూ మెమోరియల్ హైస్కూల్లో నో అడ్మిషన్ల బోర్డులు పెట్టడంపై రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్ స్పందించారు. 1725 మంది విద్యార్థులున్న ఈ హైస్కూలులో ఈ ఏడాది అన్ని తరగతుల్లో 400 మందికి పైగా కొత్త విద్యార్థులు చేరడం ప్రభుత్వ విద్య పట్ల ప్రజల్లో పెరుగుతున్న నమ్మకానికి నిదర్శనమని ఆయన అన్నారు.'నో అడ్మిషన్ బోర్డు పెట్టి, అడ్మిషన్స్ క్లోజ్ చేశామని తల్లిదండ్రులకు నచ్చజెపుతున్నా, మా పిల్లాడి ఒక్కడిని చేర్చుకోండి సార్' అని బతిమాలుతుంటే కాదనలేకపోతున్నామని చెబుతున్న హెడ్మాస్టర్ ఫయాజుద్దీన్, టీచర్లు, సిబ్బందికి హృదయపూర్వక కృతజ్ఞతలు అంటూ మంత్రి ఎక్స్ వేదికగా రాసుకొచ్చారు. రాష్ట్రంలోని ప్రతి స్కూలులో ఇలాగే నో అడ్మిషన్ బోర్డులు కనిపించాలని.. తల్లిదండ్రుల్లో ప్రభుత్వ విద్య పట్ల నమ్మకం కల్పించిన ఉపాధ్యాయులే ఏపీ మోడల్ ఎడ్యుకేషన్ తీర్చిదిద్దే రథసారథులు అని ఆయన అన్నారు

# అనకాపల్లి జిల్లాలో తప్పిన ఘోర రోడ్డు ప్రమాదం.

అనకాపల్లి

అనకాపల్లి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం తప్పింది. ఎన్.రాయవరం మండలం, గోకులపాడు వద్ద జాతీయరహదారిపై రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగివున్న చెత్త రిక్షాను, కూరగాయల ఆటో ను అంబులెన్స్ ఢీకొంది. ఘటనలో ఆటో నుజ్జు నుజ్జు అయింది. రిక్షా వాల్లు ఇద్దరికి స్వల్పగాయలు అయ్యాయి. ఆటో డ్రైవర్ కు తీవ్రగాయాలు కావడంతో ,ఆస్పత్రికి తరలించారు. అంబులెన్స్ చెన్నై నుండి కోల్ కత్తా కు డెడ్ బాడీ తో వెళుతుంది. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు, కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఉధృతంగా కాగ్నా నది జాగ్రత్తలను పాటించాలని ఎస్పీ సూచన

వికారాబాద్

జిల్లా ప్రజలు వర్షంలో ప్రయాణించే సమయంలో జాగ్రత్తలు పాటించాలని జిల్లా ఎస్పీ నారాయణ రెడ్డి సూచించారు. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో జిల్లాలో నాలుగైదు మండలాల్లో వాగులు ఉధృతంగా ప్రవహిస్తోన్నాయి కాబట్టి ప్రజలు అందరూ తగు జాగ్రత్తలు పాటించాలని ఎస్పీ నారాయణ రెడ్డి తెలిపారు. యాలాల్ , కరన్ కోట్, బోంరాస్ పేట్, తాండూరు మండలాల్లో కాగ్నానది ఉధృతంగా సాగుతోందనీ అవసరమైతే తప్ప ప్రజలు టూవిల్లర్ పై ప్రయాణం చేయవద్దన్నారు. కల్వర్టుల పైన ఒక ఫీట్ నీళ్లు ప్రవహిస్తునందన రోడ్డుపై నుండి దాటవద్దని సూచించారు. స్కిడ్ అయి పడిపోతే ప్రాణాలు పోయే ప్రమాదం ఉందని తెలిపారు.

కల్వర్టుల వద్ద ఇప్పటికే భారీ కేడ్లు ఏర్పాటు చేసి వాహన దారులకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నరు. అపద సమయంలో 100కు డైల్ చేస్తే పోలీసులు తగిన సహాయ చర్యలు చేస్తారని ప్రజలంతా అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ కోరారు.

# తహసీల్దార్ కార్యాయం ముందు యువకుడి ఆత్మహత్యాయత్నం

వికారాబాద్

కుల్కచర్ల తహసీల్దార్ కార్యాలయం ముందు యువకుడు పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేసాడు. ఘనాపూర్ కు చెందిన నందకుమార్ తన తండ్రి పేరిట ఉన్న భూమి విరాసత్ చేయడం లేదంటూ తల్లితో కలిసి ఆత్మహత్యాయత్నం చేసాడు. పెట్రోల్ పోసుకోగానే స్థానికులు వెంటనే అడ్డుకున్నారు. పోలీసులు తల్లి కొడుకులను స్టేషన్ కు తరలించారు. తండ్రి కుర్వ రామయ్య పేరిట ఘణాపూర్ గ్రామంలో 626/1 లో 5 ఎకరాల పొలం వుంది. 2019 లో తండ్రి మరణించాడు. అయితే భూమి కాస్తులో మరొకరు వుండడంతో బాధితులు కోర్టును ఆశ్రయించారు. 2024 లో జూన్ లో తల్లి పేర విరాసత్ చేయమని కోర్టు ఆర్డర్ ఇచ్చింది. అప్పటి నుండి తహశీల్దార్ కార్యాలయం చుట్టూ బాధితులు తిరుగుతున్నారు. ఇంతవరకు పని కాకపోవడంతో చేసేదేమీ లేక పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేసారు.

# వ్యవసాయ విశ్వవిద్యాలయంలో విద్యార్థి ఆత్మహత్య

రంగారెడ్డిరాజేంద్రనగర్ ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అగ్రి బీఎస్సీ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థి రిత్విక్ రాజ్ ఆత్మహత్య చేసుకున్నారు.

సృహ తప్పి పడివున్న రిత్విక్ ను తోటి విద్యార్దులు హుటాహుటిన లంగర్ హౌజ్ లోని మైత్రి ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మృతుడు యూనివర్సిటీ హాస్టల్ లో ఉంటూ చదువుకుంటున్నాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. విద్యార్థి మృతదేహాన్ని పోలీసులు ఉస్మానియా ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

# ప్రైవేట్ స్కూళ్లలో ఫ్రీ అడ్మిషన్స్

కర్నూలు, ఆగస్టు 13,

విద్యా హక్కు చట్టం కింద ఆంధ్రాలోని ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత సీట్ల కేటాయింపు పరిధిని ప్రభుత్వం విస్తరించింది. గతంలో ఒకటో తరగతిలో ఉచిత సీట్లు కేవలం 3 కి.మీ పరిధిలో ఉన్న విద్యార్థులకు మాత్రమే లభించేవి. తాజాగా ప్రభుత్వం ఆ పరిధిని 5 కి.మీ వరకు పెంచింది. దీంతో మరింత మంది పిల్లలు ఉచితంగా చదివే అవకాశం పొందుతున్నారు. ఈ సీట్ల ఖర్చు మొత్తాన్ని ప్రభుత్వం భరిస్తుంది. తల్లిదండ్రులు ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదు. మిగిలిన సీట్ల భర్తీ కోసం ప్రభుత్వం మూడో నోటిఫికేషన్ జారీ చేసింది. ఒకటో తరగతిలో 25% సీట్ల కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. గతంలో ఉన్న కొన్ని షరతులను ఈసారి సడలించారు.సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఐబీ లేదా రాష్ట్ర సిలబస్ పాఠశాలల్లో ప్రవేశం కోసం దరఖాస్తు చేయవచ్చు. అనాథ పిల్లలు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, హెచ్ఐవీ బాధితులు, మైనారిటీలు, తక్కువ ఆదాయం గల ఓసీ విద్యార్థులకు ఇది మంచి అవకాశం. సీబీఎస్ఈ/ఐసీఎస్ఈ/ఐబీ పాఠశాలల్లో చేరాలనుకుంటే.. పుట్టిన తేదీ 2019 ఏప్రిల్ 2 నుంచి 2020 మార్చి 31 మధ్యలో ఉండాలి. రాష్ట్ర సిలబస్ పాఠశాలల్లో చేరాలనుకుంటే.. బర్త్ డేట్ 2019 జూన్ 2 నుంచి 2020 మే 31 మధ్యలో ఉండాలి. బలహీన వర్గాల బీసీ, మైనారిటీ, ఓసీ గ్రామీణ ప్రాంతాల కుటుంబాల వార్షిక ఆదాయం రూ.1.20 లక్షలకు మించకూడదు. పట్టణ ప్రాంతాల్లో అయితే రూ.1.44 లక్షలకు దాటకూడదు.పాఠశాల ఎంపిక కోసం సచివాలయం, ఎంఈవో ఆఫీసు, మీ సేవ కేంద్రాలు లేదా ఇంటర్నెట్ ద్వారా వివరాలు తెలుసుకోవచ్చు. మొదట ఒక కి.మీ పరిధిలో ఉన్న దరఖాస్తులను పరిశీలించి, ఆ తర్వాత 5 కి.మీ పరిధిలో ఉన్న దరఖాస్తులను పరిగణనలోకి తీసుకుంటారు. ఎంపికైన విద్యార్థుల పేర్లు ఎస్ఎంఎస్ ద్వారా తెలియజేస్తారు. తల్లిదండ్రుల ఆధార్ / ఓటరు ఐడీ / రేషన్ కార్డు లేదా ఇతర చిరునామా రుజువు పత్రాలు కావాల్సి ఉంటుంది. పిల్లల జనన ధృవీకరణ పత్రం కూడా ఉండాలి. దరఖాస్తులను ఈ నెల 12 నుంచి 20వ తేదీ వరకు.. లిలిలి.ఇబవ.జీజూ.ఐనీల.తిని వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

================

## సాగర్ కు భారీ వరద పోటు

నల్గొండ

నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ కు భారీ వరద ప్రవాహం పోటెత్తింది. దాంతో అధికారులు 26 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేసారు. ఇన్ ఫ్లో, 1,74,533 క్యూసెక్కులు, ఔట్ ఫ్లో : 2,33,051 క్యూసెక్కులు . పూర్తి స్థాయి నీటి మట్టం : 590 అడుగులు. ప్రస్తుత నీటి మట్టం : 589.30. పూర్తి స్థాయి సామర్థ్యం : 312.0450 టీఎంసీలు. ప్రస్తుత సామర్థ్యం : 309.95 టీఎంసీలు

## పెదకూరపాడులో పొంగుతున్న వాగులు

## పలు ప్రాంతాలు జలమయం

పల్నాడు

పెదకూరపాడు నియోజకవర్గం లో మంగళవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలు కారణంగా వాగులు పొంగు పొర్లుతున్నాయి. ఇళ్లు మోకాళ్ళలోతు జలమయం అయ్యాయి.. క్రోసూరు మండలం దొడ్లేరు గ్రామం లో వాగు పొంగి పొర్లు తుండడంతో పిడుగురాళ్ల...క్రోసూరు మధ్య రాక పోకలు బందు అయ్యాయి. అచ్చంపేట చిగురుపాడు అమరావతి మండలం పెద్ద మద్దూరు కాలువలు పొంగిపొర్లుతున్నాయి

## ఈడీ ముందుకు మంచు లక్ష్మి

హైదరాబాద్

నటి మంచు లక్ష్మి బుధవారం బషీర్ బాగ్ లోని ఈడీ కార్యాలయానికి విచారణ నిమిత్తం చేరుకున్నారు. ఆమె పై బెట్టింగ్ యాప్స ప్రమోషన్స్ కు భారీగా డబ్బులు తీసుకున్న ఆరోపణలు ఉన్నాయి. ఆన్లైన్ బెట్టింగ్ యాప్స్ కేసులో నటి మంచు లక్ష్మి నేడు ఎన్ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ముందు విచారణకు హాజరయ్యారు.

## డీపీఎస్ లో ఘనంగా హర్ ఘర్ తిరంగా

నాచారం

79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నాచారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ పాఠశాలలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు, డిపిఎస్ చైర్మన్ ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య లు హాజరయ్యారు. ఈ సందర్భంగా రామ్ చందర్ రావు మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా హర్ గర్ తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం పిలుపు మేరకు గడచిన ఐదేళ్లుగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని, హర్ ఘర్ తిరంగాలో భాగంగా 40 లక్షల ఇళ్లపై జాతీయ జెండా ఎగురవేస్తామన్నారు. ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా తమ ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. విభజన సందర్భంగా చోటు చేసుకున్న విషాద ఘట్టాలను తెలియజేసేందుకు 14న విభజన దినంగా పరిగణిస్తామని, ఈ సందర్భంగా మౌన ర్యాలీలు నిర్వహిస్తామని రాంచంద్రరావు వివరించారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులు నిర్వహించిన సంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి..

## గురువారం నాడు కూకట్ పల్లి లో తిరంగా ర్యాలీ

హైదరాబాద్

కూకట్ పల్లి నియోజకవర్గం లో స్వచ్ భారత్ అభియాన్ అధ్యక్షుడు కాంతారావు ఆధ్వర్యంలో రేపు జరగబోయే "ఏ మార్చ్ ఫర్ ది నేషన్" పేరిట తిరంగా ర్యాలీని నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా బుధవారం తన నివాసంలో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు తో పాటు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పార్లమెంట్ సభ్యుడు ఈటెల రాజేందర్ సైతం హాజరవుతారని ఆయన ప్రకటించారు. దేశం కోసం, మన కోసం నడుం బిగించి ప్రతి ఒక్కరు ఈ ర్యాలీలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. మోడీ నాయకత్వంలో భారతదేశం అభివృద్ధి చెందడంతో పాటు అన్ని దేశాలకు దీటుగా ఆర్థిక , రక్షణ వ్యవస్థను పటిష్టం చేసుకుంటుందని ఈ సందర్భంగా తెలిపారు. ఈ తిరంగా ర్యాలీ రేపు ఉదయం 8 గంటలకు నిజాంపేట్ క్రాస్ రోడ్డు నుండి కూకట్ పల్లి కూడా ట్రక్ పార్క్ వరకు సాగుతుందని అన్నారు.

## తుళ్లూరు లో బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణ పనులు ప్రారంభం

విజయవాడ

తుళ్లూరులో బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి నిర్మాణ పనులకు శ్రీకారం చూట్టారు. నిర్మాణ పనులకు ట్రస్ట్ ఛైర్మన్ నందమూరి బాలకృష్ణ పూజలు జరిపారు. పూజా కార్యక్రమాల్లో నారా బ్రాహ్మణి, అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు పాల్గొన్నారు. రూ.750 కోట్లతో మొదటి ఫేజ్ 500 పడకలు, రెండో ఫేజ్ లో మరో 500 పడకలకు విస్తరణ జరగనున్నాయి..

# ఏపీలో ఎల్ ఆర్ ఎస్

విజయవాడ, ఆగస్టు 13

తెలంగాణలో అమలులో ఉన్న లే ఔట్ రెగ్యూలరైజేషన్ స్కీమ్ ను ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా అమలు చేస్తోంది. అనుమతి లేని లే ఔట్లలో ప్లాట్ కొనుగోలు చేసి, రిజిస్ట్రేషన్ చేసుకున్నవారు ఇక నుంచి ఆ ప్రాపర్టీలను క్రమబద్ధీకరించుకునే అవకాశం కల్పించింది. ఎల్ఆర్ఎస్ ద్వారా ప్లాట్లు రెగ్యూలరైజ్ చేసుకుంటే ఆ ప్రాపర్టీ యజమానులకు ఏ సమస్యా ఉండదు. అవసరమైతే వాటిని ఏ సమస్యా లేకుండా విక్రయించుకునే అవకాశం ఉంటుంది. ఈ ఏడాది జూన్ వరకు పర్మిషన్ లేని లేఔట్లలో ప్లాట్లు కొని రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు ఎల్ఆర్ఎస్ పథకానికి అర్హులు అని ప్రభుత్వం తెలిపింది. అక్టోబర్ నెలాఖరు వరకు దరఖాస్తు చేసుకున్న వారు అర్హులు.

2025 జూన్ 30 లోపు ఏపీలో అనుమతులు లేని లే ఔట్లలో ప్లాట్ కొని రిజిస్ట్రేషన్ చేసుకున్నవారు ఒఖీూకు అర్హులు.

– ఈ అక్టోబరు నెలాఖరు వరకు దరఖాస్తులు చేసుకునే వారికి మాత్రమే వర్తిస్తుందిదరఖాస్తు ప్రక్రియ: ఆన్లైన్లో దరఖాస్తు

– సమీపంలో ఉన్న లైసెన్సుతో ఉన్న టెక్నికల్ పర్సన్ (ఒఖ) ద్వారా లేదా

– మీరే సొంతంగా ఒఖీూ పోర్టల్లో దరఖాస్తు చేయవచ్చు.

– అవసరమైన పత్రాలు: రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు, లేఔట్ కాపీ మొదలైనవి అప్లోడ్ చేయాలి.

ఫీజు చెల్లింపు, డిస్కౌంట్

– కనీస మొత్తం ?10,000 చెల్లించాలి.

– మొత్తం ఫీజును 45 రోజుల్లో చెల్లిస్తే 10% డిస్కౌంట్ లభిస్తుంది.

– 45 నుంచి 90 రోజుల్లో చెల్లిస్తే 5% మాత్రమే రాయితీ.

– అదనంగా 14% ఓపెన్ స్పేస్ ఛార్జీలో 7% రాయితీ వర్తిస్తుంది.

ఒఖీూ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ:

– మున్సిపల్ సిబ్బంది ఆ ప్రాంతాన్ని పరిశీలించి తాత్కాలిక లేఔట్ నమూనా తయారు చేస్తారు.

–కనీసం 30 అడుగుల రోడ్లు ఉండేలా లేఔట్ డిజైన్ చేస్తారు.

–అభ్యంతరాలతో పాటు ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరిస్తారు.

– అభ్యంతరాలేని ప్లాట్లకు మిగిలిన ఫీజు వసూలు చేసి వాటిని వెంటనే క్రమబద్ధీకరిస్తారు.

సీఆర్డీఏ పరిధిలో వర్తించదు

రాష్ట్రవ్యాప్తంగా అనుమతులు లేకుండా 13,667 లేఔట్లు ఏర్పాటయ్యాయని కూటమి ప్రభుత్వం అంచనా చేసింది. సీఆర్డీఏ పరిధిలోని 29 గ్రామాలకు ఎల్ఆర్ఎస్ స్కీమ్ వర్తించదు. లేఔట్ ప్లాన్ (ఒఖ) నంబర్ చెప్పి అనుమతుల వివరాలు సమీప టౌన్ ప్లానింగ్ కార్యాలయంలో తెలుసుకోవచ్చు. ఏమైనా సందేహాలు ఉంటే హెల్ప్లైన్ నంబర్ 79816 51881 లో సంప్రదించాలని ప్రజలకు సూచించారు.

ఒఖీూతో కలిగే ప్రయోజనాలు:

– ఇంటి నిర్మాణానికి ప్రభుత్వ అనుమతులు పొందొచ్చు.

– హౌసింగ్ లోన్లకు బ్యాంకులు అంగీకరిస్తాయి.

– ఫీజు, ఓపెన్ స్పేస్ ఛార్జీలపై 14 శాతం డిస్కౌంట్లు లభిస్తాయి.

– లే ఔట్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి సాధ్యం.

తెలంగాణలో 2020లో ఈ స్కీమ్ తీసుకురాగా, పర్మిషన్ లేని లేఔట్లలో ప్లాట్లు కొని ఇబ్బందులు పడుతున్న వారి నుంచి మంచి స్పందన లభించింది. రాయితీ ఇస్తామని చెప్పడంతో తెలంగాణలో లక్షల మంది ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే కొన్ని ప్రాంతాల్లో లేఔట్లకు పర్మిషన్ రాగా, కొన్ని చోట్ల ఇంకా రిజిస్ట్రేషన్ సమస్యలు, లేఔట్ల క్రమబద్ధీకరణ సమస్యలు ఇంకా అలాగే ఉన్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఎల్ఆర్ఎస్ దరఖాస్తులపై చర్యలు తీసుకుని వాటిని క్రమబద్ధీకరిస్తామని సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. కానీ కేవలం జీహెచ్ఎంసీ పరిధిలో మాత్రమే పరిష్కారం లభించగా.. రాష్ట్రంలోని మిగతా ప్రాంతాల్లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు ఇంకా పెండింగ్లో ఉన్నాయని తెలిసిందే.

# 17 తర్వాత డీఎస్సీ సర్టిఫికెట్లు

నెల్లూరు, ఆగస్టు 13,

ఆంధ్రప్రదేశ్ డీఎస్సీ ఫలితాలు విడుదలయ్యాయి. క్వాలిఫై అయిన అభ్యర్థులు తమ స్టాటస్ ఏంటో? జిల్లాలో, జోన్లో తామ ర్యాంకు ఎంతో ఉద్యోగం వస్తుందో రాదో అన్న చర్చ నడుస్తోంది. జిల్లా ఆయా సబ్జెక్టుల్లో టాప్ మార్కులు ఎన్ని కటాఫ్ ఎంత ఉండొచ్చు అనే వివరాలపై ఆరా తీస్తున్నారు. స్కోర్ కార్డును అధికారిక వెబ్సైట్లో పెట్టిన అధికారులు మరో రెండు రోజుల్లో మెరిట్ లిస్ట్ విడుదల చేసేందుకు అవకాశం ఉంది. సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఎప్పటి నుంచి ఉంటుందో అనే విషయాలపై చర్చించుకుంటున్నారు.ఆంధ్రప్రదేశ్లో డీఎస్సీ అనేది జిల్లా స్థాయి, జోన్ స్థాయి అభ్యర్థుల కోసం నిర్వహించే పరీక్ష. ఉద్యోగాల నియామకం జిల్లాల వారీగా, జోన్ల వారీగా భర్తీ చేస్తారు. ఇదే విషయం నోటిఫికేషన్ టైంలోనే వెల్లడించారు. ఏ జిల్లాకు ఏ సబ్జెక్ట్ ఎన్ని ఉద్యోగాలు ఉన్నాయ. ఏ జోన్లో ఎన్ని ఉద్యోగాలు ఉన్నాయో స్పష్టంగా తెలియజేశారు. ఏ కేటగిరికి ఎన్ని ఉద్యోగాలు వస్తున్నాయి. నాన్ లోకల్ అభ్యర్థులకు ఎన్ని ఉద్యోగాలు ఇస్తారో కూడా ముందే లెక్కలు వేసి చెప్పేశారు.సాధారణంగా పరీక్ష తర్వాత జరిగే ప్రక్రియ నోటిఫికేషన్ టైంలోనే జరిగిపోయినందున మెరిట్ జాబితా తయారు చేయడం పెద్ద సమస్యగా ఉండదు. న్యాయపరమైన చిక్కులు కూడా ఉండేందుకు అవకాశమే లేదు. కాబట్టి జిల్లా స్థాయి అధికారులు ఈ పని మీదే ఉన్నారు.టెట్ మార్కుల్లో మార్పులు చేర్పులకు అవకాశం ఇచ్చారు. ఇలా చేయడం ఇదే తొలిసారి. చాలా మంది టెట్ మార్కులు తప్పుగా వేశారని గుర్తించిన అధికారులు స్కోర్ కార్డు ప్రకటించిన తర్వాత కూడా టెట్ మార్కులు సవరణకు అవకాశం ఇచ్చారు. దీని కారణంగా ఫైనల్ స్కోర్లో మార్పులు జరగొచ్చు.ఇప్పుడు టెట్లో క్వాలిఫై కాని అభ్యర్థులు కూడా టెట్ క్వాలిఫై అయినట్టు చెప్పుకొని పరీక్షలు రాశారు. కొందరు తప్పుగా మార్కులు నమోదు చేశారు. వీళ్లందరికి మరో అవకాశం ఇచ్చేందుకు టెట్ మార్కులు ఎడిట్ ఆప్షన్ ఇచ్చారుతప్పులు సవరించుకోవడానికి గడువు ఇచ్చినందుకున ఆ తర్వాతే మెరిట్ లిస్ట్ను తయారు చేస్తారు. తప్పులు కరెక్షన్ చేసిన తర్వాత జిల్లా, జోనల్ స్థాయి మెరిట్ జాబితాను సిద్ధం చేస్తారు. అనంతరం వాటిని వెబ్సైట్లో పెట్టనున్నారు. అనంతరం ఆగస్టు 17 తర్వాత సర్టిఫికెట్ వెరిఫికేషన్కు సమయం కేటాయిస్తారు.సర్టిఫికెట్ వెరిఫికేషన్ అయిన తర్వాత ఉద్యోగాలు వచ్చిన వారి పూర్తి జాబితాను అధికారులు వెబ్సైట్లో పెట్టనున్నారు. అలా ఫైనల్ లిస్ట్లో పేర్లు ఉన్న వాళు కౌన్సెలింగ్ నిర్వహించి స్కూల్స్ ఎంచుకునే అవకాశం కల్పిస్తారు. ఆ ప్రక్రియ పూర్తి అయన తర్వాత వాళ్లకు అపాయింట్మెంట్ ఆర్డర్లు ఇవ్వనున్నారు. ఇది ఆగస్టు చివరి వారాంతానికి పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ముందుగా 17 నాటికి అపాయింట్మెంట్ ఆర్డర్లు ఇస్తామని అన్నారు కానీ అది ఇప్పుడు సాధ్యమయ్యేలా కనిపించడం లేదు.

# ఆశా కార్యకర్తలకు గుడ్ న్యూస్

ఏలూరు, ఆగస్టు 13,

ఆశా కార్యకర్తలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీపికబురు వినిపించింది. ఆశా కార్యకర్తలకు 180 రోజులు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలని నిర్ణయించింది. మొదటి రెండు ప్రసవాలకు ఇది వర్తించనుంది. అలాగే గ్రాట్యుటీ కింద రూ.1.50 లక్షలు వరకూ ఇవ్వాలని నిర్ణయించింది. ఆశా కార్యకర్త పదవీ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. మార్చి నెలలో ఆరోగ్యశాఖపై జరిగిన సమీక్షలో సీఎం చంద్రబాబు ఈ మూడు నిర్ణయాలకు ఆమోదం తెలపగా.. ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది.ఆగస్ట్ 15 సందర్భంగా ఆశా కార్యకర్తలకు ఏకంగా మూడు శుభవార్తలు చెప్పింది. ఆశా కార్యకర్తల సంక్షేమం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మూడు ముఖ్యమైన నిర్ణయాలు తీసుకుంది. దీనికి సంబంధించిన ఉత్తర్వులను తాజాగా జారీ చేశారు. ఆశా కార్యకర్తల ప్రసూతి సెలవుల విషయంలో ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆశా కార్యకర్తలు అందరికీ మొదటి రెండు ప్రసవాల కోసం 180 రోజులు పూర్తి జీతంతో ప్రసూతి సెలవులు ఇవ్వాలని నిర్ణయించింది. అలాగే ఆశా వర్కర్ల పదవీ విరమణ వయసును 62 ఏళ్లుగా నిర్ణయించారు. వీటితో పాటుగా ఆశా కార్యకర్తల గ్రాట్యూటీ విషయంలోనూ ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సర్వీస్ పూర్తైన ఆశా కార్యకర్తలకు గ్రాట్యుటీ సంవత్సరానికి నెలవారీ గౌరవ వేతనంలో 50 శాతం అంటే 5,000 చెల్లిస్తారు..గరిష్టంగా మొత్తం రూ.1,50,000 వరకు ఇస్తారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి ఎం.టీ. కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు.మరోవైపు 2024 ఏపీ ఎన్నికల సందర్భంగా ఆశా కార్యకర్తలకు మిగతా ప్రభుత్వ ఉద్యోగుల తరహాలోనే వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. అలాగే గ్రాట్యుటీ, ఉద్యోగ విరమణ వయసు పెంపుపైనా వారికి హామీలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది మార్చి నెలలో ఆరోగ్య శాఖపై జరిగిన సమీక్షా సమావేశంలో సీఎం నారా చంద్రబాబు నాయుడు వీటిపై నిర్ణయం తీసుకున్నా?రు. ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా సుమారుగా 42,752 మంది ఆశా వర్కర్లు పనిచేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 37 వేల మంది ఆశా కార్యకర్తలు పనిచేస్తూ ఉంటే.. పట్టణ ప్రాంతాల్లో 5,735 మంది ప్రజలకు సేవలందిస్తున్నారు. గర్భిణులు, చిన్నారుల ఆరోగ్య సంరక్షణలో ఆశా కార్యకర్తలదే కీలక పాత్రఅయితే ప్రజారోగ్య సంరక్షణలో కీలకంగా ఉండే ఆశా వర్కర్లకు ప్రభుత్వం ప్రతి నెలా రూ.10000 చొప్పున వేతనం అందిస్తున్న సంగతి తెలిసిందే. అయితే ప్రభుత్వం అందించే గౌరవ వేతనాలు తప్ప వారికి అదనపు ఆర్థిక ప్రయోజనాలు లేవు. ఈ నేపథ్యంలోనే ఆశా కార్యకర్తగా 30 ఏళ్లపాటు సేవలు అందించిన వారికి గ్రాట్యుటీ కింద రూ.1.50 లక్షలు వరకూ చెల్లించేందుకు మార్చి నెలలోనే సీఎం చంద్రబాబు ఆమోదం తెలిపారు.అలాగే ఆశా కార్యకర్తలకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇచ్చేందుకు ఆమోదం తెలిపారు. తొలి కాన్పు సమయంలో మూడు నెలలు, రెండో కాన్పు సమయంలో మరో మూడు నెలలు వేతనంతో కూడిన ప్రసూతి సెలువులు ఇచ్చేందుకు అంగీకారం తెలిపారు. ఇక ఆశా వర్కర్ల ఉద్యోగ విరమణ వయసును కూడా 60 సంవత్సరాల నుంచి 62 ఏళ్లకు పెంచుతూ అప్పట్లో నిర్ణయించారు. ఈ మూడు నిర్ణయాలకు సంబంధించి ఏపీ ప్రభుత్వం నుంచి తాజాగా ఉత్తర్వులు విడుదల అయ్యాయి.

## కొత్వాల్ గూడ ఎకో పార్క్ పై ప్రభుత్వ నిర్లక్ష్యం: కేటీఆర్

హైదరాబాద్

కొత్వాల్ గూడా ఎకో పార్క్ ఆలస్యంపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు గుప్పించారు. 13 నెలల క్రితం ఆలస్యాన్ని గుర్తించిన కేటీఆర్, పనుల ఆలస్యం పైన ప్రభుత్వానికి సూచనలు చేసారు. బీఆర్ఎస్ ప్రభుత్వం దాదాపు రెండు సంవత్సరాల క్రితమే మెజార్టీ భాగం పనులను పూర్తి చేసింది . అయినా ఈరోజు వరకు పార్క్ ప్రారంభం కాని దుస్థితి వుందని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజల సేవ కంటే రాజకీయాలు, ప్రచారానికే ప్రాధాన్యత ఇస్తోందన్న కేటీఆర్ ఆరోపించారు. హైదరాబాదీల కోసం నిర్మించిన అంతర్జాతీయ స్థాయి పార్క్, ప్రస్తుత ప్రభుత్వ అసమర్థత, నిర్లక్ష్యం కారణంగా నిలిచిపోయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో అసమర్థత, నిర్లక్ష్యం ప్రధాన లక్షణాలుగా మారాయని వ్యాఖ్యనించారు. ప్రజల సౌకర్యాలు, అభివృద్ధి పనులు పక్కనపెట్టి, రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రచార యాత్రలకే ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. హైదరాబాద్ ప్రతిష్ఠను పెంచే ఈ ప్రాజెక్ట్, అధికారుల నిర్లక్ష్యం, ప్రభుత్వ అశక్తతతో నిలిచిపోయిందనీ ఆరోపించారు. ఇది నిస్సహాయ ప్రభుత్వం, నిస్సహాయ పాలన అని కేటీఆర్ అన్నారు.

## భారీ వర్షాల దృష్ట్యా రానున్న 72 గంటలు హై అలర్ట్

గోదావరిఖని :

రానున్న 72 గంటల పాటు రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయని, వాతావరణ శాఖ సూచించిందని, భారీ వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కమిషనరేట్ పరిధిలోని ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకి రావద్దని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఈరోజు ఒక ప్రకటనను విడుదల చేశారు. పెద్దపల్లి, మంచిర్యాల జోన్ పోలీసు యంత్రాంగం నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటుందని తెలియజేసారు. ఎవరైనా ఆపదలో ఉంటే వెంటనే, స్థానిక పోలీస్ అధికారులకు లేదా డయల్ 100కి ఫోన్ చేసి పోలీసు వారి సహాయం పొందగలరని తెలిపారు. అధికారుల సూచనలను పాటిస్తూ పోలీసు వారికి సహకరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

భారీవర్షాల నేపథ్యంలో ప్రజలు ఈ జాగ్రత్తలు తీసుకోవాలి.

రాగల 72 గంటల్లో పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది కావున ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటికి రాకూడదని సీపీ తెలిపారు.

వర్షాలు కురుస్తున్నందున రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ప్రజల భద్రత మరియు ప్రాణా రక్షణ ను దృష్టిలో పెట్టుకొని డ్యామ్స్ మరియు పర్యాటక ప్రాంతాలను తాత్కాలికంగా మూసివేయడం జరిగింది అని సాధారణ పరిస్థితి వచ్చే వరకు అక్కడికి ఎవరు ప్రజలు వెళ్లకూడదని సూచించారు.

రామగుండం పోలీస్ కమిషనరేట్ ప్రజలకు ఎలాంటి ప్రమాదం తలెత్తకుండా పోలీస్ శాఖ పరంగా తగిన ఏర్పాట్లతో ముందస్తుగా పకడ్బందీ చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని ప్రజలు పోలీసు వారి సూచనలు సలహాలు పాటిస్తూ సహకరించాలన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు,కాలువలు,నదులు, రిజర్వాయర్లు,చెరువుల వద్దకు వెళ్ళరాదు.

చెట్ల కింద, పాడైన భవనాలు కింద, శిథిలావస్థలో ఉన్న భవనాల్లో ఉండరాదు. విద్యుత్ స్థంభాలు, ట్రాన్స్ఫార్మర్స్ ముట్టుకోరాదు.

ఎవ్వరు కూడా ఎట్టిపరిస్థితుల్లో కూడా చెరువులోకి, నాలాలు, డ్యామ్స్, వాటర్ ఫాల్స్ లేదా చేపల వేటకు గాని వెళ్ళరాదు. అత్యవసరమైతేనే ఇంటి నుండి బయటకు రావాలి.

స్థానిక రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీ, విద్యుత్, ఆర్అండ్బి, వైద్య శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఎక్కడైనా రోడ్ల పై వరద ఉధృతితో రోడ్లు తెగిపోయినా, ఉధృతంగా ప్రవహించినా అక్కడికి ఆ గ్రామ ప్రజలు వెళ్లకుండా, రెండు దిక్కులా ప్లాస్టిక్ కోన్స్,బారిగేడ్స్, హెచ్చరిక గల ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం జరిగింది.

ప్రతి పోలీస్టేషన్ పరిధిలో ఉన్న చెరువులు, కుంటల అలుగుల దగ్గర, ప్రధాన రహదారులపై ప్రవహించే వాగులు, వంకల దగ్గర నీటి ప్రవాహం గురించి ముందస్తు సమాచారం తెలుసుకొని , ప్రత్యేక్షంగా వెళ్లి పర్యవేక్షించి పోలీసు అధికారులు, సిబ్బంది అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని తెలిపారు.

వరద నీటికి చెరువులు, కుంటలు నిండి చెరువు కట్టలు తెగి పోయే ప్రమాదం ఉంటుంది. కావున ప్రజలు అప్రమత్తంగా ఉండగలరు.

వాహనదారులు ప్రయాణించేటప్పుడు జాగ్రత్తగా ప్రయాణించండి. వర్షానికి రోడ్లు కొట్టుకుపోయి , గుంతలు ఏర్పడి అందులో నీరు నిల్వ ఉండి ఆ గుంతలు వాహనదారులకు కనిపించక ప్రమాదానికి గురి అయ్యి ప్రాణ నష్టం జరిగే ప్రమాదం ఉంది. కావున జాగ్రత్తగా, నెమ్మదిగా చూసుకొని ప్రయాణించండి.

వర్షాలకు కల్వర్టు, చిన్న చిన్న బ్రిడ్జి ల వద్ద నీరు ప్రవహిస్తున్నప్పుడు వాహనాలతో దాటడానికి సాహసం చేయరాదు అని సూచించారు.

# కాలువల్లో ఎప్పటికప్పుడు సిల్ట్ తొలగించండి కమిషనర్ ఎన్.మౌర్య

నగరంలోని అన్ని కాలువల్లో ఎప్పటికప్పుడు సిల్ట్ (చెత్త, పేరుకుపోయిన మట్టి) తొలగించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం ఎల్.ఐ.సి. రోడ్డు, ఆఫీసర్ క్లబ్, రామకృష్ణా పురం, హమీద్ నగర్, మంచినీళ్ల కుంట తదితర ప్రాంతాల్లో ప్రజా పిర్యాదులను అధికారులతో కలసి కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ డ్రెయినేజీ కాలువలు లీక్ అవుతున్నాయని, వర్షపు నీరు ఆగుతున్నాయనే పిర్యాదులు వస్తున్నాయని అన్నారు. నగరంలోని అన్ని ప్రాంతాల్లో గల కాలువల్లో ఎప్పటికప్పుడు సిల్ట్ తొలగిస్తే మురుగునీరు సజావుగా వెళ్లేలా చూడాలని అన్నారు. ఇంటింటి చెత్త సేకరణ సక్రమంగా నిర్వహించాలని అన్నారు. ఉదయం ముందుగా చెత్తకుప్పలు తొలగించాలని అధికారులను ఆదేశించారు. రోడ్లపైన, కాలువల్లో చెత్త వేసేవారిని గుర్తించి జరిమానాలు విధించాలని అన్నారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్ రవి, ఏసిపి మధు, డి.ఈ. లు మధు, శిల్ప, వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ నాగేంద్ర, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య, తదితరులు ఉన్నారు.

# ఆగష్టు 19 - 21 తేదీల్లో అమరావతిలోని ఎస్వీ ఆలయంలో పవిత్రోత్సవాలు

తిరుపతి,

అమరావతిలోని శ్రీ వేంకటేశ్వర ఆలయంలో ఆగష్టు 19 – 21వ తేదీ వరకు పవిత్రోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు టిటిడి ఏర్పాట్లు చేపట్టింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని మహా నగరం అమరావతి ( వేంకటపాలెం)లో టిటిడిచే నిర్మింపబడి, కొలువుతీరి వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయం నందు ప్రప్రథమంగా లోక కల్యాణార్థం, సర్వలోకహితార్థం శ్రీ వేఖానస భగవచ్ఛాస్త్రరీత్యా పవిత్రోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు. ఆగష్టు 18వ తేదీ సాయంత్రం పవిత్రోత్సవాలకు అంకురార్పణం జరుగనుంది. ఉదయం విశ్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, ఆచార్య ఋత్విక్ వరణము, సేనాధిపతి ఉత్సవం, మృత్సంగ్రహణం నిర్వహిస్తారు. ఆగష్టు 19న ఉదయం పంచగవ్యారాధన, అకల్మష హోమం, వాస్తు పూజ, వాస్తు హోమం, స్నపన తిరుమంజనం, సాయంత్రం యాగశాల వైదిక కార్యక్రమాలు, పవిత్ర ప్రతిష్ఠ అధివాసం, సర్వదైవత్య హోమం చేపడుతారు. ఆగష్టు 20న ఉదయం పుణ్యాహవాచనం, కుంభ ఆరాధన, ప్రధాన హోమములు, స్నపన తిరుమంజనం, పవిత్రాభిమంత్రణ, పవిత్ర సమర్పణము, సాయంత్రం యాగశాల వైదిక కార్యక్రమాలు, మహా శాంతి హోమం, తిరువీధి ఉత్సవం నిర్వహిస్తారు. ఆగష్టు 21వ తేదీన ఉదయం పుణ్యాహవచనం, యాగశాల వైదిక కార్యక్రమములు, స్నపన తిరుమంజనం, సాయంత్రం యాగశాల వైదిక కార్యక్రమాలు, పూర్ణాహుతి, కుంభ ప్రదక్షిణ, కుంభ సమర్పణం, విశేష ఆరాధన, ఆచార్య, ఆగమ సలహాదారు, ఋత్విక్కులకు బహుమానం, యాజమాన ఆశీర్వాచనం చేపడుతారు.

# పరిశోధనలకు ప్రతిష్టాత్మక వేదిక అపోలో యూనివర్శిటీ

చిత్తూరు, ఆగష్టు 13:

ది అపోలో యూనివర్శిటీ సైకాలజీ విభాగం, ఏఐఎంఎస్ఆర్ ఎథిక్స్ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో 'డిజైనింగ్ ఎ రీసెర్చ్ ప్రోటోకాల్ అండ్ సబ్మిటింగ్ ఫర్ ఎథికల్ అప్రూవల్' అనే రెండు రోజుల వర్క్‌షాప్ మంగళవారం ప్రారంభమైంది. క్యాంపస్‌లోని అడ్మిన్ బ్లాక్‌లో జరుగుతున్న ఈ వర్క్‌షాప్‌లో పరిశోధన ప్రణాళికల తయారీ, ఎథికల్ అనుమతులు, నైతిక విలువలు వంటి అంశాలపై నిపుణులు విశ్లేషణాత్మకంగా చర్చించనున్నారు.

ముఖ్య అతిథిగా హాజరైన వైస్ ఛాన్సలర్ డా. హెచ్. వినోద్ భట్ మాట్లాడుతూ... యూనివర్శిటీలకు పరిశోధనలు కీలక అంశమని, అపోలో యూనివర్శిటీ పరిశోధనలకు గట్టి మద్దతు ఇస్తూ, అనేక వర్క్‌షాప్‌లు, సెమినార్ల ద్వారా విద్యార్థులకు దిశనిర్దేశం చేస్తోందని చెప్పారు. తమ పరిశోధన విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో స్కాలర్‌షిప్‌లు సాధించారని, పరిశోధనలో ఎథికల్ విలువలకు ఉన్నత ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. ఏఐఎంఎస్ఆర్ ఎథిక్స్ కమిటీకి ప్రభుత్వ గుర్తింపు ఉందని. ప్రతి పరిశోధనను ఎథిక్స్ కమిటీ, సైంటిఫిక్ కమిటీ సమగ్రంగా పరిశీలిస్తాయని, ఇటువంటి వర్క్‌షాప్‌లు విద్యార్థులకు పరిశోధనల్లో మార్గనిర్దేశకంగా నిలుస్తాయని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం. పోతరాజు, రిసోర్స్ పర్సన్లు ఫార్మకాలజీ విభాగం హెడ్, ప్రొఫెసర్ డా. సచిదానంద అడిగ, ఫిజియాలజీ విభాగం ప్రొఫెసర్ డా. విజేత.పి, కమ్యూనిటీ మెడిసిన్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డా. దేవిక పి.జె, సైకియాట్రీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డా. టి.జయప్రియ, సీనియర్ ప్రొఫెసర్ భాస్కర్‌నాయుడు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# శ్రావణమాసంలో పెరిగిన చికెన్, మటన్ ధరలు

విశాఖపట్టణం, ఆగష్టు 13

ఆంధ్రప్రదేశ్‌లో శ్రావణమాస శోభ కనిపిస్తోంది.. మహిళలు పూజల్లో, వరలక్ష్మి వ్రతాల్లో బిజీగా ఉన్నారు. అయితే ఆనవాయితీ ప్రకారం శ్రావణమాసంలో చికెన్ రేట్లు, గుడ్ల రేట్లు తగ్గాలి.. కానీ ఈసారి విచిత్రంగా ధరలు పెరిగాయి. ఏపీలోని పలు జిల్లాల్లో చికెన్ ధరలు గత శ్రావణ మాసంతో పోలిస్తే పెరిగాయట. ఫారం దగ్గర కిలో కోడి మాంసం ధర మాత్రం రూ.220కి చేరింది. రెండు వారాల కిందట ఈ ధర రూ.170 మాత్రమే ఉందంటున్నారు. శ్రావణమాసంలో కోళ్లను మాంసం కోసం అమ్మడంతో గుడ్ల ఉత్పత్తి మరింత తగ్గింది.. ఎండలు ఎక్కువగా ఉండటం వల్ల కోళ్లు తక్కువ గుడ్లు పెడుతున్నాయి. శ్రావణ మాసంలో రేట్లు పెరగడానికి.. ఉత్పత్తి తగ్గడానికి తోడు రాష్ట్రంలో శుభకార్యాలు ఉండటమే కారణం అంటున్నారు. ఇక కోడిగుడ్ల విషయానికి వస్తే.. ఫారం దగ్గర గుడ్డు ధర రూ.5.10కి చేరింది. అయితే ఈ నెల మొదట్లో దీని ధర రూ.4.60గా ఉంది అంటున్నారు. ఇక షాపుల విషయానికి వస్తే.. గుడ్డు రూ.6.50 నుంచి రూ.7 వరకు అమ్ముతున్నారు. గుడ్ల ఉత్పత్తి తగ్గడం వల్ల ధరలు పెరిగాయని రైతులు అంటున్నారు. డిమాండ్ ఎక్కువగా ఉండటం కూడా ధరల పెరుగుదలకు ఒక కారణం అంటున్నారు. గుడ్ల ధరలు పెరుగుతుండటంతో రైతులు కోళ్లను అమ్మడానికి ఇష్టపడటం లేదు. తూర్పుగోదావరి జిల్లా నుండి ఇతర ప్రాంతాలకు గుడ్లు, మాంసం ఎగుమతి అవుతాయి. గతంలో రోజుకు కోటి గుడ్లు ఉత్పత్తి అయ్యేవి. కానీ ఇప్పుడు ఫారాలు తగ్గడంతో 80 లక్షల గుడ్లు మాత్రమే ఉత్పత్తి అవుతున్నాయివీటికి తోడు కోళ్ల పరిశ్రమకు దాణా ధరలు పెరగడం ఆందోళన కలిగిస్తోందట. నెల రోజుల క్రితం రూ.30 ఉన్న సోయా ధర ఇప్పుడు రూ.42 దాటింది అంటున్నారు. మొక్కజొన్న, వరినూక ధరలు కూడా పెరిగాయి.. ఇథనాల్ పరిశ్రమల్లో వీటి వాడకం పెరగడంతో ఈ పరిస్థితి వచ్చింది అంటున్నారు. కోళ్లు, చేపలు, పశువుల దాణా ధరలు పెరిగాయి.. మొక్కజొన్న, వరి ధాన్యం ఎగుమతి అవుతాయనే వార్తలు పరిశ్రమను కలవరపెడుతున్నాయట. మొత్తం మీద శ్రాణ మాసంలో ఏపీలో చికెన్, గుడ్ల ధరలు పెరగడం ఆసక్తికరంగా మారింది.

# కొత్తగా సుధార్ మార్ట్ లు

విశాఖపట్టణం, ఆగష్టు 13,

ఏపీ ప్రభుత్వంవినూత్న నిర్ణయాలు తీసుకుంటోంది. దాదాపు అన్ని శాఖల పరిధిలో స్వతంత్ర నిర్ణయాలు ఉంటున్నాయి. అందులో భాగంగా జైళ్ళ శాఖ ఆధ్వర్యంలో సుధార్ మార్టులు ఏర్పాటు అవుతున్నాయి. విశాఖ సెంట్రల్ జైలులో ఖైదీల జీవితాల్లో మార్పు కోసం జైళ్ల శాఖ వీటిని ఏర్పాటు చేస్తోంది. అక్కడ ఖైదీలు తయారు చేసిన వస్తువులు, కూరగాయలు తక్కువ ధరకి లభిస్తాయి. దుప్పట్లు, బెడ్ షీట్లు, బ్లీచింగ్ పౌడర్, కేకులు, కూరగాయలు వంటివి మార్కెట్ ధర కంటే తక్కువకు అందుబాటులో ఉన్నాయి. అయితే ఈ మార్టుల ద్వారా లభించే డబ్బును ఖైదీల సంక్షేమానికి ఉపయోగిస్తారు. సుధార్ మార్టుగా పిలిచే.. ఈ దుకాణాల్లో కూరగాయల నుంచి కేకుల వరకు? దుప్పట్ల నుంచి బ్లీచింగ్ పౌడర్ వరకు చాలా తక్కువ ధరకే విక్రయిస్తారు. ఏపీ జైళ్ల శాఖ తీసుకున్న ఈ నిర్ణయం మంచి ఫలితాలు ఇస్తోందివిశాఖలోని సెంట్రల్ జైల్లో ఖైదీల జీవితాల్లో మార్పు తెచ్చేందుకు జైళ్ల శాఖ అడుగులు వేస్తోంది. శిక్ష పడిన ఖైదీలకు వృత్తి విద్యలో శిక్షణ ఇస్తున్నారు. వారు తయారు చేసిన వస్తువులు, పండించిన కూరగాయలను, పండ్లను, జైలు అవసరాలకు వాడుతున్నారు. మిగిలిన వాటిని సుధార్ మార్ట్ ద్వారా తక్కువ ధరలకు స్థానికులకు అందిస్తున్నారు. ఖైదీలలో మార్పులు తెచ్చేందుకు జైళ్లలో వారితో అనేక రకాల పనులు చేయిస్తుంటారు. స్వయం ఉపాధికి శిక్షణ కూడా ఇస్తుంటారు. ప్రస్తుతం విశాఖ సెంట్రల్ జైల్లో వివిధ వస్తువుల తయారీలో ఖైదీలకు శిక్షణ ఇస్తుండడం విశేషం. కంప్యూటర్ శిక్షణతో పాటు వాహనాల మెకానిక్, వెల్డింగ్ వంటి కోర్సుల్లో కూడా శిక్షణ ఇస్తున్నారు. చదువుకోవాలనే వారికి దూరవిద్య ద్వారా పరీక్షలు రాయిస్తున్నారు. శిక్షాకాలం వృధా కాకుండా.. వారి జైలు విడుదల తరువాత కూడా జీవితం సాఫీగా సాగేలా ప్రణాళిక రూపొందించారు విశాఖ సెంట్రల్ జైలు అధికారులు. అయితే ఇప్పటికే జైల్లో శాఖ ఆధ్వర్యంలో పెట్రోల్ బంకులు కూడా నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఖైదీలలో సత్ప్రవర్తన తీసుకొచ్చేందుకు ఇలా సరికొత్త ఆలోచనలతో ముందుకు వెళుతున్నారు. అందులో భాగంగానే ఈ సరికొత్త మార్టులు. ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు తాజా కూరగాయలతో పాటు అన్ని రకాల వస్తువులు ఇక్కడ దొరుకుతున్నాయి. దీంతో నగరవాసులు ఎక్కువగా ఇక్కడికి వచ్చి కొనుగోలు చేస్తున్నారు. జైళ్ల శాఖ అధికారుల ఆలోచనను అభినందిస్తున్నారు. అయితే ఇక్కడ తాజా కూరగాయలు ఎక్కువగా లభిస్తుండడంతో జనాలు ఎగబడుతున్నారు. పైగా బయట మార్కెట్ ధర కంటే తక్కువగా లభిస్తున్నాయి ఇక్కడ. రసాయనాల ప్రమేయం లేకుండా ఖైదీలు కూరగాయలు పండిస్తుంటారు. అలా వారు పండించిన ఆకుకూరలు, వంగ కాకర, ఆనప, టమోటా, ఆగాకర, దొండకాయ, బెండకాయ, మునగ కాడలు, క్యారెట్, బీట్రూట్, చిక్కుడుకాయ, బీరకాయ, పొట్లకాయ, ముల్లంగి మొదలైన వాటిని విక్రయిస్తున్నారు. అయితే విశాఖ లాంటి నగరంలో రైతు బజార్లు అందుబాటులోకి వచ్చినా అవి చాలడం లేదు. అయితే ఈ సుధార్ మార్టుల్లో తాజా కూరగాయలు లభిస్తుండడం.. బయట ధర కంటే తక్కువగా ఉండడంతో ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు.

====================

# అగ్రదేశాల్లో భారత్ భయం

న్యూఢిల్లీ, ఆగష్టు 13

భారత్.. ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఒకటి. జీడీపీ పరంగా ఇండియా ప్రస్తుతం ఐదో స్థానానికి చేరింది. పదేళ్లలో ఐదు స్థానాలు ఎగబాకింది. ఇటీవలే జపాన్‌ను కూడా వెనక్కు నెట్టి నాలుగో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించింది. 4.19 ట్రిలియన్ డాలర్ల నామినల్ జీడీపీతో ఈ స్థానం సంపాదించింది. అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) అంచనాల ప్రకారం, 2028 నాటికి భారతదేశం జర్మనీని అధిగమించి మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలవనుంది. ఈ ఎదుగుదలే ప్రపంచ దేశాలకు కటగింపుగా మారింది. భారత్ ఎదుగుదలను ఓర్వలేకపోతున్నాయి. అమెరికాకు అయితే మన ఎదుగుదల అస్సలు మింగుడు పడడం లేదు. ఒకరకంగా చెప్పాలంటే అమెరికాలో భారత్‌అంటే వణుకు మొదలైంది. ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల జాబితాలో యునైటెడ్ స్టేట్స్ 30.51 ట్రిలియన్ డాలర్ల జీడీపీతో మొదటి స్థానంలో ఉంది, ఆ తర్వాత చైనా 19.23 ట్రిలియన్ డాలర్లతో రెండో స్థానంలో నిలిచింది. జర్మనీ (4.74 ట్రిలియన్ డాలర్లు), భారతదేశం (4.19 ట్రిలియన్ డాలర్లు), జపాన్ (4.19 ట్రిలియన్ డాలర్లు) తదుపరి స్థానాల్లో ఉన్నాయి. యూకే 3.84 ట్రిలియన్ డాలర్లు, ఫ్రాన్స్ 3.21 ట్రిలియన్ డాలర్లు, ఇటలీ 2.42 ట్రిలియన్ డాలర్లు, కెనడా 2.23 ట్రిలియన్ డాలర్లు, బ్రెజిల్ 2.13 ట్రిలియన్ డాలర్లతో తర్వాతి ఐదు స్థానాల్లో ఉన్నాయి. ఈ ర్యాంకింగ్‌లు దేశాల ఆర్థిక బలాన్ని, వృద్ధి సామర్థ్యాన్ని సూచిస్తాయి. 2025లో భారతదేశం 4 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా జపాన్‌తో సమానంగా నాల్గవ స్థానంలో నిలిచింది. వ్యవసాయం, టెక్నాలజీ సేవలు, చేనేత పరిశ్రమ, వ్యాపార ఔట్‌సోర్సింగ్ వంటి రంగాలు భారతదేశ ఆర్థిక ప్రగతికి దోహదపడ్డాయి. ఐఎంఎఫ్ అంచనాల ప్రకారం, 2024?25, 2025?26లో భారతదేశ జీడీపీ వృద్ధి రేటు 6.2%గా ఉంటుంది, ఇది ప్రపంచంలోని ప్రముఖ ఆర్థిక వ్యవస్థలలో అత్యంత వేగవంతమైంది. ఇదిలా ఉంటే.. భారతదేశం నాల్గవ స్థానంలో ఉన్నప్పటికీ, తలసరి ఆదాయం 2,880 డాలర్లు (సుమారు రూ. 2.4 లక్షలు)గా ఉంది, ఇది జపాన్ (33,960 డాలర్లు)తో పోలిస్తే గణనీయంగా తక్కువ. అయితే, గత దశాబ్దంలో తలసరి ఆదాయం 188% పెరిగింది, 2015లో రూ. 86,647 నుంచి 2025లో రూ. 2.4 లక్షలకు చేరుకుంది. జనాభా వృద్ధి, ఉపాధి డిమాండ్, ఆర్థిక సంస్కరణలు ఈ పెరుగుదలకు దోహదపడ్డాయి. గత 10 సంవత్సరాలలో భారతదేశ జీడీపీ వృద్ధి రేటు హెచ్చుతగ్గులను చవిచూసింది. 2020లో కోవిడ్ మహమ్మారి సమయంలో ?6.6% వృద్ధి రేటు నమోదైనప్పటికీ, 2021లో 8.68%కి గణనీయంగా పుంజుకుంది. 2023, 2024లో 8.2% వృద్ధి రేటుతో భారతదేశం ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థలలో వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా నిలిచింది.

-2013: 6.39%
- 2014: 7.41%
- 2015: 8.00%
- 2016: 8.26%
- 2017: 6.80%
-2018: 6.45%
- 2019: 3.74%
- 2020: ?6.60%
- 2021: 8.68%
- 2022: 7.00%
- 2023: 8.20%
- 2024: 8.20%

వృద్ధి రేటు నమోదైంది.

భారతదేశం 2027 నాటికి ?5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారే సామర్థ్యాన్ని కలిగి ఉంది. 2028 నాటికి జర్మనీని అధిగమించి మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలవనుంది. ప్రభుత్వ సంస్కరణలు, శ్రామిక, వ్యాపార సౌలభ్యం, పెరుగుతున్న వినియోగం, పెట్టుబడులు ఈ లక్ష్యాన్ని సాధించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. భారత దేశ అభివృద్ధి వేగం.. ఇప్పుడు ప్రపంచంలోని సంపన్న దేశాలకు మింగుడు పడడం లేదు. అందుకే మనను తొక్కేయాలని చూస్తున్నాయ. రష్యా ఒక్కటే మనకు మద్దతుగా నిలుస్తోంది. ఇక అమెరికాకు నంబర్ స్థానానికి ముప్పు వస్తుందనే భయం నెలకొంది. అందుకే డొనాల్డ్ ట్రంప్ ఇప్పుడు భారత్‌ను చూసి జంకుతున్నారు. ఈ క్రమంలోనే మన ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసేలా టారిఫ్‌లు విధిస్తున్నారు.


# పరిశోధనలకు ప్రతిష్టాత్మక వేదిక అపోలో యూనివర్శిటీ

చిత్తూరు, ఆగష్టు 13:ది అపోలో యూనివర్శిటీ సైకాలజీ విభాగం, ఏఐఎంఎస్ఆర్ ఎథిక్స్ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో 'డిజైనింగ్ ఎ రీసెర్చ్ ప్రోటోకాల్ అండ్ సబ్మిటింగ్ ఫర్ ఎథికల్ అప్రూవల్' అనే రెండు రోజుల వర్క్‌షాప్ మంగళవారం ప్రారంభమైంది. క్యాంపస్‌లోని అడ్మిన్ బ్లాక్‌లో జరుగుతున్న ఈ వర్క్‌షాప్‌లో పరిశోధన ప్రణాళికల తయారీ, ఎథికల్ అనుమతులు, నైతిక విలువలు వంటి అంశాలపై నిపుణులు విశ్లేషణాత్మకంగా చర్చించనున్నారు. ముఖ్య అతిథిగా హాజరైన వైస్ ఛాన్సలర్ డా. హెచ్. వినోద్ భట్ మాట్లాడుతూ... యూనివర్శిటీలకు పరిశోధనలు కీలక అంశమని, అపోలో యూనివర్శిటీ పరిశోధనలకు గట్టి మద్దతు ఇస్తూ, అనేక వర్క్‌షాప్‌లు, సెమినార్ల ద్వారా విద్యార్థులకు దిశనిర్దేశం చేస్తోందని చెప్పారు. తమ పరిశోధన విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో స్కాలర్‌షిప్‌లు సాధించారని, పరిశోధనలో ఎథికల్ విలువలకు ఉన్నత ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు.


# యూరియా కోసం రైతుల ఆరిగోస: హరీష్ రావు

సిద్దిపేట

యూరియా కోసం రైతులు నడిరోడ్డెక్కి ధర్నాలు చేసే దుస్థితి కల్పించాయని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పై హరీష్ రావు మండిపడ్డారు. సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్ గ్రామం వద్ద ఎరువుల కోసం క్యూలో బారులు తీరిన రైతులను చూసి అయన ఆగి రైతులతో మాట్లాడారు.

హరీష్ రావు మాట్లాడుతూ రైతులకు యూరియా ఇవ్వలేని చేతగాని, దద్దమ్మ ప్రభుత్వాలు అంటూ ఆగ్రహం వ్యక్తం చేసారు. అరిగోస పెడుతున్న కాంగ్రెస్, బీజేపీలకు రైతుల ఉసురు తగులుతుందని వ్యాఖ్యానించారు. ఎనిమిది మంది బీజేపీ ఎంపీ లు గెలిచి రాష్ట్రానికి ఎరువుల కొరత తీర్చడం లో విఫలం అయ్యారనీ మండిపడ్డారు. ఇద్దరు కేంద్ర మంత్రులు ఉండి ఎరువుల కొరత పై నోరు మెదపడం లేదు.. రైతుల ఉసురు ఉట్టిగా పోదని అన్నారు.

నాలుగు రోజుల నుండి వ్యసాయ పనులు వృధా చేసుకొని రైతులు పడిగాపులుకాస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్, బిజేపీ లకు తగిన గుణపాఠం చెపుతారు.

రేవంత్ రెడ్డి 51 సార్లు ఢిల్లీ కి పోయాడు కానీ ఎరువుల కొరత తీర్చలేదు. మీ ఎమ్మెల్యే రాజ్ గోపాల్ రెడ్డి అన్నాడు. రేవంత్ రెడ్డి తిట్లు ఎక్కువ పని తక్కువ అని ప్రజలకు కావాల్సింది తిట్లు కాదు, పని కావాలి. రేవంత్ రెడ్డి కి తిట్ల మీద ఉన్న ద్యాస.. పని మీద లేదు. రైతులు సూటిగా అడుగుతున్నారు కెసిఆర్ ఉన్నపుడు ఎరువులు ఎట్లా వచ్చాయి.. ఇప్పుడు ఎట్లా రావు అని అన్నారు. వెంటనే ఓటీపీ, ఒక్క బస్తా విధానాన్ని తొలగించాలని డిమాండ్ చేస్తున్నాని అన్నారు.

# కష్టకాలంలో ప్రజలకు అండగా నిలవాలి కేటీఆర్ పిలుపు

హైదరాబాద్

రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా అనేక ప్రాంతాలు జలమయమై, లోతట్టు ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తూ, ఈ విపత్కర పరిస్థితుల్లో బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజా ప్రతినిధులు వర్ష బాధితులకు అండగా నిలవాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. ఇప్పటికే అన్ని రంగాల్లో విఫలమైన ఈ కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకున్నా లేకపోయినా, ప్రతిపక్షంగా మన బాధ్యత ఎక్కువని గుర్తుచేస్తూ, బీఆర్ఎస్ కార్యకర్తలు వెంటనే వరద ప్రభావిత ప్రాంతాలకు వెళ్లి త్రాగునీరు, పాలు, ఆహారం, మందులు, బట్టలు వంటి కనీస అవసరమైన సహాయాన్ని అందించాలన్నారు. అత్యవసర వైద్య అవసరాల కోసం కూడా అవసరమైనచోట మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సహాయక చర్యల్లో స్థానిక ప్రభుత్వ సిబ్బందితో సమన్వయం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

అలాగే, వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు రాబోయే మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దని, లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. వరద నీరు నిలిచిన ప్రాంతాలకు వెళ్లవద్దని హెచ్చరించారు. ముఖ్యంగా వరంగల్, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో ఇప్పటికే వరద వలన తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు ప్రభుత్వ వైఫల్యం వలన ఇబ్బందులు పడుతుండడం పైన ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఈ జిల్లాలకు చెందిన పార్టీ లీడర్లు శ్రేణులు సహాయక చర్యల్లో మరింత చొరవ చూపాలన్నారు. ఈ మేరకు ఆ మూడు జిల్లాల పార్టీ నేతలతో కేటీఆర్ మాట్లాడారు. ఈ కష్టకాలంలో భారత రాష్ట్ర సమితి పార్టీ శ్రేణులు, పార్టీ ప్రజలకు అండగా ఉంటుంది. అందరూ ధైర్యంగా ఉండాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

# కొత్వాల్ గూడ ఎకో పార్క్ పై ప్రభుత్వ నిర్లక్ష్యం: కేటీఆర్

హైదరాబాద్

కొత్వాల్ గూడా ఎకో పార్క్ ఆలస్యంపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు గుప్పించారు. 13 నెలల క్రితం ఆలస్యాన్ని గుర్తించిన కేటీఆర్, పనుల ఆలస్యం పైన ప్రభుత్వానికి సూచనలు చేసారు. బీఆర్ఎస్ ప్రభుత్వం దాదాపు రెండు సంవత్సరాల క్రితమే మెజార్టీ భాగం పనులను పూర్తి చేసింది . అయినా ఈరోజు వరకు పార్క్ ప్రారంభం కాని దుస్థితి వుందని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజల సేవ కంటే రాజకీయాలు, ప్రచారానికే ప్రాధాన్యత ఇస్తోందన్న కేటీఆర్ ఆరోపించారు. హైదరాబాదీల కోసం నిర్మించిన అంతర్జాతీయ స్థాయి పార్క్ ప్రస్తుత ప్రభుత్వ అసమర్థత, నిర్లక్ష్యం కారణంగా నిలిచిపోయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో అసమర్థత, నిర్లక్ష్యం ప్రధాన లక్షణాలుగా మారాయని వ్యాఖ్యానించారు. ప్రజల సౌకర్యాలు, అభివృద్ధి పనులు పక్కనపెట్టి, రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రచార యాత్రలకే ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. హైదరాబాద్ ప్రతిష్ఠను పెంచే ఈ ప్రాజెక్ట్, అధికారుల నిర్లక్ష్యం, ప్రభుత్వ అశక్తతతో నిలిచిపోయిందనీ ఆరోపించారు. ఇది నిస్సహాయ ప్రభుత్వం, నిస్సహాయ పాలన అని కేటీఆర్ అన్నారు.

# భారీ వర్ష సూచన?

## ప్రజలు అప్రమత్తంగా వుండాలని కలెక్టర్ సూచన

ములుగు

ములుగు జిల్లా లోని ప్రజలు వచ్చే నాలుగు రోజులు అధిక వర్షాలు పడుతాయి. కనుక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ములుగు జిల్లా కలెక్టర్ టి. ఎస్. దివాకర్ ములుగు జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రజలు పూరీ గుడిసెలో ఉండరాదని ప్రభుత్వము ఏర్పాటు చేసినా సహాయక కేంద్రం లో ఉండాలని ఆలాగే చెరువులు కాడికి ఆలాగే చేపల వేటకు వెళ్లరాదని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ దివాకర్ ములుగు జిల్లా ప్రజలను కోరారు

# రెండేళ్లైనా ఇంకా ఎప్పుడు నామినేటెడ్ పదవుల కోసం ఆరాటం

కరీంనగర్, ఆగస్టు 13,

నామినేటెడ్ పదవులు ఆశిస్తున్న నేతలు ము మ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 20 నెలలు అయి న నేపథ్యంలో నామినేటెడ్ పదవులను పూర్తిస్థాయిలో భర్తీ చేస్తారనే ఆశాభావం నాయకుల్లో ఉంది. అసెంబ్లీ, లోక్సభ ఎన్నికల సమ యాల్లో టిక్కెట్లకు పోటీపడి నాడు అధిష్ఠానం హామీ మేరకు ఉపసంహరించుకున్న నేతల్లో కొందరికి పదవులు దక్కాయి.చాలామంది నేతల్లో వారికిచ్చిన హామీని నెరవే ర్చుతారనే నమ్మకంతో ఉన్నారు. రాష్ట్ర స్థా యి కార్పొరేషన్ చైర్మన్ల కోసం కీలకమైన కార్పొరేషన్లలో డైరెక్టర్ పదవులతోపాటు, కీలకమైన మార్కెట్ కమిటీ చైర్మన్ పదవుల కో సం ఆశావహులు ప్రయత్నాలు ప్రారంభించారు. దీంతో ఎవరికి పదవీయోగం కలుగు తుందనేది ఆసక్తిగా మారింది.సీఎం రేవంత్ రెడ్డి త్వరలో భర్తీ ఉంటుందని ప్రకటించిన నేపథ్యంలో ఉమ్మడి జిల్లాకు చెందిన మం త్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ల చుట్టూ ఆ శావహులు ప్రదక్షిణలు చేస్తున్నారు. రా ష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక లో క్సభ ఎన్నికలకు ముందు తొలిదశలో రాష్ట్రస్థాయి కార్పొరేషన్లకు పాలకమండళ్లను ని యమించింది.ఉమ్మడి జిల్లా నుంచి మ హిళా కమిషన్ చైర్మన్ గా నేరెళ్ల శారద, ప్ర భుత్వ సలహాదారుగా అర్కాల వేణుగోపాల్, వక్ఫ్బోర్డు చైర్మన్ గా అహ్మద్ పాషా, సుడా చైర్మన్ గా కోమటిరెడ్డి నరేందర్ రెడ్డితోపాటు కరీంనగర్, సిరిసిల్ల, పెద్దపల్లి గ్రంథాల య సంస్థ చైర్మన్లను నియమించారు. మొ త్తం ఏడుగురికి పదవులు దక్కాయి.జిల్లాలోని అందరు నాయకులతో సమన్వయం చేసుకునే సామర్థ్యం కలిగి ఉండడం, కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జిల్లాలో గత పదేళ్లుగా అధికారంలో లేకపోయినా పార్టీని నమ్ముకుని ఉం డడంతోపాటు అదేవిధంగా అభ్యర్థుల విజ యం కోసం శ్రమించిన నాయకులు, బీసీ వర్గాల నుండి ప్రాధాన్యత లభిస్తుందని ఆశిస్తున్నారు. ఇటీవల జిల్లా ఇంచార్జి అద్దంకి దయాకర్ నియోజకవర్గాల వారీగా సమావేశమై నామినేటెడ్ పదవులు ఆశిస్తున్న వారి పేర్లను సేకరించిరు.నియోజకవర్గానికి ఇద్దరి పేర్ల చొప్పున సీల్ కవర్ను పీసీసీ అధ్యక్షుడితోపాటు రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మీనా క్షి నటరాజ్, సీఎం రేవంత్ రెడ్డి ముందుంచారు. రాష్ట్రస్థాయి చైర్మన్ పదవులు ఆశిస్తు న్నవారిలో మాజీ ప్రభుత్వ విప్ ఆరెపల్లి మోహన్, బీసీ నాయకుడు వైద్యుల అంజన్ కు మార్, హుజూరాబాద్ నుండి పత్తి కృష్ణారెడ్డి, వేములవాడ నుంచి మనోహర్ రెడ్డి, సిరిసిల్ల నియోజకవర్గ ఇంచార్జి కేకే మహేందర్ రెడ్డిలు ఉన్నారు.రాష్ట్రస్థాయి డైరెక్టర్ స్థానా లు ఆశిస్తున్నవారిలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పద్మ, మాజీ కార్పొరేటర్ అర్ష కిరణ్మయితోపాటు ప్రస్తుత డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, పార్టీ నాయకులు ఈశ్వర్ గౌడ్, పులి ఆంజనేయు లు గౌడ్, సుజిత్ కుమార్, అరుణ్ తోపాటు పలువురు ఉన్నారు. సీల్ కవర్లో ఎవరి పేర్లు ఉన్నాయో, మంత్రులు ఎవరి పేర్లు సూచిస్తున్నారో నామినేటెడ్ పదవుల భర్తీ అనంతరం తేలనుంది.వివాదాలకు తావులేకుండా పో స్టులు భర్తీ చేయాలని అధిష్టానం ఆలోచిస్తున్నట్లుతెలిసింది.

# అమెరికాకు ప్రధాని..?

న్యూఢిల్లీ, ఆగస్టు 13,

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇండియాపై టారీఫ్లతో విరుచుకపడ్డారు. ఏకంగా 50శాతం పన్నులు విధించారు. రష్యాతో చమురు కొనుగోలు చేయడమే దీనికి కారణంగా చెప్పారు. అటు భారత్ సైతం ట్రంప్ తీరుపై ఫైర్ అయ్యింది. ఈ క్రమంలోనే అమెరికాకు ఝలక్ ఇస్తూ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. అమెరికాతో ఆయుధాల కొనుగోల ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపేసింది. అంతేకాకుండా రక్షణమంత్రి రాజ్నాథ్ సింగ్ యూఎస్ టూర్ను రద్దు చేసుకున్నారు. మరోవైపు ప్రధాని మోడీ ఈ నెలాఖరున జపాన్, చైనాలో పర్యటించనున్నారు. అంతేకాకుండా రష్యా ప్రెసిడెంట్ పుతిన్ను ఇండియా పర్యటనకు రావాలని ఆహ్వానించారు. ఇవి అమెరికాకు ఒక షాక్గా చెప్పొచ్చు. అయితే ప్రధాని మోడీ వచ్చే నెలలో అమెరికాలో పర్యటించే అవకాశం ఉంది. ట్రంప్ టారీఫ్ తర్వాత మోదీ యూఎస్ పర్యటనకు వెళ్లడం ప్రాధాన్యత సంతరించుకుంది.వచ్చే నెలలో జరగనున్న ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సదస్సు కోసం అమెరికా పర్యటనకు ప్రధాని మోదీ వెళ్లే అవకాశం ఉంది. ఈ పర్యటనలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్తో సమావేశానికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ఇటీవల కాలంలో ఇరు దేశాల మధ్య క్షీణిస్తున్న సంబంధాలను మెరుగుపరచడానికి ఈ సమావేశం కీలకం కానుంది. సెప్టెంబర్ 23 నుంచి న్యూయార్క్లో జరిగే ఈ సదస్సులో ప్రధాని మోదీ.. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీతో సహా పలువురు ప్రపంచ నాయకులతో కూడా సమావేశమయ్యే అవకాశం ఉంది. ఈ పర్యటనలో అంతర్జాతీయ సమస్యలపై కీలక చర్చలు జరిగే అవకాశం ఉంది.ట్రంప్ మోదీని చాలాసార్లు స్నేహితుడు అని అన్నారు. అయితే భారత్పై సుంకాల విషయంలో కఠినంగా వ్యవహరించడంతో ఈ స్నేహ సంబంధం దెబ్బతింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రధాని మోదీ వైట్హౌస్ను సందర్శించిన తర్వాత, ఈ సమావేశం జరిగితే ఏడు నెలల్లో ఇద్దరు నాయకుల మధ్య ఇది రెండవ సమావేశం అవుతుంది. ముఖ్యంగా వ్యవసాయం, పాడి పరిశ్రమలకు సంబంధించి అమెరికా దిగుమతులను అనుమతించే విషయంలో భారత్ సుముఖంగా లేదు. దీంతో ఆగ్రహించిన ట్రంప్ భారత్పై 25శాతం సుంకం విధించారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లను కొనసాగిస్తున్నందున అదనంగా మరో 25శాతం సుంకం విధించారు, దీంతో మొత్తం సుంకం 50శాతానికి చేరుకుంది. ఆగస్టు 7న 25శాతం టారీఫ్ అమల్లోకి రాగా.. మిగిలిన సగం ఆగస్టు 27న అమలులోకి రానున్నాయి. ఈ గడువులోగా వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకోవడానికి ఇరు దేశాలు తీవ్రంగా చర్చలు జరుపుతున్నాయి.ఉక్రెయిన్తో రష్యా యుద్ధం నేపథ్యంలో, రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడం మానుకోవాలని అమెరికా భారతదేశంపై ఒత్తిడి తెస్తోంది. ఇది రష్యాకు ఆర్థికంగా సహాయపడుతుందని వైట్హౌస్ చెబుతోంది. అయితే, అమెరికా ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తోందని భారత్ గట్టిగా తిప్పికొట్టింది. అమెరికన్ కంపెనీలు కూడా రష్యా నుంచి యురేనియం, రసాయనాలు, ఎరువులను కొనుగోలు చేస్తున్నాయని భారత్ గుర్తుచేసింది. ఈ సమస్యను చర్చించడానికి ఆగస్టు 15న ట్రంప్, రష్యా అధ్యక్షుడు పుతిన్ మధ్య జరిగే సమావేశాన్ని భారత్ నిశితంగా గమనిస్తోంది.

# వీధి కుక్కల్ని తరలించడం సాధ్యమా

న్యూఢిల్లీ, ఆగస్టు 13,

దేశరాజధాని ఢిల్లీలో ఒక్క వీధి కుక్క కూడా కన్పించరాదని, షెల్టర్ హోమ్లకు తరలించాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలు ప్రకంపనలు రేపుతున్నాయి. జంతు ప్రేమికులతో పాటు పలువురు సెలబ్రిటీలు సుప్రీం నిర్ణయాన్ని తప్పుపడుతున్నారు. ఇది ఆచరణ సాధ్యం కాదన్నారు మాజీ కేంద్ర మంత్రి మేనకాగాంధీ. ఢిల్లీ ఔఅఖీ పరిధిలో వీధికుక్కలను 8 వారాల్లో షెల్టర్ హోమ్లకు తరలించాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. పలువురు సెలబ్రిటీలు ఈ వ్యవహారంపై స్పందిస్తున్నారు. రాహుల్, ప్రియాంకతో పాటు మేనకాగాంధీ ఈ వ్యవహారంపై స్పందించారు. వీధి కుక్కలను షెల్టర్ హోమ్లకు తరలించాలన్న సుప్రీంకోర్టు ఆదేశాన్ని విపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శించారు. దశాబ్దాల మానవీయ విలువల నుంచి ఇది వెనకడుగని సోషల్ మీడియా వేదికగా మండిపడ్డారు. ఈ నోరులేని జీవాలను తుడిచిపెట్టేయాల్సి రావడం సమస్యకు పరిష్కారం కాదని రాహుల్ అన్నారు.వాస్తవానికి కుక్కకాటు ఒక జాతీయ సమస్యగా మారింది. దీంతో ఢిల్లీకి సంబంధించి కీలక ఆదేశాలిచ్చింది అత్యున్నత న్యాయస్థానం. రేబిస్ వ్యాధితో మరణాల సంఖ్య పెరగడాన్ని సీరియస్గా తీసుకోవాలని, 8 వారాల్లోపు అన్ని వీధి కుక్కలను షెల్టర్లకు తరలించాలని హుకుం జారీ చేసింది. కుక్కల తరలింపును అడ్డుకోవడానికి ప్రయత్నిస్తే, ఎవరిపైనైనా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది.సుప్రీంకోర్టు జంతుప్రేమికులకు చురకలంటించింది. ఆదేశాలకు వ్యతిరేకంగా మాట్లాడేవాళ్ల పిటిషన్లను విచారించబోమని కోర్టు స్పష్టం చేసింది. వీలైనంత త్వరగా ఢిల్లీలోని అన్ని ప్రాంతాల నుంచి కుక్కలను దూర ప్రాంతాలకు తరలించక తప్పదన్నది ఆదేశాల సారాంశం. వీధికుక్కల తరలింపు ప్రదేశాన్ని కూడా గుర్తించామన్న సొలిసిటర్ జనరల్, జంతు హక్కుల కార్యకర్తలు స్టే ఆర్డర్ తెచ్చుకోవడంతో షెల్టర్ పనులు ఆగిపోయాయి అన్నారు. రేబీస్ తో పోయిన ప్రాణాల్ని తిరిగి తీసుకొస్తారా? అని జంతు ప్రేమికుల్ని ప్రశ్నించింది సుప్రీంకోర్టు. వీధి కుక్కలను దత్తత తీసుకోవడానికి కూడా నో చెప్పింది. ఈ ఏడాది జనవరి నుంచి జూన్ వరకు ఆరునెలల్లోనే ఢిల్లీలో 35 వేల మంది కుక్కకాటుతో ఆస్పత్రిపాలయ్యారు. అందుకే, సుప్రీంకోర్టు సీరియస్ యాక్షన్కు ఆదేశిస్తూ తీర్పునిచ్చింది.

# భారీగా తగ్గిన ద్రవ్యోల్బణం

ముంబై, ఆగస్టు 13

సామాన్యులకు పెద్ద ఉపశమనం లభించింది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం, ఆహార ధరలు తగ్గడం వల్ల భారతదేశ రిటైల్ ద్రవ్యోల్బణం జూలైలో 1.55 శాతానికి తగ్గింది. ఇది ఎనిమిది సంవత్సరాలలో కనిష్ట స్థాయి. గత ఆరు సంవత్సరాలలో ద్రవ్యోల్బణం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా టాలరెన్స్ బ్యాండ్ అయిన 2 శాతం నుండి 6 శాతం కంటే తక్కువగా ఉండటం ఇదే మొదటిసారి. జూన్ 2017 తర్వాత ఇది సంవత్సరానికి అత్యల్ప ద్రవ్యోల్బణ రేటు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం, జూలైలో రిటైల్ ద్రవ్యోల్బణం కూడా ఏప్రిల్లో 3.16 శాతం, జూలై 2024లో 3.54 శాతం నుండి తగ్గింది. 50 మంది ఆర్థికవేత్తలతో కూడిన రాయిటర్స్ సర్వే జూలైలో రిటైల్ ద్రవ్యోల్బణం 1.76 శాతానికి తగ్గుతుందని అంచనా వేసింది.రిటైల్ ద్రవ్యోల్బణంలో దాదాపు సగానికి సమానమైన ఆహార ద్రవ్యోల్బణం -1.76 శాతంగా ఉంది. గత నెలలో ఇది 1.06 శాతం తగ్గుదలతో పోలిస్తే, ఇది గణనీయంగా తగ్గింది. వర్షాకాలం అసమానంగా ఉన్నప్పటికీ, వసంతకాలంలో మంచి పంటలు భారతదేశానికి ఆహార ధరలను అదుపులో ఉంచడానికి సహాయపడ్డాయి. ఇది ఒక దశాబ్దానికి పైగా దేశంలో అతి ఎక్కువ కాలం ద్రవ్యోల్బణం తగ్గడానికి దారితీసింది.ఆర్బిఐ ద్రవ్య విధాన కమిటీ (ఓఖఅ) రేట్లను 5.50 శాతం వద్దనే ఉంచి, ద్రవ్యోల్బణ అంచనాను మరింత అనుకూలంగా పేర్కొన్న దాదాపు వారం తర్వాత ఈ గణాంకాలు వెలువడ్డాయి. ఫిబ్రవరి నుండి వరుసగా మూడు రేటు కోతల తర్వాత ఈ విరామం వచ్చింది. ఈ కాలంలో, ఆర్బిఐ రెపో రేట్లను 1 శాతం తగ్గించింది. కమిటీ ఇప్పటివరకు తన వైఖరిని తటస్థంగా ఉంచుకుంది. ఇంధనం, విద్యుత్ ధరలు జూన్లో 2.55 శాతం నుండి జూలైలో 2.67 శాతానికి పెరిగాయి. ఇటీవల, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారతీయ వస్తువులపై 50 శాతం సుంకం విధించారు. ఇందులో 25 శాతం సుంకం అమలు చేశారు. ఆగస్టు చివరి వారంలో 25 శాతం సుంకం విధించారు. అటువంటి పరిస్థితిలో, వడ్డీ రేట్లలో ఎటువంటి మార్పు చేయకూడదనే ఆర్బిఐ నిర్ణయం ఆర్థిక వ్యవస్థను పెంచుతుంది.ఆహార పదార్థాలు, ముఖ్యంగా కూరగాయల ధరలు అస్థిరంగా ఉండటంతో, 2026 ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో ద్రవ్యోల్బణం పెరిగే అవకాశం ఉందని కేంద్ర బ్యాంకు ఎంపీసీ గత వారం తెలిపింది. భౌగోళిక రాజకీయ అనిశ్చితులు తగ్గాయని, అయితే రాబోయే సుంకాల వల్ల ప్రభావితమైన ప్రపంచ వాణిజ్యం ఒత్తిడిలో ఉందని ఆర్బిఐ తెలిపింది.2026 పూర్తి ఆర్థిక సంవత్సరానికి, ఆర్బిఐ కోర్ ద్రవ్యోల్బణం 3.1 శాతంగా ఉంటుందని అంచనా వేసింది, ఇది జూన్లో చేసిన 3.70 శాతం అంచనా కంటే తక్కువ. అయితే, వినియోగదారుల ధరల సూచిక 2027 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో 4.9 శాతంగా ఉంటుందని అంచనా వేశారు. ఇది ఆర్బిఐ లక్ష్యం 4 శాతాన్ని మించిపోతుంది. త్రైమాసిక వారీ అంచనాల గురించి మాట్లాడితే, ద్రవ్యోల్బణం రెండవ త్రైమాసికంలో 2.1 శాతం, మూడవ త్రైమాసికంలో 3.1 శాతం, నాల్గవ త్రైమాసికంలో 4.4 శాతంగా ఉంటుందని అంచనా వేయడం జరిగింది. ఎంపిసి కూడా కోర్ ద్రవ్యోల్బణం 4 శాతం వద్ద స్థిరంగా ఉందని భారత రిజర్వ్ బ్యాంక్ తెలిపింది

# భారీ వర్షాల దృష్ట్యా రానున్న 72 గంటలు హై అలర్ట్

**అత్యవసరమైతే తప్ప బయటికి రావద్దు**

**పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**

**అత్యవసర సమయాల్లో డయాల్ 100 లేదా స్థానిక పోలీస్ స్టేషన్కు సమాచారం అందించండి.**

గోదావరిఖని :రానున్న 72 గంటల పాటు రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయని, వాతావరణ శాఖ సూచించిందని, భారీ వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కమిషనరేట్ పరిధిలోని ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకి రావద్దని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఈరోజు ఒక ప్రకటనను విడుదల చేశారు. పెద్దపల్లి, మంచిర్యాల జోన్ పోలీసు యంత్రాంగం నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటుందని తెలియజేసారు. ఎవరైనా ఆపదలో ఉంటే వెంటనే, స్థానిక పోలీస్ అధికారులకు లేదా డయల్ 100కి ఫోన్ చేసి పోలీసు వారి సహాయం పొందగలరని తెలిపారు. అధికారుల సూచనలను పాటిస్తూ పోలీసు వారికి సహకరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.భారీవర్షాల నేపథ్యంలో ప్రజలు ఈ జాగ్రత్తలు తీసుకోవాలి.రాగల 72 గంటల్లో పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది కావున ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటికి రాకూడదని సీపీ తెలిపారు.

వర్షాలు కురుస్తున్నందున రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ప్రజల భద్రత మరియు ప్రాణా రక్షణ ను దృష్టిలో పెట్టుకొని డ్యామ్స్ మరియు పర్యాటక ప్రాంతాలను తాత్కాలికంగా మూసివేయడం జరిగింది అని సాధారణ పరిస్థితి వచ్చే వరకు అక్కడికి ఎవరు ప్రజలు వెళ్లకూడదని సూచించారు.రామగుండం పోలీస్ కమిషనరేట్ ప్రజలకు ఎలాంటి ప్రమాదం తలెత్తకుండా పోలీస్ శాఖ పరంగా తగిన ఏర్పాట్లతో ముందస్తుగా పకడ్బందీ చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని ప్రజలు పోలీసు వారి సూచనలు సలహాలు పాటిస్తూ సహకరించాలన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.ఉదృతంగా ప్రవహిస్తున్న వాగులు,కాలువలు,నదులు, రిజర్వాయర్లు,చెరువుల వద్దకు వెళ్ళరాదు.చెట్ల కింద, పాడైన భవనాలు కింద, శిధిలావస్థలో ఉన్న భవనాల్లో ఉండరాదు. విద్యుత్ స్థంభాలు, ట్రాన్ఫార్మర్స్ ముట్టుకోరాదు.ఎవ్వరు కూడా ఎట్టిపరిస్థితుల్లో కూడా చెరువులోకి, నాలాలు, డ్యామ్స్, వాటర్ ఫాల్స్ లేదా చేపల వేటకు గాని వెళ్ళరాదు. అత్యవసరమైతేనే ఇంటి నుండి బయటకు రావాలి. స్థానిక రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీ, విద్యుత్, ఆర్డబి, వైద్య శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఎక్కడైనా రోడ్ల పై వరద ఉదృతితో రోడ్లు తెగిపోయినా, ఉదృతంగా ప్రవహించినా అక్కడికి ఆ గ్రామ ప్రజలు వెళ్లకుండా, రెండు దిక్కులా ప్లాస్టిక్ కోన్స్,బారిగేడ్స్, హెచ్చరిక గల ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం జరిగింది. ప్రతి పోలీస్టేషన్ పరిధిలో ఉన్న చెరువులు, కుంటల అలుగుల దగ్గర, ప్రధాన రహదారులపై ప్రవహించే వాగులు, వంకల దగ్గర నీటి ప్రవాహం గురించి ముందస్తు సమాచారం తెలుసుకొని , ప్రత్యేక్షంగా వెళ్లి పర్యవేక్షించి పోలీసు అధికారులు, సిబ్బంది అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని తెలిపారు.

# గ్రామాల్లో పడకేసిన పారిశుద్ధ్యం

నిజామాబాద్, ఆగస్టు 13

ల్లెల్లో పారిశుధ్యం పడకేసింది. సర్పంచ్ల పదవీకాలం ముగియడంతో ప్రస్తుతం గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పా లన కొనసాగుతోంది. ఒక్కో అధికారికి రెం డు, మూడు గ్రామాల బాధ్యతలు ఉండడంతో పర్యవేక్షణ ఇబ్బందికరంగా మారిం ది. పల్లెల్లో పారిశుధ్యం లోపించి అస్తవ్యస్తంగా మారాయి. వీధుల్లో చిన్న గుంత ఏర్పడినా పూడ్చేవారే కరువయ్యారు.ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోతున్నది. ఈగలు, దోమల బెడద పెరిగి వ్యాధులు వి జృంభిస్తున్నాయి. పల్లెల్లో పారిశుధ్యం పడకేసింది. సర్పంచ్ల పదవీకాలం ముగియడంతో ప్రస్తుతం గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. ఒక్కో అధికారికి రెండు, మూడు గ్రామాల బాధ్యతలు ఉండడంతో పర్యవేక్షణ ఇబ్బంది కరంగా మారింది.గ్రామాల్లో ఏమైనా సమస్యలున్నా చెప్పుదామంటే అధికారులు అందుబాటులో ఉండడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కామారెడ్డి జిల్లాలోని ఎల్లారెడ్డి మండలంలో ప్రత్యేకాధి కారుల పాలనలో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. గ్రామాల్లో సర్పంచ్ల పదవీ కాలం ముగిసినప్పటి నుంచి గ్రామాలను పట్టించుకున్న నాథుడే కరువయ్యాడు. గ్రామాల్లో ఎక్కడ చూసిన చెత్తాచెదారం పేరుకుపోయింది.పంచాయతీల్లో నిధులు లేకపోవడంతో ప్రత్యేకాధికారులు నామమాత్రంగా పని చేస్తున్నారు. గ్రామాల్లో, పలుచోట్ల వీధి దీపాలు చాలా రోజుల నుంచి వెలగడం లేదు. ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతో గ్రామాల్లోని పరిస్థితి అధ్వానంగా తయారైంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పాలనలో, పల్లె, పట్టణ ప్రగతి పేరిట ప్రతినెలా జిల్లాకు రూ.12 కోట్ల నుంచి రూ.16 కోట్లు ఇచ్చి గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడంతోపాటు ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టింది.గ్రామాలకు కేంద్రం నిధులు ఇచ్చినా ఇవ్వకపోయినా రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఆపలేదు. దాంతో రాష్ట్రంలోని పల్లెలు కొత్త రూపు సంతరించుకు న్నాయి. కానీ.. కాంగ్రెస్ ప్రభుత్వంలో పల్లెలు దారుణంగా మారాయి.ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పద్దెనిమిది నెలలు దాటినా ఇటు రాష్ట్రం నుంచి అటు కేంద్రం నుంచి పంచాయతీల కు నిధులు రావడం లేదు. ఇటీవల కాంగ్రెస్ సర్కారు ఎంతో ఆర్భాటంగా స్వచ్ఛదనం -పచ్చదనం కార్యక్రమం నిర్వహించినప్పటికీ నయాపైసా ఇవ్వకపోవడంతో తూతూ మంత్రంగా జరిగిపోయింది. ప్రస్తుతం ఏ గ్రామానికి వెళ్లినా మురికి గుంతలు, చెత్తా చెదారంతో నిండిన వీధులు, పెరుగుతున్న పిచ్చి మొక్కలు దర్శనమిస్తున్నాయి.మండలంలో 31 గ్రామ పంచాయతీలుండగా గ్రామ పంచాయతీలకు నెలనెల రావాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులు జమ కాకపోవడంతో జీపీల నిర్వహణ పంచాయతీ కార్యదర్శులకు భారంగా మారింది. అన్ని గ్రామాల్లో పారిశుధ్య కార్మికులు ఉన్నప్పటికీ వారితో పని చేయించే వారు లేరు. సర్పంచులు లేక, ప్రత్యేకాధికారులు పట్టించుకోకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఒక్కో కార్యదర్శికి రెండు, మూడు గ్రామాల బాధ్యతలు అప్పగించడంతో వారు ఏ గ్రామంలో ఉంటున్నారో తెలియని పరిస్థితి ఉంది సర్పంచుల పదవీ కాలం పూర్తయిన తర్వాత పల్లెల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై పడింది. జిల్లాలోని ఆయా పంచాయతీల్లో సెక్రటరీలు చేసిన అప్పులు ఒక్కొక్కరివి రూ.50 వేల నుంచి రూ. లక్షల వరకు ఉన్నట్లు సమాచారం.ప్రభుత్వం ఇటీవల ఉద్యోగుల బదిలీలకు జీఓ తీసుకురావడంతో ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్న పంచాయతీ సెక్రటరీలు కూడా తమ అర్హతను బట్టి ఎక్కడి వెళ్లాలో వెతుక్కునే పనిలో, పడి బదిలీ అయ్యారు. మరోపక్క బదిలీ అయినా సెక్రటరీలు తాము ఖర్చులు చేసిన బిల్లులు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి నెలకొందని పలువురు సెక్రటరీలు మదనపడుతున్నారురోజు వారీగా చెత్తను తొలగించక పోవడంతో రోడ్లపైనే చెత్తాచెదారం పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. కొన్ని గ్రామాల్లో డంపింగ్ యార్డుల పరిస్థితి అధ్వాన్నంగా తయారైంది. కొన్ని గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు అందడం లేదు. వీధి దీపాలు ఎప్పుడు వెలుగుతున్నాయో, ఎప్పుడు ఆరిపోతున్నాయో తెలియని పరిస్థితి నెలకొంది. సర్పంచులు ఉంటే తాము వారికి సమస్యలు తెలిపిన వెంటనే పరిష్కరించేవారని,ఇప్పుడు అధికారులు ఎప్పుడు ఎక్కడ ఉంటారో తెలియని పరిస్థితి ఉందనిప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల బాగోగులు ప్రజా ప్రభుత్వ పాలనలో బాగుపడాలి. అంటే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించి ప్రత్యేక అధికారుల పాలన నుండి స్థానిక సర్పంచ్ల పాలనలోకి చేరితే అధికారులకు ప్రజలకు సమన్వయంగా ఉంటుందని స్థానిక గ్రామ ప్రజలు పలువురు పేర్కొంటున్నారు. గ్రామపంచాయతీలో ప్రత్యేక అధికారుల పాలనలో పరిపాలన కొనసాగుతుందని ప్రభుత్వం నుండి సమయానికి నిధులు రాకపోవడంతో కొన్ని సందర్భాలలో తమ చేతి నుండి డబ్బులు ఖర్చు చేసి గ్రామపంచాయతీలో పలు అభివృద్ధి పనులు చెత్త ట్రాక్టర్లు గాని త్రాగునీటి సమస్యకు గ్రామాలు గ్రామాలలో మోటార్ల రిపేర్లు, పైప్ లైన్ మరమ్మత్తులు, వీధి దీపాలకు, పలు సమస్యలకు పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక అధికారులుగా ఉన్న వారే చేతి నుంచి డబ్బులు ఖర్చు చేసి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైన తర్వాత తీసుకోవడం జరుగుతుందని మండల పరిషత్ అధికారి తెలిపారు. గ్రామ పంచాయతీలకు నిధులు లేక ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.c

=========

# 80 మార్కులకే టెన్త్ పరీక్షలు

హైదరాబాద్, ఆగస్టు 13,

రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఏడాది పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో కీలక మార్పులు చేస్తున్నట్లు విద్యాశాఖ నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. అయితే దీనిపై తాజాగా యూటర్న్ తీసుకుంది. ఈ ఏడాదికి పాత పద్ధతిలోనే పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఉంటాయని తెలంగాణ విద్యాశాఖ తాజాగా వెల్లడించింది. అయితే పదో తరగతి పరీక్షల్లో 20 శాతం ఇంటర్నల్ మార్కుల విధానం కొనసాగించాలని, 80 శాతం ఎక్స్‌టర్నల్ మార్కులకు కేటాయించనున్నట్లు తెలిపింది. ఈ మేరకు విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది.నిజానికి, పదో తరగతిలో ఇంటర్నల్ మార్కులు ఎత్తివేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది నవంబర్‌లో ప్రకటన జారీ చేసిన సంగతి తెలిసిందే. మొత్తం వంద మార్కులకు పరీక్షలు నిర్వహించాలని పేర్కొంది. అయితే ఈ నిర్ణయంపై సర్కార్ వెనక్కి తగ్గింది. పాత పద్ధతిలోనే టెన్త్ పరీక్షలు నిర్వహిస్తామని విద్యాశాఖ వెల్లడించింది. దీంతో 20 శాతం ఇంటర్నల్ మార్కుల విధానం యథావిధిగా కొనసాగించనున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.ఈ ఏడాదికి అసలు ఇంటర్నల్ మార్కులు ఉంటాయా? లేదా? అనే అంశంపై విద్యార్థులు, తల్లిదండ్రుల్లో తీవ్ర ఉత్కంఠ కొనసాగుతున్న నేపథ్యంలో రేవంత్ సర్కార్ ఈ మేరకు ప్రకటన జారీ చేసింది. దీంతో రాష్ట్రంలో దాదాపు 5 లక్షల మంది విద్యార్థులకు క్లారిటీ లభించింది. ఇటీవల ఢిల్లీలో జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఈ నిర్ణయంపై ప్రశ్నలు తలెత్తడంతో పునరాలోచనలో పడిన పాఠశాల విద్యాశాఖ ఈ మేరకు పాత విధానాన్నే కొనసాగించాలని నిర్ణయం తీసుకుంది.

# కాలువల్లో ఎప్పటికప్పుడు సిల్ట్ తొలగించండి

కమిషనర్ ఎన్.మౌర్య

నగరంలోని అన్ని కాలువల్లో ఎప్పటికప్పుడు సిల్ట్ (చెత్త, పేరుకుపోయిన మట్టి) తొలగించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం ఎల్.ఐ.సి. రోడ్డు, ఆఫీసర్ క్లబ్, రామకృష్ణా పురం, హమీద్ నగర్, మంచినీళ్ల కుంట తదితర ప్రాంతాల్లో ప్రజా పిర్యాదులను అధికారులతో కలసి కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ డ్రెయినేజీ కాలువలు లీక్ అవుతున్నాయని, వర్షపు నీరు ఆగుతున్నాయనే పిర్యాదులు వస్తున్నాయని అన్నారు. నగరంలోని అన్ని ప్రాంతాల్లో గల కాలువల్లో ఎప్పటికప్పుడు సిల్ట్ తొలగిస్తే మురుగునీరు సజావుగా వెళ్లేలా చూడాలని అన్నారు. ఇంటింటి చెత్త సేకరణ సక్రమంగా నిర్వహించాలని అన్నారు. ఉదయం ముందుగా చెత్తకుప్పలు తొలగించాలని అధికారులను ఆదేశించారు. రోడ్లపైన, కాలువల్లో చెత్త వేసేవారిని గుర్తించి జరిమానాలు విధించాలని అన్నారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్ రవి, ఏసిపి మధు, డి.ఈ. లు మధు, శిల్ప, వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ నాగేంద్ర, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య, తదితరులు ఉన్నారు.

# ఆగష్టు 19 - 21 తేదీల్లో అమరావతిలోని ఎస్వీ ఆలయంలో పవిత్రోత్సవాలు

తిరుపతి,

అమరావతిలోని శ్రీ వేంకటేశ్వర ఆలయంలో ఆగష్టు 19 - 21వ తేదీ వరకు పవిత్రోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు టిటిడి ఏర్పాట్లు చేపట్టింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని మహా నగరం అమరావతి ( వేంకటపాలెం)లో టిటిడిచే నిర్మింపబడి, కొలువుతీరి వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయం నుందు ప్రప్రథమంగా లోక కల్యాణార్థం, సర్వలోకహితార్థం శ్రీ వేఖానస భగవచ్ఛాస్త్రరీత్యా పవిత్రోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు.ఆగష్టు 18వ తేదీ సాయంత్రం పవిత్రోత్సవాలకు అంకురార్పణం జరుగనుంది. ఉదయం విశ్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, ఆచార్య బుత్విక్ వరణము, సేనాధిపతి ఉత్సవం, మృతస్సంగ్రహణం నిర్వహిస్తారు.ఆగష్టు 19న ఉదయం పంచగవ్యారాధన, అకల్మష హోమం, వాస్తు పూజ, వాస్తు హోమం, స్నపన తిరుమంజనం, సాయంత్రం యాగశాల వైదిక కార్యక్రమాలు, పవిత్ర ప్రతిష్ట అధివాసం, సర్వదైవత్య హోమం చేపడుతారు.ఆగష్టు 20న ఉదయం పుణ్యాహవాచనం, కుంభ ఆరాధన, ప్రధాన హోమములు, స్నపన తిరుమంజనం, పవిత్రాభిమంత్రణ, పవిత్ర సమర్పణము, సాయంత్రం యాగశాల వైదిక కార్యక్రమాలు, మహా శాంతి హోమం, తిరువీధి ఉత్సవం నిర్వహిస్తారు.ఆగష్టు 21వ తేదీన ఉదయం పుణ్యాహవచనం, యాగశాల వైదిక కార్యక్రమములు, స్నపన తిరుమంజనం, సాయంత్రం యాగశాల వైదిక కార్యక్రమాలు, పూర్ణాహుతి, కుంభ ప్రదక్షిణ, కుంభ సమర్పణం, విశేష ఆరాధన, ఆచార్య, ఆగమ సలహాదారు, బుత్విక్కులకు బహుమానం, యాజమాన ఆశీర్వాచనం చేపడుతారు.

# తెలంగాణ కాంగ్రెస్‌లో ముసలం

హైదారాబాద్, ఆగస్టు? 13,

టీ కాంగ్రెస్‌లో మళ్లీ ముసలం మొదలైంది. అసెంబ్లీ ఎన్నికల టైంలో అంతా కలిసి పనిచేశారు. అధికారంలోకి వచ్చి ఏడాది దాటింది. దీంతో ఇక ఇప్పుడు పదవుల లొల్లి మొదలైంది. ఏడాదిన్నర తర్వాత మంత్రివర్గ విస్తరణ లొల్లికి మరింత ఆజ్యం పోసింది. మంత్రి పదవి ఆశించి భంగపడ్డ మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పార్టీకి తలనొప్పిగా మారారు. తనకు మంత్రి పదవి ఇవ్వకపోవడంపై చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో సంచలనంగా మారాయి. పార్టీ అధిష్ఠానం ఇచ్చిన హామీని నిలబెట్టుకోకపోవడంతోపాటు, రాష్ట్ర నాయకత్వం తనను అవమానిస్తోందని ఆయన ఆరోపిస్తూ, పలు సందర్భాల్లో పరోక్షంగా, ప్రత్యక్షంగా తన అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ వివాదం తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత కలహాలను మరింత తీవ్రతరం చేస్తోంది.రాజగోపాల్ రెడ్డి బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన సమయంలో పార్టీ అధిష్ఠానం తనకు మంత్రి పదవి ఇస్తామని హామీ ఇచ్చినట్లు ఆయన పదేపదే ప్రస్తావిస్తున్నారు. భువనగిరి ఎంపీ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించడంతోపాటు, మునుగోడు నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి తాను కీలక పాత్ర పోషించినా, హామీ నెరవేరలేదని ఆయన అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంలో ఆయన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యలను స్వాగతిస్తూ, రాష్ట్ర నాయకత్వం తనకు అడ్డుపడుతోందని ఆరోపించారు. ఈ ఆరోపణలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సీనియర్ నేత జానారెడ్డి వంటి నాయకులపై పరోక్షంగా చేస్తున్నారు. మరోవైపు ఒకే కుటుంబం నుంచి ఇద్దరికి మంత్రి పదవులు ఇవ్వడంలో తప్పేమిటని ప్రశ్నిస్తున్నారు.రాజగోపాల్ రెడ్డి తాజాగా తన వాదనలో ఖమ్మం, నల్గొండ జిల్లాల మధ్య పోలికను తెరపైకి తెచ్చారు. ఖమ్మం జిల్లాలో 9 మంది ఎమ్మెల్యేలకు ముగ్గురు మంత్రులు ఉండగా, 11 మంది ఎమ్మెల్యేలు ఉన్న నల్గొండ జిల్లాకు కూడా ముగ్గురు మంత్రులు ఉండటంలో తప్పేమిటని ప్రశ్నిస్తున్నారు. రాజగోపాల్ రెడ్డి తన వ్యాఖ్యలను కేవలం వ్యక్తిగత అసంతృప్తిగా పరిమితం చేయకుండా, మునుగోడు నియోజకవర్గ ప్రజల అభివృద్ధికి అన్యాయం జరుగుతోందనే కోణంలో మలిచారు. తనకు మంత్రి పదవి ఇవ్వకపోవడం వల్ల మునుగోడు అభివృద్ధికి నిధులు, ప్రాజెక్టులు ఆగిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. "మునుగోడు ప్రజలకు అన్యాయం జరిగితే, అది నాకు అన్యాయం జరిగినట్టే" అని ఆయన పేర్కొనడం ద్వారా, తన రాజకీయ లక్ష్యం పదవి కంటే ప్రజల సంక్షేమమేనని స్పష్టం చేశారు.రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలో అంతర్గత కలహాలను మరింత తీవ్రతరం చేస్తున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సీనియర్ నేత జానారెడ్డిపై ఆయన చేసిన విమర్శలు, సోషల్ మీడియా వేదికలపై ఆయన పరోక్ష దాడులు పార్టీ శ్రేణుల్లో చర్చనీయాంశంగా మారాయి. జానారెడ్డిని "ధృతరాష్ట్రుడు"గా పోల్చడం, రేవంత్ రెడ్డి దీర్ఘకాల సీఎం పదవి వ్యాఖ్యలపై కౌంటర్ ఇవ్వడం వంటివి ఆయన ధోరణిని స్పష్టం చేస్తున్నాయి. అయితే, ఈ విమర్శలు పార్టీ అధిష్ఠానంపై ఒత్తిడి పెంచడంతోపాటు, రాజగోపాల్ రెడ్డి రాజకీయ భవిష్యత్తును కూడా ప్రశ్నార్థకంగా మార్చాయి. పార్టీ క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవి ఆయనతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలుస్తోంది.

హామీ ఇచ్చినప్పుడు తెలియదా

మంత్రి పదవి ఇస్తామన్న హామీపై మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మరోసారి సం చలన వ్యాఖ్యలు చేశారు. 'నన్ను పార్టీలోకి తీసుకున్నప్పుడు తెలియదా మేము ఇద్దరం అన్నదమ్ములం ఉన్నామని, పార్లమెంట్ఎన్నికల సమయంలో రెండోసారి ప్రామిస్ చేసినప్పుడు తెలియదా వేమిద్దరం అన్నదమ్ములం ఉన్నామని.. ఒడ్డు దాటే వరకు ఓడ మల్లయ్య ఒడ్డు దాటాక బోడి మ ల్లయ్య అన్న చందంగా ఉంది.9 మంది ఎమ్మెల్యేలు ఉన్న ఖమ్మం జి ల్లాకు ముగ్గురు మంత్రులు ఉన్నారు. 11 మంది ఎమ్మెల్యేలు ఉన్న నల్లగొండ జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉండటం తప్పా, ఇద్దరం అన్న దమ్ములం సమర్థులమే, ఇద్దరం గట్టివాళ్లమే, ఇద్దరికీ మంత్రి పదవులు ఇస్తే తప్పేంటి. ఆలస్యమైనా సరే నేను ఓపిక పడుతున్న" అని వ్యాఖ్యానించారు. మంగళవారం మునుగోడు మండలం ఎలగలగూడెంలో గ్రామపంచాయతీ భవనాన్ని ఎమ్మెల్సీ సత్యంతో కలిసి ప్రారంభించా రు.మంత్రి పదవి ఇస్తామన్న హామీ ఆలస్యమైంది, సమీకరణాలు కుదరటం లేదని అంటున్నారు, ఎందుకు కుదరటం లేదని ప్రశ్నించారు. పదవి రాకుండా ఎవరడ్డుకుంటున్నారని నిలదీశారు. మంత్రి పదవిపై మాటిచ్చారు, పదవి ఇచ్చిన ప్పుడు ఇవ్వండిగానీ వెనకబడిన మునుగోడు నియోజకవర్గం అభివృద్ధికి నిధులు మాత్రం ఆపొద్దని కోరారు. తనకు అన్యాయం జరిగితే పర్వాలేదు కానీ మునుగోడుకు అన్యాయం జరగవద్దన్నారు. మునుగోడు వెనుకబడి ఉందని చెప్పారు. ఏ పదవి ఇచ్చినా మునుగోడు ప్రజల కోసమేకానీ తన కోసం కాదన్నారు.

# తెరపైకి వామనరావు హత్య కేసు

కరీంనగర్ , ఆగస్టు 13,

దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన తెలంగాణ హైకోర్టు న్యాయవాద దంపతులు గట్టు వామన్ రావు, నాగమణి హత్య కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగిస్తూ సుప్రీంకోర్టు మంగళవారం ఆదేశాలు జారీ చేయడంతో ఆ రోజు ఏం జరిగింది అనే విషయమై మళ్ళీ చర్చ ఊపందుకుంది. 2021 ఫిబ్రవరి 19న, ఒకవైపు బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ జన్మదిన వేడుకలు రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న వేళ..ఉదయం మంథని కోర్టులో ఒక కేసు గురించి వచ్చి హైదరాబాద్ కు తన కారులో తిరిగి వెళ్తున్న క్రమంలో ఇరువురు దంపతులను దుండగులు రామగిరి పోలీసుస్టేషన్ పరిధిలోని నడిరోడ్డుపై దారికాచి అందరూ చూస్తుండగానే మారణాయుధాలతో దాడి చేసి దారుణంగా హతమార్చారు. ఈ దాడిలో నాగమణి అక్కడికక్కడే మృతిచెందగా, వామన్ రావు తీవ్ర గాయాలతో రక్తపు మడుగులో కొట్టుకుంటుండగా గమనించిన కొంతమంది అతన్ని ఒక వాహనంలో పెద్దపల్లి ఆసుపత్రికి తరించగా అక్కడే ఆయన తుది శ్వాస వదిలారు. మంథని పెద్దపల్లి రహదారి మధ్య పట్టపగలు రద్దీగా ఉన్న సమయంలోనే జరిగిన ఈ హత్యాకాండ ను కొంతమంది ప్రయాణికులు మొబైల్ లో చిత్రీకరించారు. అలాగే దాడిలో తీవ్రంగా గాయపడి రోడ్డుపై సహాయం కోసం అర్థిస్తున్న వామనరావు కొనఊపిరితో ఉండగా తనపై దాడి చేసిన వారి వివరాలను వెల్లడించిన ఒక వీడియో కూడా అప్పుడు పెద్ద ఎత్తున వైరల్ అయ్యింది.ఈ కేసుకు సంబంధించి నిందితులను అరెస్టు చేసి విచారణ జరిపారు. అప్పటి ఐజీ నాగిరెడ్డి కేసు దర్యాప్తు జరిపి ఫాస్ట్ ట్రాక్ కోర్టుకు చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ సంఘటనపైరెండు రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున ఆందోళనలు జరిగాయి. వివిధ పార్టీల నాయకులు ఆందోళనకు దిగారు. ఈ కేసులో మాజీ ఎమ్మెల్యే, అప్పటి పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధు మేనల్లుడు బిట్టు శ్రీను తో పాటు కుంట శ్రీను, చిరంజీవి ప్రధాన నిందితులుగా నిర్ధారించగా, వారికి సహకరించిన వారిని కోర్టుకు హాజరుపర్చారు.అనేక మలుపులు తిరిగిన ఈ కేసులో మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ప్రమేయముందని, కేసును సీబీఐకి అప్పగించి సమగ్ర దర్యాప్తు జరుపాలని వామన్ రావు తండ్రి కిషన్ రావు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే ఈ కేసు ఎన్నోసార్లు విచారణకు వచ్చింది కానీ ఫైనల్ గా మంగళవారం మాత్రం ఈ కేసుకు సంబంధించి కీలక ఆదేశాలు సుప్రీంకోర్టు జారీ చేసింది. 2021 ఫిబ్రవరి 19న జరిగిన ఈ హత్యలో అప్పటి ప్రభుత్వంలోని కీలక వ్యక్తుల ప్రమేయం ఉండడంతో విచారణ సరిగ్గా జరగలేదంటూ గట్టు కిషన్ రావు తరపున సుప్రీంకోర్టులో సీనియర్ న్యాయవాదులు మేనక గురుస్వామి, చంద్రకాంత్ రెడ్డి తమ వాదనలు వినిపించారు.ఈ సందర్భంగా సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ కేసులో ఉన్నట్లు ఆరోపించబడుతున్న పుట్ట మధుతో పాటు మరికొంతమంది తరపున వాదిస్తున్న న్యాయవాదులు ఇప్పటివరకు ఈ కేసు విచారణ సరిగ్గానే జరిగిందనీ, కేసు హైకోర్టు పర్యవేక్షణ ఉందని వాదించారు. అలాగే హత్య ఘటన జరుతున్న సమయంలో తీసిన వీడియోలు అన్ని కూడా హైదరాబాదులో ఎఫ్ఎస్ఎల్ సంబంధించి పూర్తి నివేదిక తయారు చేసిందనీ, ఇప్పుడు మళ్లీ కొత్తగా మరొక దర్యాప్తు సంస్థకు ఈ కేసును బదిలీ చేయాల్సిన అవసరం లేదని తమ వాదనలు వినిపించారు. కానీ గట్టు కిషన్ రావు మాత్రం తన కొడుకు, కోడలు హత్యకు సంబంధించిన విచారణ రాష్ట్రంలో సరిగా జరగట్లేదు అంటూ ఆయన తరుపున వినిపించిన వాదనలు సుప్రీంకోర్టు ధర్మాసనం పరిగణలోకి తీసుకుంది. సిబిఐకి ఈ కేసును బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. అంతేకాదు ఈ కేసుకు సంబంధించిన విషయంలో ఎవరైతే నిందితులుగా ఉన్నారో వాళ్లకు ప్రొటెక్షన్ కావాలని కూడా ప్రతివాదులకు చెందిన అడ్వకేట్స్ అడిగినా, ప్రొటెక్షన్ ఇచ్చేది లేదు అనే విషయాన్ని కూడా స్పష్టం చేశారు. సంచలనం సృష్టించిన గట్టు వామనరావు దంపతుల కేసును సిబిఐ కి బదిలీ చేస్తూ సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసుకు సంబంధించి సీబీఐ ఏ విధంగా దర్యాప్తు జరుపుతుంది. పరిస్తితి ఎలా ఉంటుందనే విషయమై చర్చోపచర్చలు ఊపందుకున్నాయి.

# రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ లో 50 టీం లీడర్ పోస్టులను ఖాళీలు..


**- ప్రమోషన్స్ అనంతరమే ఖాళీలను భర్తీ చెయ్యాలి..**

**- డిమాండ్ చేసిన ఆరోగ్య శ్రీ ఉద్యోగుల సంఘం రాష్ట అధ్యక్షుడు..**

**- ఆరోగ్య శ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ సీఈఓ కి వినతి పత్రం అందజేత..**

హైదరాబాద్ :భారత శక్తి

రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ లో 50 టీం లీడర్ పోస్టులను ఖాళీల గా చూపించిన రాష్ట్ర ప్రభుత్వం, 18 సంవత్సరాలుగా ఆరోగ్యశ్రీలో ఆరోగ్య మిత్రాలుగా విధులు నిర్వహిస్తున్న ఉ ద్యోగులకు టీం లీడర్స్ గా ప్రమోషన్స్ కల్పించిన తర్వాతనే,



మిగతా ఖాళీలన్నింటినీ భర్తీ చేయాలి. అలా కాకుండా ఎలాంటి అనుభవం లేని కొత్త వారితో టీం లీడర్స్ పోస్టులను భర్తీ చేస్తే 2007 నుండి ఇదే ఉద్యోగం చేస్తున్న తమకు అన్యాయం జరుగుతుందని, ఇట్టి విషయంపై తమకు న్యాయం చేయాలని ఆరోగ్యశ్రీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గిరి యాదయ్య ఆధ్వర్యంలో ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ సీఈఓ పి ఉదయ్ కుమార్ ఐఏఎస్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది.

ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కుమార్, ఉపాధ్యక్షులు సుమన్, హైదరాబాద్ అధ్యక్షులు రాజు, నల్గొండ జిల్లా అధ్యక్షులు నాగరాజు, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు రాసాల శ్రీనివాస్,రాష్ట్ర కమిటీ సభ్యులు, వజ్ర, రవీందర్, జనగాం జిల్లా ఆరోగ్య మిత్ర తదితరులు పాల్గొనడం జరిగింది.

# అలా అడ్డంగా బుక్ చేసేశాడు,...

హైదరాబాద్, ఆగస్టు 13,

మేడం మీ బాంచన్.. నేను అంత ఇచ్చుకోలేను. అసలు ఆ భూమి మాకు వంశపారంపర్యంగా వస్తోంది. ఈ భూమికి సంబంధించి ప్రొసీడింగ్ కాపీ ఇవ్వడానికి ఇన్ని రోజులు మమ్మల్ని తిప్పిస్తున్నారు. ఇది మీకేమైనా న్యాయమా.. పైగా డబ్బుల కోసం మమ్మల్ని ఇబ్బంది పెడుతున్నారు.. ప్రభుత్వ పరంగా జీతం తీసుకుంటున్నారు కదా.. జర మా పని చేయండి'' అంటూ పదేపదే వారు బతిమిలాడారు. ఆయనప్పటికీ ఆ మేడంగారు వినిపించుకోలేదు. పైగా డబ్బులు ఇస్తేనే పనిచేస్తానని చెప్పింది. దీంతో వారికి ఒళ్ళు మండింది.15వేల లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు వికారాబాద్ కలెక్టరేట్ కార్యాలయంలో పనిచేస్తున్న సుజాత అనే మహిళా ఉద్యోగిని రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడింది. రెవిన్యూ సెక్షన్లో ఆమె కీలక అధికారిగా పనిచేస్తున్నది. నవీపేట మండలం తహసీల్దార్ కార్యాలయానికి ప్రొసీడింగ్ కాపీ పంపించాలని ఓ వ్యక్తి కొద్దిరోజులుగా సుజాత చుట్టు తిరుగుతున్నారు. అయితే ఆమె లంచం ఇస్తేనే ఆ కాపీ పంపిస్తానని చెప్పడంతో.. అతడు ఆమెను బతిమిలాడాడు. ఆయినప్పటికీ సుజాత ఒప్పుకోలేదు. పైగా తనని కలవడానికి అతడు వచ్చిన ప్రతిసారి తిరస్కారంగా సమాధానం చెప్పింది. దీంతో అతడు ఈ విషయాన్ని ఏసీబీ అధికారులకు చెప్పాడు. వారు సూచించిన విధంగా కెమికల్ కోటెడ్ కరెన్సీని మంగళవారం వికారాబాద్ కలెక్టరేట్ కార్యాలయంలో ఇచ్చాడు. అతని వద్ద డబ్బు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా సుజాతను పట్టుకున్నారు.సుజాత రెవెన్యూ విభాగంలో కీలక హోదాలో పనిచేస్తున్నప్పటికీ.. ఆమె మీద విపరీతమైన అవినీతి ఆరోపణలు ఉన్నాయి. గతంలో ఓ ప్రాంతంలో పనిచేస్తూ.. అక్కడి రైతుల భూములకు సంబంధించిన దస్త్రాలు ఇవ్వడానికి ఆమె లంచం డిమాండ్ చేశారు. అప్పట్లో ఆ రైతులు రెవెన్యూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారు ఆమెపై చర్యలు తీసుకున్నారు. అయినప్పటికీ సుజాత పనితీరు మారలేదు. వికారాబాద్ లో కలెక్టరేట్ కార్యాలయంలో పనిచేస్తున్న ఆమె.. ప్రతి పనికి ఒక రేట్ ఫిక్స్ చేశారు. చివరికి ఏసీబీ అధికారులకు ఇలా దొరికిపోయారు. వికారాబాద్ కలెక్టరేట్లో ఏసీబీ అధికారులు చేసిన దాడుల్లో రెవెన్యూ అధికారి దొరకడం సంచలనం కలిగిస్తోంది. ఇటీవల కాలంలో తెలంగాణ రాష్ట్రంలో ఏసీబీ అధికారులు విస్తృతంగా దాడులు చేస్తున్నారు. లంచాలు తీసుకుంటూ దొరికిపోతున్న అధికారుల్లో రెవెన్యూ శాఖకు చెందిన వారే అధికంగా ఉన్నారు. గతంలో పురుష అధికారులు మాత్రమే ఏసీబీ దాడుల్లో దొరికేవారు. కానీ ఇప్పుడు మగ అధికారులతో మహిళ అధికారులు పోటీపడుతున్నారు. లంచాలు తీసుకుంటూ ఏసీబీ అధికారులకు అడ్డంగా దొరికిపోతున్నారు.

# డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా సాగుతున్న తెలంగాణ ప్రభుత్వ సంకల్పంలో భాగస్వామ్యం అవుదాం.

రామగుండం :

నాషా ముక్త్ భారత్ అభియాన్-2025 లో భాగంగా మాదకద్రవ్యాల దుర్వినియోగానికి వ్యతిరేకంగా సామూహిక ప్రతిజ్ఞ కార్యక్రమం రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయం లో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం కు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా హాజరై అధికారులు, సిబ్బంది తో కలిసి మాదకద్రవ్యాల దుర్వినియోగానికి వ్యతిరేకంగా సామూహిక ప్రతిజ్ఞ చేయడం జరిగింది.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ..... రాష్ట్ర ప్రభుత్వం గంజాయి నిర్మూలన, డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా తీసుకుంటున్న చర్యలలో భాగంగా మాదకద్రవ్య దుర్వినియోగం యొక్క దుష్ప్రభావాల గురించి విస్తృత అవగాహన కల్పించే లక్ష్యంతో దేశవ్యాప్తంగా నాషా ముక్త్ భారత్ అభియాన్ ను అమలు చేస్తోందని అన్నారు. ఈ అవగాహన ప్రచారం యొక్క 5వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈరోజు రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి, మంచిర్యాల జోన్ పరిధిలో మాదకద్రవ్య దుర్వినియోగానికి వ్యతిరేకంగా పోలీస్ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, యువత, మహిళలు, ఉద్యోగులు మరియు ప్రజల నుండి విస్తృత భాగస్వామ్యాన్ని చేయాలనే ముఖ్య ఉద్దేశ్యంతో సామూహిక ప్రతిజ్ఞను నిర్వహించడం జరుగుతుంది అన్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో గంజాయి అక్రమ రవాణా సరఫరా సాగుచేసిన చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని కేసులు నమోదు చేసి, షీట్స్ ఓపెన్ చేసి పీడియాట్ అమలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం ద్వారా మాదకద్రవ్య దుర్వినియోగం లేని సమాజాన్ని నిర్మించడానికి మన ఐక్య నిబద్ధతకు శక్తివంతమైన చిహ్నంగా ఉపయోగపడుతుంది అన్నారు.సీపీ పోలీస్ అధికారులు సిబ్బందితో కలిసి మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞనేను మాదక ద్రవ్యాల పై జరుగుతున్న పోరాటంలో క్రియాశీల భాగస్వామిని అవుతానని, నేను డ్రగ్స్ రహిత జీవన శైలిని అనుసరిస్తూ, నాతో పాటు ఏ ఒక్కరు డ్రగ్స్ బారిన పడకుండా ఉండడానికి కృషి చేస్తానని, డ్రగ్స్ అమ్మకం, కొనుగోలు మరియు అక్రమ రవాణా చేసే వ్యక్తుల సమాచారాన్ని సంబంధిత అధికారులకు తెలియజేస్తానని, నేను డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా సాగుతున్న తెలంగాణ ప్రభుత్వ సంకల్పంలో భాగస్వామిని అవుతానని ప్రతిజ్ఞ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఏసిపి మల్లారెడ్డి, ట్రాఫిక్ ఏసిపి శ్రీనివాస్ ఏవో శ్రీనివాస్, యాంటీ నార్కోటిక్ ఇన్స్పెక్టర్ రాజ్ కుమార్, సిసిఆర్ బీ ఇన్స్పెక్టర్ సతీష్, పిసిఆర్ ఇన్స్పెక్టర్ రవీందర్, సిసిఎస్ ఇన్స్పెక్టర్ బాబురావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్లు భీమేష్, శ్రీనివాస్, ఆర్ ఐ లు శ్రీనివాస్ వామనమూర్తి, సిపిఓ సూపరిండెంట్ లు ఇంద్రసేనారెడ్డి సందీప్, సంధ్య, వివిధ విభాగాలకు చెందిన ఎస్ఐలు, ఆర్ ఎస్ ఐ లు, సిబ్బంది పాల్గొన్నారు.

# చెరువు టన్నెల్స్ ను పరిశీలించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి..



ఎల్బీనగర్, ఆగష్టు 13 (భారత శక్తి):సరూర్ నగర్ కట్ట మీద గతంలో నిర్మించిన నూతన టన్నెల్ ను బుధవారం ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులో వచ్చే వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని సరూర్ నగర్ ప్రాంతంలో ముంపును తగ్గించేందుకు అనేక రకాల పటిష్ట చర్యలు తీసుకున్నామని అన్నారు. ప్రియదర్శిని పార్క్ మసీదు వద్ద గతంలో మూడు గేట్లు పెట్టి దానికి అనుగుణంగా అక్కడే మరో మూడు గేట్లు పెట్టారని తెలిపారు. ఒకవేళ భారీ వర్షాలు పడి చెరువులో నీరు బయటకు వచ్చి కాలనీలను ముంచెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలుగా టన్నలింగ్ వ్యవస్థ ఏర్పాటు చేశామని, ఈ టన్నలింగ్ ఏర్పాటు నత్తనడకన సాగడం జరిగిందని, అనుకున్న దానికంటే ఎక్కువ ఖర్చు అవుతుందని కాంట్రాక్టర్ తెలిపారు. అయిన సరే వారికి అదనంగా డబ్బులు చెల్లించి పనులు చేయించడం జరిగింది. ఎట్టకేలకు పనులు పూర్తి చేయడం జరిగింది. దీని ముఖ్య ఉద్దేశ్యం ఏమిటంటే చెరువు యొక్క నీటి మట్టాన్నీ నియంత్రణే మా లక్ష్యమని తెలిపారు. ఇప్పటికే రెండు మార్గాల ద్వారా నీరు బయటకు విడుదల చేయడం జరిగేది. ఇప్పుడు నిర్మించిన మూడో టన్నల్ వల్ల చెరువులో ఉన్న నీరు త్వరగా బయటకు పోవడానికి వీలు ఉంటుందని, తద్వారా నీరు ఓవర్ ఫ్లో కాకుండా క్రింద ఉన్న కాలనీలు అయిన కోదండరాం నగర్ కాలనీ, వివేకానంద నగర్, కమలనగర్ కాలనీలు ముంపు ప్రాంతం నుంచి రక్షించబడతాయని అన్నారు. అలాగే రాబోయే రోజుల్లో న్యూ గడ్డిఅన్నారం కాలనీవాసుల వరదనీటి సమస్యలు కూడా పరిష్కారం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్ కుమార్, భారస పార్టీ యూత్ అధ్యక్షులు రవిముదిరాజ్, ఛాతిరి మధు సాగర్, విక్కీ ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

# కామారెడ్డి విద్యానగర్ కాలనీలోని సాయిబాబా గుడి వద్ద పారిశుద్ధ్య పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ అధికారులు..



(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, ఆగస్టు 13: బుధవారం కామారెడ్డి పట్టణంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ జిల్లా అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. చందర్, మున్సిపల్ కమిషనర్, జాయింట్ డైరెక్టర్ అగ్రికల్చర్, తహసీల్దార్ ఇతర అధికారులతో కలిసి విద్యానగర్ కాలనీలోని సాయిబాబా గుడి వద్ద పారిశుద్ధ్య పనులను పరిశీలించి అధిక వర్షాల హెచ్చరికల నేపథ్యంలో కామారెడ్డి పట్టణంలో డ్రైనేజీలు బ్లాక్ అయి మురుగునీరు రోడ్ల మీదికి, ఇండ్లలోకి రాకుండా ముందస్తుగా అన్ని డ్రైనేజీలను శుభ్రం చేయాలని, రోడ్లకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని, తడి, పొడి చెత్త ఎక్కడపడితే అక్కడ పడేయకుండా ప్రతిరోజు వాహనాల ద్వారా చెత్తను సేకరించి డిస్పోజల్ చేయాలని, పట్టణంలో ఎక్కడ వర్షం నీరు నిల్వ ఉండకుండా తగు చర్యలు చేపట్టాలని, దోమలు వృద్ధి చెందకుండా ఆయిల్ బాల్స్ వేయాలని, ఫాగింగ్ చేయాలని, భారీ వర్షం సంభవించినప్పుడు పట్టణ ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇండ్ల నుండి బయటకు రాకుండా ముందస్తుగా ప్రచారం కల్పించాలని మున్సిపల్ కమిషనర్ రాజేందర్ రెడ్డిని ఆదేశించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో కార్మికులకు పనిముట్లను అందజేసి ప్రకృతి వైపరీత్యాల సందర్భంగా పనిచేసే కార్మికులకు రైన్ కోట్స్, అత్యవసరమైన ఇతర సామాగ్రి అందజేయుటకు వెంటనే ప్రపోజల్స్ పంపించవలసిందిగా ఆదేశించినారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్లు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# భూదాన యజ్ఞం కొరకై..కొర్ర సంజన బర్త్ డే సందర్భంగా గజం భూమి కోసం విరాళం..



ఎల్బీనగర్, ఆగష్టు 13 (భారత శక్తి):మాతృదేవోభవ అనాథ ఆశ్రమం ఆధ్వర్యంలో మానసిక వికలాంగులకు ఆశ్రమ నిర్మాణానికై, గోమాతల సంరక్షణకై భూదాన యజ్ఞం శాశ్వత సొంత స్థలం భవన నిర్మాణం కోసం ఈ యొక్క భూదానయజ్ఞం ప్రయత్నం. బృహత్తరమైన సేవా కార్యక్రమంలో మానవతా హృదయులు రంగారెడ్డి జిల్లా, కడ్తాల్ మండలం, మైసిగండి నివాసులు కొర్ర శ్రీను-సునీత దంపతుల కూతురు సంజన పుట్టినరోజు సందర్భంగా ఒక గజం భూమి కోసం తమవంతు సహాయంగా 10,000/- ఆర్థిక సహాయం అందించి తమ సేవాతత్పరతను చాటారు. భవిష్యత్తులో కూడా తమ వంతు సహాయం ఆశ్రమానికి అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఆశ్రమం ఫౌండర్ గిరి మాట్లాడుతూ, ఈ భూదాన యజ్ఞం కార్యక్రమంలో భాగంగా మీ పుట్టినరోజులు, పెళ్ళిరోజులు ఇతర కార్యక్రమాలు ఉన్నపుడు ఒక గజం భూమి కోసం పదివేల రూపాయల చొప్పున మీకు తోచిన సహాయన్ని అందించగలరని కోరారు. దిక్కుమొక్కు లేని ఈ అభాగ్యుల సహాయార్థం ప్రతి ఒక్కరు సహాయం అందించాలని కోరారు. ఏవరైనా దాతలు సహాయం చెయ్యాలనుకుంటే సెల్ నెం 9347513830 ను సంప్రదించాలని కోరారు.

# ఘనంగా రాజ్యసభ సభ్యురాలు రేణుక చౌదరి జన్మదిన వేడుకలు..





మణుగూరు, ఆగస్టు 13 (భారతశక్తి): మాజీ కేంద్రమంత్రి, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆడబిడ్డ, ఫైర్ బ్రాండ్ ప్రస్తుత రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి 71వ జన్మదిన వేడుకలు పట్టణంలో వైభవంగా జరిగాయి. బుధవారం అంబేద్కర్ సెంటర్లో గల రేణుకా చౌదరి క్యాంప్ కార్యాలయంలో అక్షర మహిళా మండలి సభ్యుల ఆధ్వర్యంలో ఫైర్ బ్రాండ్ రేణుక చౌదరి పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భద్రాద్రి జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు గురిజాల గోపి ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కట్ చేసి ఫైర్ బ్రాండ్ రాజ్యసభ సభ్యురాలు రేణుక చౌదరికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గురిజాల గోపి మాట్లాడుతూ.. రేణుకమ్మ 1984లో రాజకీయాల్లోకి అరంగేట్రం చేసి దేశ రాజకీయాల్లో తిరుగులేని నాయకురాలిగా ప్రజల మన్నలను పొందారని కొనియాడారు. పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి అనేక సంక్షేమ కార్యక్రమాలు చేశారని గుర్తు చేశారు. రాష్ట్ర రాజకీయాల్లో కూడా ఫైర్ బ్రాండ్ గా రేణుక చౌదరి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పార్టీని ఎదురులేని శక్తిగా నిలిపిందన్నారు. రాజ్యసభ సభ్యురాలు రేణుకమ్మ ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపు కోవాలని ఆకాంక్షించారు. ఈ సంధర్బంగా నిరుపేద మహిళలకు చీరలు అందించి, 300లమందికిపైగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మైనారిటీ నాయకులు ఎండి షరీఫ్, నూరుద్దీన్, అక్షర మహిళ మండలి అధ్యక్షురాలు పూనెం సరోజ, షబానా, బొడ్డు సౌజన్య, కోరి శ్యామల, రమణ, సుజాత, పార్వతి, వసంత, రేణుక,చక్రి, కిషన్ నాయక్, శేఖర్, సాయి, బాబు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ కు వ్యతిరేకంగా మాస్ ప్లెడ్జ్ కార్యక్రమం.





విజయవాడ, భారత శక్తి ప్రతినిధి, ఆగస్టు 13:కేంద్ర యువజన వ్యవహారాలు మరియు క్రీడా మంత్రులతో శాఖ మేరా యువభారత్ మై భారత్ మరియు ఎన్టీఆర్ డిస్టిక్ విభిన్న ప్రతిభావంతులు హిజ్రాలు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నాషా ముక్తా భారత్ అభియాన్ ఐదు సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా ఈరోజు నాశముక్త భారత్ మాస్ ప్లెడ్జ్ అనే కార్యక్రమాన్ని స్థానిక విజయ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఫర్ ఉమెన్ అనే కాలేజీ నందు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిస్టిక్ యూత్ ఆఫీసర్ సుంకర రాము మాట్లాడుతూ యువత చెడు అలవాట్లవైపు ముఖ్యంగా మత్తు పదార్థం వైపు మొగ్గు చూపుతున్నారని వారిని అటువైపు వెళ్ళకుండా ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమానికి ఈగల్ సెల్ డిపార్ట్మెంట్ ఏఎస్ఐ టి రాంబాబు హాజరై ఆయన మాట్లాడుతూ 1972 అనే నెంబర్ టోల్ ఫ్రీ నెంబర్ అని వెహికల్స్ డిపార్ట్మెంట్ అనేక కార్యక్రమాలు చేస్తుందని ముఖ్యంగా డ్రగ్స్ మరియు గంజాయి వంటి వాటిని వినియోగించే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తుందని వారిపై ఎన్ డి పి ఎస్ ఐ యాక్ట్ అమలు చేస్తుందని విద్యార్థులు ఎప్పటికప్పుడు అవగాహన పెంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి యువజన సంక్షేమ అధికారి కృష్ణాజిల్లా డి సుబ్బారావు హాజరయ్యారు ఆయన మాట్లాడుతూ పబ్బె క ల్బర్కు అలవాటు పడి ముందుగా సిగరెట్స్ మందు వంటి వాటిని తీసుకుంటూ మెల్లమెల్లగా డ్రగ్స్ వైపు యువత ముగ్గు చూపుతుందని ఏ అలవాట్లు లేకుండా పనిపై మరియు చదువుపై యువత దృష్టి పెట్టాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు, మై భారత్ ప్రోగ్రాం కోఆర్డినేటింగ్ అఫ్లికేటెడ్ మెంబర్ భీమాల వినోద్ కుమార్, ఐసిడిఎస్ డిపార్ట్మెంట్ లక్ష్మీ భార్గవి, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎం రాజేశ్వరరావు, ఈగల్ సెల్ నెంబర్ టి మనోహర్,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జి మధు శ్రీ, విద్యార్థులు,యువత పాల్గొన్నారు.

# మత్తు పదార్థాల నియంత్రణకు విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి..

**డ్రగ్స్ రహిత సమాజం కోసం అందరూ కలిసికట్టుగా కృషి చేయాలి. జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి పిలుపు..**



రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్, ఆగస్టు 13 (భారత శక్తి):మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల నిరోధానికి విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి సూచించారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో జిల్లా మత్తు పదార్థాల నిరోధక కమిటీ జిల్లా స్థాయి సమావేశం ఆయన అధ్యక్షతన జరిగింది. మిషన్ పరివర్తన %-% సామూహిక ప్రతిజ్ఞ ఈ సందర్భంగా బుధవారం నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా "డ్రగ్స్ రహిత సమాజం" కోసం అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి నేతృత్వంలో అధికారులు, సిబ్బంది, పాల్గొన్న వారు సామూహిక ప్రతిజ్ఞ చేశారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, దుర్వినియోగంపై పోరాటంలో భాగస్వామిగా ఉండి, డ్రగ్స్ వినియోగం దుష్పరిణామాలపై అవగాహన పెంచి, అమ్మకం లేదా కొనుగోలు చేసే వారి సమాచారాన్ని పోలీసులకు అందించి, డ్రగ్స్ రహిత జీవనశైలిని అనుసరిస్తానని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ,మత్తు పదార్థాల వాడకం సమాజానికి పట్టిన చీడపురుగు వంటిదని, దీన్ని సమూలంగా నిర్మూలించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రభుత్వం, పోలీసు శాఖ, యువత, సమాజంలోని అన్ని వర్గాలు సమిష్టిగా కృషి చేస్తేనే డ్రగ్స్ రహిత సమాజం సాధ్యమవుతుందని చెప్పారు. ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు సామాజిక మాధ్యమాలతో పాటు అందుబాటులో ఉన్న అన్ని వేదికలను వినియోగించాలని సూచించారు. విద్యార్థులు, తల్లిదండ్రులకు డ్రగ్స్ వినియోగ దుష్ప్రభావాలపై ప్రత్యేక అవగాహన కల్పించాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు.

యువత భవిష్యత్తు నాశనం అవుతోంది.

తెలుసుకోకుండా మత్తు పదార్థాల బారిన పడటం వలన యువత బంగారు భవిష్యత్తు నాశనం అవుతోందని, శారీరక, మానసిక ఆరోగ్యాన్ని డ్రగ్స్ ధ్వంసం చేస్తున్నాయని హెచ్చరించారు. యువత డ్రగ్స్‌కి దూరంగా ఉండడంతో పాటు, తమ పరిసరాల్లో నిషేధిత మత్తు పదార్థాల సరఫరా లేదా వినియోగం కనిపిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించార. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, జిల్లా ప్రజా పరిషత్ సీఈఓ కృష్ణారెడ్డి, డీపీఓ సురేష్ మోహన్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి శ్రీలత, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# జిహెచ్ఎంసి కమీషనర్ ను కలిసిన కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి..



ఎల్బీనగర్, ఆగష్టు 13 (భారత శక్తి ):ప్రజల భద్రత కోసం వీధి కుక్కల నివాసం ఏర్పాటు కొరకై భారత సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను అనుసరించి, జిహెచ్ఎంసి పరిధిలో కూడా వీధి కుక్కలకు ఊరి బయట ఆవాసం కలగజేసి వాటికి రక్షణ ఇవ్వాలని, అలాగే డివిజన్ పరిధిలో కొత్త రోడ్ల కోసం నిధులు మంజూరు చేయాలనీ, బుధవారం హైదరాబాద్ జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్వీ కర్ణన్ ను సరూర్ నగర్ బీజేపీ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి కలిసి వినతిపత్రం అందజేశారు.

# భైంసా సబ్ కలెక్టర్‌ను కలిసిన నిర్మల్ జిల్లా బంజారా సమాజ నాయకులు..



ఉమ్మడి అదిలాబాద్ జిల్లా బ్యూరో, (భారత శక్తి)ఆగస్టు 13:నిర్మల్ జిల్లా భైంసా సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అజ్మీరా సాంకేత్ కుమార్ (%ఞూ%) ను, నిర్మల్ జిల్లా వివిధ ప్రాంతాల బంజారా సమాజ నాయకుల ప్రతినిధి బృందం మంగళవారం కలిసింది. మాజీ భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జాదో రాజేష్ బాబు ( సీనియర్ బిజెపి నాయకుడు) నాయకత్వంలో ఈ బృందం సబ్ కలెక్టర్‌కు పూలగుచ్ఛం అందించి, శాలువా కప్పి సన్మానించింది. ఈ సన్మాన కార్యక్రమంలో ఆల్ ఇండియా బంజారా సేవా సమితి నిర్మల్ జిల్లా అధ్యక్షుడు తుకారాం, బంజారా సేవా సమితి భైంసా అధ్యక్షుడు నాజిమ్ సింగ్ , రాజేందర్, అశోక్, విజేష్ , బలరాం పాల్గొన్నారు అనంతరం భైంసా పట్టణం మరియు మధోల్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలు తదితర అంశాలపై సబ్ కలెక్టర్‌తో వివరణాత్మకంగా చర్చించారు.

# సైకిల్ యాత్ర అభినందనీయం -రైస్ మిల్లర్స్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్:



ములుగు జిల్లా ప్రతినిధి, ఆగస్టు 13 (భారత శక్తి) : మహిళా సాధికారితే ధ్యేయం గా కామారెడ్డి కి చెందిన బానోత్ వెన్నెల చేపట్టిన సైకిల్ యాత్ర అభినందనీయమని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ములుగు జిల్లా అధ్యక్షుడు బాదం ప్రవీణ్ అన్నారు. బానోత్ వెన్నెల కామారెడ్డి నుండి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రం లో మహిళా సాధికారిత కోసం చెపట్టిన సైకిల్ యాత్ర బుధవారం ములుగు జిల్లా కేంద్రానికి చేరుకుంది.

ఈ సందర్భంగా బాదం ప్రవీణ్ వెన్నెల సైకిల్ యాత్ర కి స్వాగతం పలికి సన్మానం చేశారు. అనంతరం బాదం ప్రవీణ్ మాట్లాడుతూ మహిళా సాధికారత కోసం డిగ్రీ చదువుతున్న వెన్నెల సైకిల్ యాత్ర చేపట్టడం గర్వించదగ్గ విషయమని పేర్కొన్నారు. ముఖ్యం గా మహిళలకు వెన్నెల స్ఫూర్తి దాయకమని ఆయన కొనియాడారు. వెన్నెల ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన కాంగ్రెస్ నాయకులు మైపాల్ రెడ్డి ఆకుతోట అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

# మొదటిసారి రెస్టరంట్‌కు.. ఆ రోజు ఎంతో భయపడ్డా: అమితాబ్ బచ్చన్



మొదటిసారి రెస్టరంట్‌కు వెళ్లిన రోజులను అమితాబ్ తాజాగా గుర్తుచేసుకున్నారు. సినీ పరిశ్రమలో తనకంటూ ప్రత్యేకత చాటుకున్న అమితాబ్ బచ్చన్ ఎంతో కష్టపడి ఈ స్థాయికి వచ్చిన విషయం తెలిసిందే. ఆయన వ్యాఖ్యాతగా వ్యవహరించే 'కౌన్ బనేగా కరోడ్‌పతి'లో కెరీర్ ప్రారంభ రోజులను గుర్తుచేసుకున్నారు. తన మొదటి సంపాదనతో తల్లిదండ్రులను ఓ రెస్టరంట్‌కు తీసుకెళ్లినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమానికి ఓ కంటెస్టెంట్ తల్లిదండ్రులతో వచ్చారు. వారిని చూసిన బిగ్‌బీ ( తన అమ్మానాన్నలను గుర్తుచేసుకున్నారు. "నేను మా తల్లిదండ్రులను తీసుకొని రెస్టరంట్‌కు వెళ్లిన రోజును జీవితంలో మర్చిపోలేను. నా మొదటి సంపాదనతో మేం దిల్లీలోని మోతీ మహల్‌కు వెళ్లాం. చాలా భయం వేసింది. పెద్ద రెస్టరంట్‌లకు సంపన్నులు, ప్రముఖులు వస్తుంటారు. వాళ్లు మమ్మల్ని ఎలా చూస్తారో.. వాళ్లు ధరించిన దుస్తులు ఎలా ఉంటాయో అని ఎన్నో ఆలోచనలు వచ్చాయి" అని గుర్తుచేసుకున్నారు.

చదువు పూర్తయ్యాక కొన్నాళ్లపాటు అమితాబ్ కోల్‌కతాలోని ఓ షిప్పింగ్ సంస్థలో పని చేశారు. ఆ ఉద్యోగానికి రాజీనామా చేసి ముంబయి వెళ్లి నటుడిగా మారారు. తన కల నెరవేర్చుకొని ఎందరికో స్ఫూర్తిగా నిలిచారు. 'సాత్ హిందూస్థానీ'తో 1969లో తెరంగేట్రం చేశారు. హిందీ, తెలుగు, మలయాళం, భోజ్‌పురి తదితర భాషల్లో 200కి పైగా చిత్రాల్లో విభిన్న పాత్రలు పోషించి అలరించారు. 80 ఏళ్లు దాటినప్పటికీ వరుసగా సినిమాలు చేస్తూ యంగ్ హీరోలతో పోటీపడుతున్నారు.

# ఆలోచన రేకెత్తించేలా యూనివర్సిటీ: దర్శకుడు త్రివిక్రమ్



"కొన్ని విషయాల్ని ఆర్.నారాయణమూర్తి చెబితేనే వింటారు ప్రేక్షకులు. ఎందుకంటే డబ్బు కోసమో లేదంటే విజయం కోసమో కాకుండా నిజంగా ప్రజలకి తెలియాల్సిన విషయాన్నే చెబుతుంటారు. అలాంటి అంశాలు ఉంటాయనే ఆయన తీసిన సినిమాల్ని అందరం చూస్తాం, గౌరవిస్తాం" అన్నారు ప్రముఖ దర్శకుడు త్రివిక్రమ్. ఆయన ఇటీవల హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన 'యూనివర్సిటీ పేపర్ లీక్' సినిమా ప్రత్యేక ప్రదర్శనకు హాజరయ్యారు. ఆర్.నారాయణమూర్తి ప్రధాన పాత్రలో నటిస్తూ, స్వీయ దర్శకనిర్మాణంలో రూపొందించిన చిత్రమిది. ఈనెల 22న మరోసారి ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగానే ఈ సినిమా ప్రత్యేక ప్రదర్శనని ఏర్పాటు చేశారు.

సినిమా ప్రదర్శన అనంతరం త్రివిక్రమ్ మీడియాతో మాట్లాడారు. "యూనివర్సిటీ పేపర్‌లీక్' సినిమా ప్రారంభం కావడానికి ముందు రెండున్నర గంటలు చూడాలా అని భయపడ్డాను కానీ, ఆలోచింపజేసే అంశాలతో పరుగులు పెట్టించారు ఆర్.నారాయణమూర్తి. నారాయణమూర్తి మరిన్ని సినిమాలు తీయాలంటే ఇలాంటి సినిమాలు బతకాలి. ఎన్నో సూపర్‌హిట్ సినిమాలు తీశారు. ఆయన్ని నా సినిమాలో ఓ పాత్ర కోసం అనుకున్నా. పారితోషికం ఆశచూపించి ఆర్.నారాయణమూర్తికి కొనలేరని ఎవరో చెప్పారు. ఆయన శైలిలో ఆయనొక సూపర్‌స్టార్. తర్వాత సినిమాకి మరింత ఎక్కువ ఖర్చు పెట్టి తీయడానికి అవకాశం కలిగేలా ఈ చిత్రానికి పెద్ద విజయం దక్కాలని కోరుకుంటున్నా. విద్యార్థుల భవిష్యత్ కోసమని వారి వర్తమానాన్ని తాకట్టు పెట్టే తల్లిదండ్రుల్ని ఉక్కిరిబిక్కిరి చేస్తుందీ చిత్రం. మనం చదువుతో వచ్చే విజయం వెనకాల పరుగులు పెడుతున్నామా లేక, జ్ఞానం వెనకాలా? జ్ఞానం వెనకాల పరిగెడుతుంటే... అది మనకు ఆనందాన్ని ఇవ్వాలి కానీ, ఇంత నొప్పి ఎందుకు వస్తుంది. మనల్ని కన్నవాళ్లకి ఎందుకు ఇంత కష్టాన్ని ఇస్తుంది? పిల్లలమీద ఎందుకు అంత ఒత్తిడి పెట్టేస్తున్నాం? అనే విషయాలు ఈ సినిమాలో నాకు బాగా నచ్చాయి" అన్నారు. ఆర్.నారాయణమూర్తి మాట్లాడుతూ "విద్యని ప్రైవేటు మాఫియా కబంధ హస్తాల నుంచి విముక్తి చేయాలి, ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని చెప్పే చిత్రమిది" అన్నారు.

# మరో మారు.. వినోదాల జోరు

%సినీ కార్మికుల సమ్మెతో తెలుగు చిత్రసీమలో క్లాప్ బోర్డుల చప్పుళ్లు వినిపించడం లేదు. చిత్రీకరణలన్నీ ఎక్కడికక్కడ స్తంభించిపోయాయి. కానీ, సినీప్రియులకు వినోదాలకు లోటు లేదన్నట్లుగానే బాక్సాఫీస్ బరిలో కొత్త చిత్రాల సందడి కనిపిస్తోంది. ఈ ఏడాదిలో ఇప్పటికే ఓసారి ప్రేక్షకుల్ని పలకరించిన కథానాయకులు సైతం.. ఈ ద్వితీయార్ధంలో మరో మారు వినోదాల విందు వడ్డించేందుకు సిద్ధమవుతుండటం ఇటు



ప్రేక్షకుల్లోనూ అటు మార్కెట్ వర్గాల్లోనూ జోష్‌ను నింపుతోంది. మరి రెండోసారి బాక్సాఫీస్ బరిలో సందడి చేసేందుకు సిద్ధమవుతున్న ఆ తారలెవరు?

సంక్రాంతికి ఒకటి.. దసరాకి మరొకటి అంటూ అగ్ర కథానాయకులు వరుస చిత్రాలతో బాక్సాఫీస్ బరిలో సందడి చేస్తుంటే ప్రేక్షకులకు అంతకంటే కావాల్సిందేముంటుంది. మార్కెట్ వర్గాలు కోరుకునేది కూడా ఇదే. ఇలా అగ్ర హీరోలు ఏడాదికి ఒకటికి రెండు చిత్రాలతో వినోదాలు పంచుతుంటే పరిశ్రమలోనూ నూతనోత్తేజం కనిపిస్తుంటుంది. కానీ, ఇలాంటి మ్యాజిక్‌లు ఈరోజుల్లో మరీ అరుదైపోయాయి. స్టార్ హీరోలంతా కథల ఎంపికలో ఆచితూచి అడుగులేస్తుండటం.. దీనికి తగ్గట్లుగానే ఒప్పుకున్న సినిమాలు కూడా ఏళ్లకు ఏళ్లు సెట్స్‌పైనే ఉండటంతో వాళ్ల నుంచి ఏడాదికి ఒక్క చిత్రం చూడటమే గగనమైపోతుంది. కానీ, ఈ ఏడాది కొందరు అగ్ర హీరోలు రెండేసి చిత్రాలతో బాక్సాఫీస్ బరిలో సందడి చేస్తుండటం ఇటు ప్రేక్షకుల్లోనూ అటు మార్కెట్ వర్గాల్లోనూ జోష్‌ను నింపుతోంది.

ఈ సంవత్సరం సంక్రాంతికి 'డాకు మహారాజ్'గా థియేటర్లలో జోరు చూపించారు నందమూరి బాలకృష్ణ. ఇప్పుడాయన దసరా బరిలో 'అఖండ 2: తాండవం'తో వినోదాలు పంచేందుకు సిద్ధమవుతున్నారు. విజయవంతమైన 'అఖండ'కు సీక్వెల్‌గా బోయపాటి శ్రీను తెరకెక్కిస్తున్న పాన్ ఇండియా చిత్రమిది. ఆధ్యాత్మిక అంశాలతో ముడిపడి ఉన్న మాస్ యాక్షన్ కథతో ఈ చిత్రం ముస్తాబవుతోంది. తొలి భాగంలో లాగే బాలయ్య ఇందులో రెండు పాత్రల్లో కనువిందు చేయనున్నారు. ఇప్పటికే విడుదలైన ఈ చిత్ర గ్లింప్స్.. అందులో అఘోరాగా బాలయ్య చేసిన విన్యాసాలు ప్రేక్షకుల్ని విశేషంగా అలరించాయి. దీంతో ఈ సినిమాపై అంచనాలు రెట్టింపయ్యాయి. మరి ఆ అంచనాల్ని అందుకుంటూ బాలకృష్ణ ఈ ఏడాది మరో విజయాన్ని ఖాతాలో వేసుకుంటారో లేదో తెలియాలంటే సెప్టెంబరు 25 వరకు వేచి చూడక తప్పదు.

కథానాయకుడు నాగార్జున కెరీర్‌లో ఈ 2025 ప్రత్యేకంగా నిలవనుంది. ప్రస్తుతం వైవిధ్యభరితమైన పాత్రలతో అలరించేందుకు ఎక్కువ ఆసక్తి కనబరుస్తున్న ఆయన.. ఈ సంవత్సరంలో వరుసగా రెండు చిత్రాల్లో ప్రతినాయక ఛాయలున్న పాత్రల్లో కనువిందు చేయడం విశేషం. ఈ జూన్‌లో ఆయన 'కుబేర'తో ప్రేక్షకుల్ని పలకరించిన సంగతి తెలిసిందే. నాగ్ అందులో దీపక్‌గా గ్రే షేడ్‌తో సాగే పాత్రలో అలరించారు. ఇక ఇప్పుడు 'కూలీ' కోసం పూర్తి స్థాయి ప్రతినాయక పాత్రలో విలనిజం చూపించేందుకు సమాయత్తమవుతున్నారు. రజనీకాంత్ కథానాయకుడిగా నటించిన ఈ సినిమాని లోకేశ్ కనగరాజ్ తెరకెక్కించారు. నాగార్జున దీంట్లో సైమన్‌గా రజనీని ఢీ కొట్టే విలన్ పాత్ర పోషిస్తున్నారు. ఈ సినిమా ఈనెల 14న రానుంది. ఈ సినిమాలో ఆమిర్ ఖాన్, ఉపేంద్ర, సౌబిన్ షాహిర్, శ్రుతిహాసన్ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తుండటం మరో విశేషం.




విజయమే లక్ష్యంగా పవన్..

కథానాయకుడు పవన్ కల్యాణ్ రాజకీయాలతో తీరిక లేకుండా గడపడం వల్ల గతేడాది ఒక్క చిత్రాన్నీ ప్రేక్షకుల ముందుకు తీసుకురాలేకపోయారు. కానీ, ఈ ఏడాది మాత్రం ఒకటికి రెండు చిత్రాలతో సినీప్రియుల్ని అలరించేందుకు సిద్ధమయ్యారు. ఇటీవలే ఆయన 'హరి హర వీరమల్లు'గా వెండితెరపై సందడి చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు 'ఓజీ'తో దసరా బరిలోకి దిగనున్నారు పవన్. సుజిత్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ పాన్ ఇండియా చిత్రంపై ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి. గ్యాంగ్‌స్టర్ డ్రామా కథతో ముస్తాబైన ఈ సినిమాలో ఓజాస్ గంభీర అనే శక్తిమంతమైన పాత్రలో కనువిందు చేయనున్నారు పవన్. మరి ఆయన చేసే యాక్షన్ హంగామా సినీప్రియుల్ని ఏమేర అలరిస్తుందో తెలియాలంటే సెప్టెంబరు 25వరకు వేచి చూడక తప్పదు.

కుర్రాళ్లు వస్తున్నారు..

ఈ ఏడాది ఆరంభంలో 'జాక్' రూపంలో సిద్ధు జొన్నలగడ్డకు పెద్ద ఎదురు దెబ్బ తగిలింది. దీంతో ఇప్పుడు రెండో ప్రయత్నంగా 'తెలుసు కదా'తో బాక్సాఫీస్ బరిలో అదృష్టం పరీక్షించుకునేందుకు సిద్ధమవుతున్నారు. నీరజ కోన దర్శకత్వంలో ముస్తాబైన ఈ రొమాంటిక్ డ్రామా ప్రస్తుతం నిర్మాణాంతర పనుల్లో ఉంది. ఈ అక్టోబరు 17న థియేటర్లలోకి రానుంది. గతేడాది దీపావళికి 'క'తో థియేటర్లలో మెరుపులు మెరిపించారు కిరణ్ అబ్బవరం. కానీ, ఈ ఏడాది ఆరంభంలో వచ్చిన 'దిల్ రూబా'తో ఆ జైత్ర యాత్రను కొనసాగించలేకపోయారు. దీంతో ఇప్పుడు మరోసారి దీపావళి బరిలోనే అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు 'కె-ర్యాంప్'తో సిద్ధమయ్యారు. ప్రస్తుతం ముగింపు దశలో ఉన్న ఈ రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ కూడా అక్టోబరు 17నే ప్రేక్షకుల్ని పలకరించనుంది. ఇక ఈ ఏడాది ఇప్పటికే 'రాబిన్ హుడ్', 'తమ్ముడు' చిత్రాలతో సినీప్రియుల్ని పలకరించిన నితిన్‌కు.. రెండూ చేదు ఫలితాల్నే అందించాయి.

# 'కూలీ' విషయంలో నాకు ఆ భయం లేదు: శ్రుతి హాసన్



ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 'కూలీ' హంగామా కొనసాగుతోంది. అగ్రకథానాయకుడు రజనీకాంత్ హీరోగా లోకేశ్ కనగరాజ్ తెరకెక్కించిన యాక్షన్ థ్రిల్లర్ మరికొన్ని గంటల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇందులో ప్రీతి అనే పాత్రలో శ్రుతి హాసన్ కనిపించనున్నారు. తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. 'కూలీ' చిత్రం రజనీకాంత్ అభిమానులను సర్‌ప్రైజ్ చేస్తుందని వారిలో జోష్ పెంచారు.

"ఇందులో అగ్రహీరోలు రజనీకాంత్, నాగార్జున (%చీఝస్త్రుతీయబఋ%), ఆమిర్ ఖాన్ ఇలా ఎంతో మంది ఉన్నారు. నా పాత్రకు గుర్తింపు ఉండదేమో అనే భయం నాకు లేదు. ఎందుకంటే లోకేశ్ ఈ సినిమాను అద్భుతంగా రూపొందించారు. ప్రతి పాత్రకు న్యాయం చేసే విధంగా స్క్రిప్ట్ రాశారు. అందరి పాత్రలు భిన్నంగా ఉంటాయి. రజనీకాంత్‌తో ( వర్క్ చేస్తూ ఎన్నో విషయాలు నేర్చుకున్నాను. ఆయన సెట్‌లో ఉంటే ఎంతో సందడిగా ఉంటుంది. ఆయనను చూడటమే ఒక అద్భుతం"

"తెరపై ప్రీతీని చూసేందుకు అందరిలాగే నేనూ ఎదురుచూస్తున్నా. 'ఖైదీ', 'మాస్టర్', 'విక్రమ్' వంటి సినిమాలతో వరుస విజయాలు సొంతం చేసుకున్న లోకేశ్ 'కూలీ'తో మరోసారి అందరినీ ఆశ్చర్యపరుస్తారు. ఆయన సినిమాల్లో ప్రేక్షకులకు నచ్చే యాక్షన్ సన్నివేశాలుంటాయి. భావోద్వేగాలతో పాటు వినోదానికి కూడా లోటుండదు. 'కూలీ' ప్రేక్షకుల అంచనాలకు ఏమాత్రం తగ్గదు. ముఖ్యంగా రజనీ అభిమానులకు ఇదో సర్‌ప్రైజ్. లోకేశ్ నాకు ఈ కథ చెప్పగానే అంగీకరించా. ప్రీతి పాత్ర మహిళలందరికీ నచ్చుతుంది" అని శ్రుతి ధీమా వ్యక్తం చేశారు.

# డొక్కా సీతమ్మ కథతో..

సముద్ర, శివిక, కుసుమ, సుప్రియ ప్రధాన పాత్రధారులుగా సురేశ్ లంకలపల్లి తెరకెక్కించిన చిత్రం 'అన్నపూర్ణ తల్లి బువ్వమ్మ'. సిరాజ్, ఖాదర్ గోరి నిర్మించారు. రూపేశ్, ఆదిల్, నవీన్ మట్టా తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా చిత్రీకరణ పూర్తి చేసుకున్న సందర్భంగా ఇటీవల హైదరాబాద్‌లో గుమ్మడికాయ కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "డొక్కా సీతమ్మ లాంటి స్ఫూర్తిదాయక వ్యక్తుల కథలు తప్పకుండా జనాలకు తెలియాలి. ఇటువంటి ఆదర్శవంతమైన చిత్రాలే నేటి సమాజానికి అవసరం" అన్నారు. "డొక్కా సీతమ్మ జీవిత కథే ఈ సినిమా. ఇందులో నేను సీతమ్మ భర్త పాత్రను పోషించడం నా అదృష్టం" అన్నారు దర్శకుడు వి.సముద్ర. "మేము చాలా మంచి చిత్రం తీశాం. ప్రేక్షకులు ఆదరిస్తారని నమ్ముతున్నాం" అన్నారు దర్శకుడు సురేశ్. ఈ కార్యక్రమంలో శివిక, సిరాజ్, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తతరం నటులు కల్యాణ్, ప్రియాపాల్, సోఫియా ఖాన్, ఊహారెడ్డి ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కుతున్న చిత్రం 'మానిప్యులేటర్'. వీజే సాగర్ దర్శకత్వం వహిస్తున్నారు. ఆయనే రవిసాగర్‌తో కలిసి నిర్మిస్తున్నారు. 'ఏ స్టార్ ఈజ్ బార్న్'గా సెట్స్‌పైకి వెళ్లిన ఈ చిత్రానికి 'మానిప్యులేటర్' అనే పేరుని ఖరారు చేశారు. ప్రముఖ దర్శకుడు బి.గోపాల్ చేతులమీదుగా మంగళవారం ఈ సినిమా ఫస్ట్‌లుక్ విడుదలైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "కంటెంట్ ప్రధానంగా సాగే సినిమాలవైపు ప్రేక్షకులు మొగ్గు చూపిస్తున్నారు. బలమైన కంటెంట్‌తో రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకుల మెప్పు పొందుతుందని ఆశిస్తున్నా" అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "పాత్ర ప్రధానంగా, పక్కా కమర్షియల్ సినిమాగా రూపొందుతున్న చిత్రమిది. 43 మంది కొత్త నటులు ఈ సినిమాతో పరిచయం అవుతున్నారు. కథ, కథనాలు ప్రేక్షకుల్ని మెప్పిస్తాయి. త్వరలోనే పాటల విడుదల వేడుకని నిర్వహిస్తాం" అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: సునీల్ కశ్యప్.

'భద్రకాళి' చిత్రంతో తెలుగు ప్రేక్షకుల్ని పలకరించనున్నారు విజయ్ ఆంటోని. ఆయన హీరోగా నటించిన ఈ సినిమాని అరుణ్ ప్రభు తెరకెక్కించారు. రామాంజనేయులు జవ్వాజి నిర్మించారు. వాగై చంద్రశేఖర్, సునీల్ కృష్ణపాని తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ఏషియన్ సురేశ్ ఎంటర్‌టైన్‌మెంట్స్, స్పిరిట్ మీడియా సంస్థల ద్వారా సెప్టెంబరు 19న తెలుగులో విడుదల కానుంది. ఈ విషయాన్ని మంగళవారం ప్రకటించారు. "రాజకీయ అంశాలతో ముడిపడిన యాక్షన్ థ్రిల్లర్ ఇది. విజయ్ ఆంటోని కెరీర్‌లో మైలురాయిలా నిలిచే సినిమా అవుతుంది" అని చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ చిత్రానికి సంగీతం: విజయ్ ఆంటోని, ఛాయాగ్రహణం: షెల్లీ కాలిస్ట్.

# భారత్‌లోని ప్రధాన కార్యాలయం విక్రయిస్తున్న కాగ్నిజెంట్..

ప్రధాన టెక్ సంస్థ కాగ్నిజెంట్ భారత్‌లోని తన ప్రధాన కార్యాలయాన్ని విక్రయానికి పెట్టింది. చెన్నైలోని ఒక్కియం తొరాయ్‌పక్కంలోని ఈ భవనాన్ని దాదాపు 20 ఏళ్లుగా ఆ సంస్థ




హెడ్ ఆఫీస్‌గా వినియోగిస్తోంది. ఐటీ కారిడార్‌లోని దాదాపు 15 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న నాలుగు లక్షల చదరపు అడుగుల ఈ కార్యాలయం విలువ కనీసం రూ.750 - రూ.800 కోట్ల మధ్య ఉంటుందని రియల్ ఎస్టేట్ సంస్థల అంచనా. అంతర్జాతీయ స్థిరాస్తి సేవలందించే సంస్థ జేఎల్ఎల్‌కు దీని విక్రయ బాధ్యతలను అప్పగించినట్లు ఆంగ్ల పత్రిక టైమ్స్ ఆఫ్ ఇండియా కథనం ప్రచురించింది.

ఇప్పటికే జేఎల్ఎల్ సంస్థ భాష్యం గ్రూప్, కాసగ్రాండ్ సంస్థలతో చర్చలు జరిపింది. కానీ, డీల్ ముందుకువెళ్లలేదు. దీనిపై ఇటు కాగ్నిజెంట్, అటు జేఎల్ఎల్ ఎటువంటి వ్యాఖ్యలు చేయలేదు. ఈ ఏడాది డిసెంబర్ నాటికి మాత్రం సాఫ్ట్‌వేర్ సంస్థ ఈ కార్యాలయాన్ని ఖాళీ చేసే అవకాశాలున్నాయి. జీఎస్‌టీ రోడ్డులోని తంబారం సమీపంలోని సరికొత్త ప్రధాన కార్యాలయం అప్పటికల్లా అందుబాటులోకి వస్తుందని భావిస్తున్నారు.

కాగ్నిజెంట్ చెన్నైలోని తన కార్యకలాపాలను ఎంఈపీజెడ్, షోలింగనల్లూర్, సిరుసేరిలోని మూడు భవనాల్లో ఏకీకృతం చేస్తోంది. ఇక్కడ డీఎల్ఎఫ్, సెయింట్ మేరీస్ రోడ్డులోని ఆఫీస్ లీజులను వదిలేసుకొంది.

# టర్మ్ ఇన్సూరెన్స్‌పై జీఎస్టీ తొలగింపు..?

బీమా పాలసీ ప్రీమియంలపై జీఎస్టీని రద్దు చేయాలంటూ డిమాండ్లు వెల్లువెత్తుతున్న వేళ.. ఆ దిశగా కీలక నిర్ణయం వెలువడే అవకాశం కనిపిస్తోంది. టర్మ్ ఇన్సూరెన్స్ పాలసీలను జీఎస్టీ నుంచి మినహాయించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. త్వరలో జరిగే జీఎస్టీ కౌన్సిల్ భేటీలో దీనికి సంబంధించిన నిర్ణయం వెలువడే అవకాశం ఉందంటూ విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ 'మనీ కంట్రోల్' ఓ కథనాన్ని ప్రచురించింది.



పెట్టుబడులకు సంబంధించిన బీమా పాలసీలపై మాత్రం జీఎస్టీ యథావిధిగా కొనసాగించే అవకాశం ఉందని సీనియర్ ఉన్నతాధికారి పేర్కొన్నారు. టర్మ్ ఇన్సూరెన్స్ అనేది పూర్తిస్థాయి బీమా రక్షణ అందిస్తుంది. ఇతర పాలసీలు బీమాతో పాటు ప్రతిఫలాన్ని అందిస్తాయి కాబట్టి వీటిపై మినహాయింపు ఇవ్వకపోవచ్చని తెలుస్తోంది. ఈ మినహాయింపు వల్ల సుమారు రూ.200 కోట్ల మేర ప్రభుత్వం ఆదాయం కోల్పోయే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. టర్మ్ ఇన్సూరెన్స్‌పై జీఎస్టీ తొలగిస్తే.. ఆ మేర పాలసీదారులకు ప్రయోజనం చేకూరుతుంది. తద్వారా మరింత మంది బీమా పరిధిలోకి వెళ్లే అవకాశం ఉంటుంది.

నివేదిక చూస్తే స్కోరు తగ్గుతుందా?

జీవిత, ఆరోగ్య బీమా పాలసీలపై జీఎస్టీని తొలగించాలంటూ నిర్మలా సీతారామన్‌కు కేంద్రమంత్రి గడ్కరీ ఇటీవల లేఖ రాయడంతో ఈ వ్యవహారంపై చర్చ మొదలైంది. తనకొచ్చిన విజ్ఞప్తిని గడ్కరీ తన లేఖలో ప్రస్తావించగా.. విపక్షాలు ఈ డిమాండ్‌ను గట్టిగా అందుకున్నాయి. ప్రస్తుతం ఆరోగ్య బీమా, టర్మ్ ఇన్సూరెన్స్‌పై 18 శాతం జీఎస్టీ వర్తిస్తుండగా.. సంప్రదాయ బీమా ప్లాన్లపై వేర్వేరు రేట్లు అమల్లో ఉన్నాయి. తొలి ఏడాది ప్రీమియంపై 4.5 శాతం, ఆ తర్వాత 2.25 చొప్పున జీఎస్టీ చెల్లించాల్సి వస్తోంది. కేవలం టర్మ్ ఇన్సూరెన్స్‌పై మాత్రమే మినహాయింపు ఉంటుందా? ఆరోగ్య బీమాపై కూడా జీఎస్టీ రేట్లు తగ్గిస్తారా? అనేది స్పష్టత రావాల్సి ఉంది.

# ఫిన్‌టెక్‌ల కోసం ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటోంది: మోదీ



ముంబయి: ఫిన్‌టెక్ రంగాన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక విధానపరమైన చర్యలు తీసుకుంటోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. అందులో ఒకటి ఏంజిల్ ట్యాక్స్‌ను రద్దు చేయడం. ఫలితంగా గత పదేళ్లలో ఈ రంగం 31 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షించిందని తెలిపారు. 'గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2024' కార్యక్రమంలో మాట్లాడుతూ శుక్రవారం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

ప్రజల్లో డిజిటల్ అక్షరాస్యతను పెంచటంతో పాటు సైబర్ నేరాలను అరికట్టే దిశగా చర్యలు తీసుకోవాలని ప్రధాని మోదీ ( ఈసందర్భంగా నియంత్రణ సంస్థలను కోరారు. ప్రజలకు ఆర్థిక సేవలను చేరువ చేయటంలో ఫిన్‌టెక్ రంగం కీలకపాత్ర పోషించిందని పేర్కొన్నారు. ప్రజల జీవన ప్రమాణాలను పెంచడంలో ఇవి ముఖ్య భూమిక పోషిస్తున్నాయని తెలిపారు.

భారతీయులు ఫిన్‌టెక్‌ను అలవర్చుకున్న తీరు అసామాన్యమని.. ఇంత వేగంగా ప్రపంచంలో ఈ రంగం ఎక్కడా విస్తరించలేదని మోదీ పేర్కొన్నారు. ఫిన్‌టెక్ ప్రభావం కేవలం టెక్నాలజీకి మాత్రమే పరిమితం కాలేదని.. సామాజికంగానూ పలు మార్పులు చోటుచేసుకున్నాయని తెలిపారు. ఆర్థిక సేవల విషయంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు మధ్యనున్న అంతరాన్ని తగ్గించిందని వివరించారు.

దేశంలో పండగ సీజన్ దగ్గరకొచ్చిందని.. ఆర్థికవ్యవస్థలోనూ అదే వాతావరణం కనిపిస్తోందని మోదీ అన్నారు. జీడీపీలో బలమైన వృద్ధి రేటు, క్యాపిటల్ మార్కెట్లు కొత్త శిఖరాలకు చేరడం వంటి పరిణామాలను ఉద్దేశించి ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రధానమంత్రి ముద్ర యోజన కింద ఇప్పటివరకు రూ.27 లక్షల కోట్ల రుణాలను మంజూరుచేసినట్లు గుర్తు చేశారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంతదాస్ మాట్లాడుతూ.. ఆర్థికవ్యవస్థలో అందరినీ భాగస్వాములను చేయడంలో డిజిటల్ టెక్నాలజీ కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. డిజిటల్ చెల్లింపుల్లో భారత్ ఈరోజు అగ్రస్థానంలో ఉందని వెల్లడించారు. విధానపరమైన నిర్ణయాలతో పాటు సాంకేతికంగా వచ్చిన పురోగతే అందుకు దోహదం చేసిందని వివరించారు. భారత ఫిన్‌టెక్ ప్రయాణంలో విధాన రూపకర్తలు, నియంత్రణ సంస్థలు, ఆవిష్కర్తల మధ్య సహకారం చాలా కీలకమైనదని పేర్కొన్నారు.

వినూత్న వ్యాపారాలు ఒక క్రమపద్ధతిలో వృద్ధి చెందడానికి రిజర్వ్ బ్యాంక్ విధానాలు దోహదం చేశాయని దాస్ అన్నారు. కొత్త ఆవిష్కరణలను ఆహ్వానించడం, ప్రోత్సహించడానికి తామెప్పుడూ సిద్ధంగా ఉంటామనడానికి ఇదే నిదర్శనమని తెలిపారు. ఫిన్‌టెక్ రంగంలోని వ్యక్తులతో గత ఏడాదిగా పలు సంప్రదింపులు జరిపామని వెల్లడించారు. కలిసికట్టుగా ముందుకువెళ్లడానికి తాము చేస్తున్న కృషికి ఇది ఒక ఉదాహరణ అని వివరించారు.

# షాపుంటే ఎవరైనా ఓలా స్కూటర్లు అమ్ముకోవచ్చు: సీఈఓ భవీశ్

ముంబయి: ప్రముఖ విద్యుత్ ద్విచక్ర వాహన తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్ ( సీఈఓ భవీశ్ అగర్వాల్ (%) కీలక ప్రకటన చేశారు. షాప్ ఉన్న ఎవరైనా ఓలా ఎలక్ట్రిక్ ఉత్పత్తులను విక్రయించొచ్చని పేర్కొన్నారు. ప్రభుత్వరంగ ఇ-కామర్స్ వేదిక ఓఎన్‌డీసీలో వచ్చేవారం నుంచి ఓలా ఎలక్ట్రిక్ ప్రొడక్టులు అందుబాటులోకి రానున్నాయని ప్రకటించిన ఆయన.. ఓలా స్కూటర్లను సైతం ఎవరైనా విక్రయించొచ్చని పేర్కొన్నారు.

"ఓలాకు ప్రస్తుతం దేశవ్యాప్తంగా 800 స్టోర్లు ఉన్నాయి. మరిన్ని కొత్త, ఎక్స్‌క్లూజివ్ స్టోర్లు ప్రారంభించే బదులు ఎవరైనా ఓలా స్కూటర్లను విక్రయించొచ్చు" అంటూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. అంటే ఏదైనా గ్యారేజీలో ఇకపై ఓలా ఎలక్ట్రిక్ స్కూటర్ విడి భాగాలను సులువుగా కొనుగోలు చేయడానికి వీలుపడుతుందని, తద్వారా ఏ గ్యారేజీలోనైనా ఓలా ఎలక్ట్రిక్ సర్వీసులు లభిస్తాయంటూ మరో పోస్టులో వివరించారు.

మరోవైపు ఓలా ఎలక్ట్రిక్ ఇటీవలే ఐపీఓకు వచ్చిన సంగతి తెలిసిందే.



అనంతరం వెలువరించిన త్రైమాసిక ఫలితాల్లో మెరుగైన పనితీరు కనబరిచింది. గతేడాదితో పోలిస్తే ఆదాయంలో వృద్ధి నమోదైంది. అదే సమయంలో నష్టం రూ.267 కోట్ల నుంచి రూ.347 కోట్లకు పెరిగింది. మరోవైపు రోడ్‌స్టర్ పేరిట మూడు వేరియంట్ల ఎలక్ట్రిక్ మోటార్ సైకిళ్లను తీసుకొస్తామని ప్రకటించింది. వీటి ధరలు రూ.74,999 నుంచి ప్రారంభం కానున్నాయి.

# స్టీవ్ జాబ్స్, బిల్ గేట్స్ రెజ్యూమేలు చూశారా..? నెట్టింట వైరల్‌గా మారిన ఫొటోలు

టెక్ దిగ్గజాలు, ప్రముఖ సంస్థలు నిర్వహిస్తున్న వ్యక్తులకు సంబంధించిన ప్రతీ అంశం నెట్టింట వైరల్‌గా మారుతుంటాయి. కెరియర్ ప్రారంభంలో వారు ఎదుర్కొన్న సంఘటనలు, నేర్చుకున్న పాఠాలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతుంటాయి. తాజాగా



యాపిల్ సహ వ్యవస్థాపకుడు స్టీవ్ జాబ్స్ మైక్రోసాఫ్ట్ (సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ ( రెజ్యూమేలు నెట్టింట వైరల్‌గా మారాయి. 18 ఏళ్ల వయసులో రూపొందించిన రెజ్యూమే లు కావడమే అందుకు కారణం.

స్టీవ్ జాబ్స్ 1973లో రూపొందించిన రెజ్యూమేలో ఎలక్ట్రానిక్స్, టెక్నాలజీపై మక్కువ ఉందని.. ఆయా విభాగాల్లో తనకున్న సామర్థ్యాన్ని రాసుకొచ్చారు. ఇక బిల్‌గేట్స్ 1970లో క్రియేట్ చేసిన రెజ్యూమేలో వివిధ ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్‌లో అనుభవాన్ని పంచుకుంటూ తన జీతం 35,000 డాలర్లుగా తెలిపారు. అప్పట్లో ఓ విద్యార్థికి ఇంత మొత్తంలో జీతం అంటే చాలా ఎక్కువ. అదే రెజ్యూమేలో పాల్ జి అలెన్‌తో భాగస్వామ్యం గురించి కూడా ప్రస్తావించారు. అలెన్‌తో కలిసి మైక్రోసాఫ్ట్‌ను స్థాపించారు. ఈ టెక్ దిగ్గజాల రెజ్యూమెలు చూసి నెటిజన్లు ఆశ్చర్యపోతూ కామెంట్లు పెడుతున్నారు.

అజంతా, ఎల్లోరా గుహలు చుట్టొస్తారా..? ఐఆర్‌సీటీసీ ప్యాకేజీ వివరాలు ఇవే..

స్టీవ్ జాబ్స్.. యాపిల్, పిక్సర్ యానిమేషన్ స్టూడియోస్ సహ వ్యవస్థాపకుడు. %ాజూజూశ్రీవ ××% ను రూపొందించిన ఆయన సంస్థల అభివృద్ధిలో కీలకపాత్ర పోషించారు. 1985లో యాపిల్‌ను వదిలివెళ్లిన ఆయన 1997లో తిరిగి అడుగుపెట్టారు. ఐమ్యాక్, ఐపాడ్, ఐఫోన్ ఉత్పత్తుల రూపకల్పనకు నాయకత్వం వహించారు. ప్రపంచంలోనే అత్యంత విలువైన కంపెనీల్లో యాపిల్‌ను నిలబెట్టేందుకు స్టీవ్ ఎంతో శ్రమించారు. 2011 అక్టోబర్5 న ఆయన మరణించారు.

బిల్‌గేట్స్.. పాల్ జి అలెన్‌తో కలిసి 1975లో మైక్రోసాఫ్ట్‌ను స్థాపించారు. చిన్నప్పటినుంచి గేట్స్‌కు కంప్యూటర్ లాంగ్వేజ్ అంటే అభిరుచి. దీంతో 13 ఏళ్ల వయసులో కోడింగ్ రాయడం ప్రారంభించారు. ఇక వీరిద్దరూ కలిసి రూపొందించిన %మీా-ణూా% ఆపరేటింగ్ సిస్టమ్ గొప్ప విజయాన్ని అందించింది. దాతృత్వ కార్యక్రమాల కోసం 2000లో మెలిండా గేట్ ఫౌండేషన్‌ను స్థాపించారు. ప్రస్తుతం మైక్రోసాఫ్ట్ రోజువారీ కార్యాలయాల్లో ఆయన పాల్గొనకపోయినప్పటికీ కంపెనీ సాంకేతికత సలహాదారుడిగా వ్యవహరిస్తున్నారు.

# అజంతా, ఎల్లోరా గుహలు చుట్టొస్తారా..? ఐఆర్‌సీటీసీ ప్యాకేజీ వివరాలు ఇవే..

ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఒకటైన ఘృశ్ణేశ్వర ఆలయాన్ని సందర్శించుకొనే వారి కోసం ఇండియన్ రైల్వే టూరిజం కార్పొరేషన్ కొత్త టూర్ ప్యాకేజీని తీసుకొచ్చింది. ఆలయ దర్శనంతో పాటు అజంతా, ఎల్లోరా గుహల్ని చుట్టొచ్చే అవకాశాన్ని కల్పిస్తోంది. తక్కువ సమయంలో ట్రిప్ ప్లాన్ చేస్తున్నవాళ్లు ఈ ప్యాకేజీని పరిశీలించొచ్చు.

మార్వెల్స్ ఆఫ్ మహారాష్ట్ర ) పేరుతో ఐఆర్‌సీటీసీ ఈ ప్యాకేజీని తీసుకొచ్చింది. కాచిగూడ, కామారెడ్డి, మేడ్చల్, మల్కాజ్‌గిరి, నిజామాబాద్ స్టేషన్లలో ఈ రైలు ఎక్కొచ్చు. యాత్ర ముగించుకున్నాక కాచిగూడలో రైలు దిగాల్సి ఉంటుంది. టికెట్ ధర రూ.7,400 నుంచి ప్రారంభమవుతుంది. మూడు రాత్రులు, నాలుగు పగళ్లు ఈ యాత్ర కొనసాగుతుంది. ప్రతీ శనివారం ఈ ట్రైన్ అందుబాటులో ఉంటుంది. సెప్టెంబర్ 6, 13, 20, 27 ప్రయాణానికి టికెట్లు అందుబాటులో ఉన్నాయి.

రైలు ప్రయాణం ఇలా..

మొదటి రోజు సాయంత్రం 6:40 గంటలకు కాచిగూడ (అజంతా ఎక్స్‌ప్రెస్ ట్రైన్ నం: 17064) నుంచి యాత్ర ప్రారంభమవుతుంది. ఆ రాత్రంతా ప్రయాణం ఉంటుంది.

రెండోరోజు ఉదయం 4:40 గంటలకు ఔరంగాబాద్ రైల్వే స్టేషన్ చేరుతారు. అక్కడ ముందుగా ఏర్పాటుచేసిన హోటల్‌కు తీసుకెళ్తారు. అల్పాహారం స్వీకరించాక ఎల్లోరా అందాలను చూసేందుకు బయల్దేరుతారు. తర్వాత ఘృశ్ణేశ్వర ఆలయాన్ని సందర్శించుకుంటారు. ఇక సాయంత్రం బీబీ కా మక్బారా (%దీఱఎఱ-ఝ-మీఝనఝతీఝ%)ను వీక్షిస్తారు. ఆ రాత్రి బస అక్కడే.

మూడో రోజు టిఫిన్ తర్వాత అజంతా గుహల్ని చూసేందుకు బయల్దేరుతారు. వాటిని వీక్షించాక సాయంత్రం ఔరంగాబాద్ చేరుకుంటారు. రాత్రి 8 గంటలకు (ట్రైన్ నం: 17063) రైలు ఎక్కుతారు.

నాలుగో రోజు ఉదయం 9:45 గంటలకు కాచిగూడ చేరడంతో మీ ప్రయాణం ముగుస్తుంది.

ఛార్జీలు ఇలా..

బుక్ చేసుకునే వ్యక్తుల సంఖ్యను బట్టి ప్యాకేజీ ఛార్జీల్లో మార్పు ఉంటుంది. ఒకరు నుంచి ముగ్గురు వ్యక్తులు బుక్ చేసుకుంటే కంఫర్ట్‌లో (థర్డ్ ఏసీ బెర్త్) ఒక్కో ప్రయాణికుడికి రూమ్ సింగిల్ షేరింగ్‌లో అయితే రూ.22,920, ట్విన్ షేరింగ్‌కు రూ.12,650, ట్రిపుల్ షేరింగ్‌కు రూ.10,050 చెల్లించాలి. 5-11 ఏళ్ల మధ్య చిన్నారులకు విత్ బెడ్‌కు రూ.8,630, విత్ అవుట్ బెడ్ అయితే రూ.6,890గా నిర్ణయించారు.

స్టాండర్డ్‌లో (స్లీపర్ బెర్త్) రూమ్ సింగిల్ షేరింగ్ అయితే రూ.21,440, ట్విన్ షేరింగ్‌కు రూ.11,170, ట్రిపుల్ షేరింగ్‌కు రూ.8,570. ఇక 5-11 ఏళ్ల మధ్య చిన్నారులకు విత్ బెడ్‌తో రూ.7,150, అదే విత్ అవుట్ బెడ్ అయితే రూ.5,410 చెల్లించాలి.

నలుగురు నుంచి ఆరుగురు వ్యక్తులు కలిసి బుక్ చేసుకుంటే కంఫర్ట్‌లో (థర్డ్ ఏసీ) డబుల్ షేరింగ్‌కు రూ.9,930, ట్రిపుల్ షేరింగ్‌కు రూ.8,880 చెల్లించాలి. 5-11 ఏళ్ల మధ్య చిన్నారులకు విత్ బెడ్ అయితే రూ. 8,630, విత్ అవుట్ బెడ్ అయితే రూ.6,890 వెచ్చించాలి. అదే స్టాండర్డ్‌లో (స్లీపర్ బెర్త్) డబుల్ షేరింగ్‌కు రూ.8,440, ట్రిపుల్ షేరింగ్‌కు రూ.7,400 చెల్లించాలి. 5-11 ఏళ్ల మధ్య చిన్నారులకు విత్ బెడ్‌తో రూ.7,150, విత్ అవుట్ బెడ్ అయితే రూ. 5,410 చెల్లించాలి.

# ఐదేళ్ల తర్వాత భారత్ నుంచి చైనాకు విమాన సర్వీసులు..

**ఢిల్లీ, ఆగష్టు 13 (భారత శక్తి) :** ఐదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత భారత్ చైనా మధ్య నేరుగా విమాన సర్వీసులు పునఃప్రారంభం కానున్నాయి. వచ్చే నెలలో భారత్ చైనా మధ్య విమాన సర్వీసులను పునరుద్ధరించే అవకాశం ఉందని బ్లూమ్‌బర్గ్ నివేదిక వెల్లడించింది. ఎయిర్ ఇండియా, ఇండిగో వంటి విమానయాన సంస్థలు చైనా సర్వీసులు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉండాలని భారత ప్రభుత్వం సూచించింది. 2020లో గల్వాన్ లోయలో జరిగిన సైనిక ఘర్షణలతో భారత్ చైనా మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. ఆ సమయంలోనే రెండు దేశాల మధ్య నేరుగా నడిపే విమాన సర్వీసులను రద్దు చేశారు. చైనాకు సంబంధించిన పలు యాప్‌లను భారత్ నిషేధించింది. చైనా పెట్టుబడులపై కేంద్ర ప్రభుత్వం సుముఖత చూపలేదు. చైనా దిగుమతులపై భారత్ కఠిన ఆంక్షలు విధించింది. అయితే, ఇటీవలి కాలంలో



రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు తగ్గించే దిశగా చర్యలు కొనసాగించడంతో ప్రస్తుతం సానుకూల సంకేతాలు కనిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే విమాన సర్వీసుల పునరుద్ధరణకు చర్యలు చేపట్టడం జరిగింది. ఇరుదేశాల మధ్య సంబంధాలు మెరుగుపడటంతో ఆర్థిక, వాణిజ్యపరంగా ఇండియా, చైనా దేశాలు అమెరికాను ఎదుర్కొనే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## ఎన్నికల్లో ఓడినా జగన్ ఆలోచనా విధానం మారలేదు: తెలంగాణ ఎంపీ చామల

**హైదరాబాద్, ఆగష్టు 13 (భారత శక్తి) :** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిపై వైకాపా అధ్యక్షుడు జగన్ చేసిన వ్యాఖ్యలు సరికాదని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో జగన్ చేసిన వ్యాఖ్యలపై చామల స్పందించారు. "ఏపీ ఎన్నికలపై రాహుల్ మాట్లాడలేదనడం సరికాదు. చంద్రబాబు, రేవంత్ వల్లే రాహుల్ మాట్లాడలేదని జగన్ అన్నారు. ఎన్నికల్లో ఓడిపోయినా ఆయన ఆలోచనా విధానం మారలేదు. ఏపీలో తప్పులు జరిగితే ఈసీ, మోదీని విమర్శించండి. వారిని తప్పుపట్టకుండా



రాహుల్‌ను విమర్శించడమేంటి? విజయవాడ ధర్నాలో రాహుల్‌తో కలిసి జగన్ పాల్గొనాలి" అని చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు.

### కోదండరామ్, అమీర్ అలీఖాన్..

## నియామకంపై స్టే.. సుప్రీం సంచలన తీర్పు

**ఢిల్లీ, ఆగష్టు 13 (భారత శక్తి) :** తెలంగాణలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీ నియామకాలపై సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. తెలంగాణ జనసమితి అధ్యక్షుడు కోదండరామ్, అమీర్ అలీఖాన్ నియామకాలపై సర్వోన్నత న్యాయస్థానం స్టే విధించింది. వారి నియామకాలను నిలిపివేస్తూ తీర్పు ఇచ్చింది. ఎమ్మెల్సీలుగా కోదండరామ్, అమీర్ అలీఖాన్ నియామకాలను భారత రాష్ట్ర సమితి నేత



దాసోజు శ్రవణ్, సత్యనారాయణ సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఆ పిటిషన్లపై విచారించిన సుప్రీంకోర్టు.. నేడు తీర్పు వెలువరించింది. తదుపరి ఉత్తర్వులకు అనుగుణంగా ఎంపిక ఉండాలని పేర్కొంటూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను ధర్మాసనం సవరించింది. మధ్యంతర ఉత్తర్వుల తర్వాత ప్రమాణస్వీకారం చేయడం తప్పు అని సుప్రీంకోర్టు పేర్కొంది.

## ఎన్నికలు ఉన్నాయని బిహార్‌కు ఎరువుల తరలింపు: హరీశ్‌రావు ఆరోపణ

**సిద్దిపేట, ఆగష్టు 13 (భారత శక్తి) :** మాజీ మంత్రి, భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే హరీశ్‌రావు సిద్దిపేట జిల్లాలోని రాఘవాపూర్‌లో పర్యటించారు. రైతులు ఎరువుల కోసం క్యూలో నిల్చోవడాన్ని చూసి ఆయన ఆగారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఓటీపీ, ఒక బస్తా విధానం తీసేయాలన్నారు. ప్రభుత్వం సబ్సిడీ నుంచి తప్పించుకునేందుకు కృత్రిమ కొరతను సృష్టిస్తోందని విమర్శించారు. ఎన్నికలు ఉన్నాయని బిహార్‌కు ఎరువులు తరలిస్తున్నారని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్, భాజపాకు గుణపాఠం చెప్పాలన్నారు.


**మంత్రి ఉత్తమ్‌కు హరీశ్‌రావు లేఖ**

నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి హరీశ్‌రావు లేఖ రాశారు. కాళేశ్వరం ప్రాజెక్టు కింద ఉన్న జలాశయాలు నింపాలని అందులో విజ్ఞప్తి చేశారు. మధ్య మానేరు, అన్నపూర్ణ, రంగనాయక్‌సాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ, బస్వాపూర్ జలాశయాలను నింపాలని కోరారు. రైతుల కోసం ఆరో ప్యాకేజీ వద్ద ఉన్న మోటార్లు ఆన్ చేయాలన్నారు. జలాశయాల్లో నీరు నింపకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని పేర్కొన్నారు.



### శంషాబాద్ ఎయిర్‌పోర్టులో

## పలు విమానాల దారి మళ్లింపు



**హైదరాబాద్, ఆగష్టు 13 (భారత శక్తి) :** శంషాబాద్ ఎయిర్‌పోర్టులో పలు విమానాలను దారి మళ్లించారు. హైదరాబాద్‌లో భారీ వర్షాలు, ప్రతికూల వాతావరణం కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. మొత్తం 9 విమానాల్లో విజయవాడకు 5, బెంగళూరుకు 3, తిరుపతికి ఒక విమానాన్ని మళ్లించారు. హైదరాబాద్ నుంచి బయల్దేరాల్సిన మూడు విమానాలను తాత్కాలికంగా రద్దు చేశారు. అయితే మళ్లించిన వాటిలో 7 విమానాలు తిరిగి హైదరాబాద్‌కు చేరుకున్నట్లు ఎయిర్‌పోర్టు అధికారులు తెలిపారు.

## ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారం వేసే ప్రసక్తే లేదు: సీఎం

**అమరావతి, ఆగష్టు 13 (భారత శక్తి) :** ఆంధ్రప్రదేశ్‌ను 'గ్రీన్ ఎనర్జీ కారిడార్'గా తీర్చిదిద్దాలని, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా పునరుత్పాదక ఇంధన ఉత్పత్తిలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. అదే సమయంలో, విద్యుత్ ఛార్జీలు పెంచి వినియోగదారులపై ఎలాంటి భారం మోపవద్దని ఆయన స్పష్టం చేశారు. బుధవారం అమరావతిలోని తన క్యాంపు కార్యాలయంలో విద్యుత్ సరఫరా, పెట్టుబడులు, ఛార్జీల తగ్గింపు వంటి కీలక అంశాలపై సీఎం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, ఏపీ ట్రాన్స్‌కో, జెన్‌కో ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రపంచవ్యాప్తంగా మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా రాష్ట్ర విద్యుత్ రంగంలో స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. "భవిష్యత్ అంతా గ్రీన్ ఎనర్జీదే. పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించి, ఆ ప్రయోజనాలను ప్రజలకు అందించాలి," అని ఆయన పేర్కొన్నారు. రాబోయే రెండు, మూడేళ్లలో రాష్ట్రంలో విద్యుత్ వినియోగం 8.9% పెరిగే అవకాశం ఉందని, ఈ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిని పెంచాలని సూచించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటి ఆధునిక సాంకేతికతను ఉపయోగించి అతి తక్కువ ఖర్చుతో విద్యుత్ ఉత్పత్తి చేసే మార్గాలను అన్వేషించాలని అన్నారు.



*** ఛార్జీల భారం వద్దు.. ప్రత్యామ్నాయ ఆదాయంపై దృష్టి**

వినియోగదారులపై విద్యుత్ ఛార్జీల భారం వేసే ప్రసక్తే లేదని తేల్చిచెప్పిన సీఎం, ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలను అన్వేషించాలని అధికారులకు సూచించారు. ప్రస్తుతం ఏపీ ట్రాన్స్‌కో ఆధీనంలో ఉన్న ఫైబర్ ఆప్టిక్ నెట్‌వర్క్‌ను లీజుకు ఇవ్వడం ద్వారా అదనపు ఆదాయం సంపాదించవచ్చని తెలిపారు. ఈ విధానం ద్వారా దాదాపు రూ.7 వేల కోట్ల వరకు ఆదాయం పొందే అవకాశం ఉందని అంచనా వేశారు. బహిరంగ మార్కెట్‌లో విద్యుత్ కొనుగోళ్లను గణనీయంగా తగ్గించాలని, యూనిట్ కొనుగోలు వ్యయాన్ని రూ.4.80కి పరిమితం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని సీఎస్ విజయానంద్ ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి వివరించారు.

*** నష్టాలు తగ్గించి.. కొనుగోళ్లు నియంత్రించాలి**

రాష్ట్రంలో 9 శాతంగా ఉన్న విద్యుత్ పంపిణీ నష్టాలను గణనీయంగా తగ్గించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఫీడర్లను సమర్థవంతంగా నిర్వహించడం, స్థానికంగా ఉత్పత్తి అవుతున్న విద్యుత్‌ను అక్కడే వినియోగించడం ద్వారా ట్రాన్స్‌మిషన్ నష్టాలను అరికట్టవచ్చని అన్నారు. గతంలో తాను ప్రవేశపెట్టిన ఎనర్జీ ఆడిటింగ్ విధానాన్ని మళ్లీ అమలు చేసి విద్యుత్ చౌర్యాన్ని, నష్టాలను గుర్తించాలని సూచించారు. పెరిగే డిమాండ్‌ను ఎదుర్కొనేందుకు విద్యుత్ కొనుగోళ్లకు బదులుగా 'పవర్ స్వాపింగ్' వంటి విధానాలను అనుసరించాలని తెలిపారు.


*** సౌర, పవన విద్యుత్‌కు పెద్దపీట**

థర్మల్ విద్యుత్ యూనిట్‌కు రూ.5 నుంచి రూ.6 ఖర్చవుతుండగా, పవన విద్యుత్‌కు కేవలం రూ.4.6 మాత్రమే వ్యయం అవుతోందని సీఎం గుర్తుచేశారు. రాష్ట్రంలో 65 గిగావాట్ల పవన విద్యుత్ ఉత్పత్తికి అవకాశాలున్నాయని, ఆ దిశగా ప్రాజెక్టులను ప్రోత్సహించాలని అన్నారు. రాయలసీమలో పంప్ ఎనర్జీ ప్రాజెక్టులకు విస్తృత అవకాశాలున్నాయని పేర్కొన్నారు. పీఎం సూర్యఘర్ సోలార్ రూఫ్ టాప్ పథకాన్ని వేగవంతం చేయాలని, ప్రతి నియోజకవర్గంలో కనీసం 10 వేల ఇళ్లకు ఈ పథకాన్ని వర్తింపజేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఈ పథకం పురోగతిపై ప్రతినెలా తానే స్వయంగా సమీక్షిస్తానని స్పష్టం చేశారు. అలాగే, వ్యవసాయానికి ఎక్కడా స్మార్ట్ మీటర్లు బిగించవద్దని సీఎం చంద్రబాబు కచ్చితమైన ఆదేశాలు జారీ చేశారు. పాతబడిన విద్యుత్ లైన్లను గుర్తించి, ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు 'ప్రెడిక్టివ్ మెయింటెనెన్స్' టెక్నాలజీని వాడాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

### నేడు, రేపు

## తెలంగాణ అంతటికీ రెడ్ అలర్ట్

**హైదరాబాద్, ఆగష్టు 13 (భారత శక్తి) :** తెలంగాణ అంతటికీ ఇవాళ, రేపు రెడ్ అలర్ట్ జారీ చేసినట్లు వాతావరణ కేంద్రం డైరెక్టర్ నాగరత్న తెలిపారు. సంగారెడ్డి, వికారాబాద్, మెదక్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, యాదాద్రి భువనగిరి, ఖమ్మం, భద్రాద్రి, భూపాలపల్లి, ములుగు జిల్లాలకు రెడ్ కలర్ వార్నింగ్ జారీ చేసినట్లు తెలిపారు. హైదరాబాద్, హనుమకొండ, ఆదిలాబాద్, జనగామ, కామారెడ్డి, కుమురం భీం, ఆసిఫాబాద్, మహబూబాబాద్, మంచిర్యాల, నల్గొండ, రంగారెడ్డి, సిద్దిపేట, వరంగల్ జిల్లాలకు ఆరెంజ్ కలర్ వార్నింగ్ జారీ చేసినట్లు చెప్పారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. రాష్ట్రమంతటా రేపు కూడా వర్షాలు కొనసాగే అవకాశం ఉందని నాగరత్న వివరించారు. "నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేశాం. రేపు మెదక్, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో అత్యంత భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. ఉత్తర తెలంగాణ



జిల్లాల్లో వర్ష తీవ్రత ఎక్కువగా ఉంటుంది. ఇవాళ జీహెచ్‌ఎంసీ పరిధిలో రెడ్ అలర్ట్.. రేపు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశాం. రాష్ట్రంలో ఐదు రోజుల పాటు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయి. ఉత్తర తెలంగాణలో 17న వర్ష తీవ్రత అధికంగా ఉండే అవకాశం ఉంది. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయి" అని నాగరత్న తెలిపారు.

### ఖమ్మంలో గంజాయి మత్తులో

## రెచ్చిపోయిన పోకిరీలు...



**ఖమ్మం, ఆగష్టు 13 (భారత శక్తి) :** జిల్లాలోని గోపాలపురంలో గంజాయి మత్తులో కొందరు పోకిరీలు రెచ్చిపోయారు. రోడ్డుపై వెళ్తున్న వాహనాలను ఆపి వాహనదారులను భయభ్రాంతులకు గురిచేసి వీరంగం సృష్టించారు. రోడ్డు పక్కన ఉన్న దుకాణాలపైనా దాడి చేసి హల్‌చల్ చేశారు. అల్లరిమూక కిరాణం షాపు, టూ వీలర్లపై పెట్రోల్ పోసి తగలబెట్టడంతో దుకాణదారులు అడ్డుకోబోగా వారిపై దాడికి దిగారు. ఈ దాడుల్లో ముగ్గురికి గాయాలయ్యాయి. గంజాయి మత్తులో పిల్లలు, మహిళలపైనా దాడికి యత్నించారు. గతంలోనూ ఇదే అల్లరి మూక దాడికి పాల్పడినట్లు బాధితులు చెబుతున్నారు.

### కంచ గచ్చిబౌలి అంశం..

## సమగ్ర ప్రణాళికతో వస్తే రాష్ట్ర ప్రభుత్వాన్ని అభినందిస్తాం: సుప్రీంకోర్టు

**ఢిల్లీ, ఆగష్టు 13 (భారత శక్తి) :** కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై సుప్రీంకోర్టులో మరోసారి విచారణ జరిగింది. వాదనల సందర్భంగా.. భూముల అభివృద్ధి కోసం సమగ్ర ప్రణాళికలు తయారు చేస్తున్నట్లు సుప్రీంకోర్టుకు రాష్ట్రప్రభుత్వం తెలిపింది. ఈ ప్రతిపాదనను స్వాగతిస్తున్నట్లు సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ తెలిపారు. తాము అభివృద్ధికి వ్యతిరేకం కాదని ఆయన పేర్కొన్నారు. అదే సందర్భంలో.. పర్యావరణ పరిరక్షణను కూడా పరిగణనలోకి తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర ప్రణాళికతో ముందుకు వస్తే.. గతంలో చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటామని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ తెలిపారు. అంతే కాకుండా రాష్ట్ర ప్రభుత్వాన్ని అభినందిస్తామన్నారు. సమగ్ర ప్రణాళిక తయారు చేసి కోర్టుకు అందించేందుకు తమకు ఆరు వారాలు సమయం కావాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ఇందుకు సీజేఐ ధర్మాసనం అంగీకరించింది.



- స్త్రీని దేవతగా పూజించే దేశం మనది..
- ఆదిపరాశక్తి అంటాం.. అది నుంచి ఆమెకు కష్టాలే..
- ఎన్ని చట్టాలు వచ్చినా ఆడది అబలగానే మిగిలిపోతోంది..
- గృహ హింసే కాదు సమాజంలో కూడా అసమానతలే..
- ఒక ప్రాణికి జన్మనిచ్చి, తమ ప్రాణాలను ఫణంగా పెడుతుంది..
- ఆలయాన వెలసిన ఆదేవుని రీతి అని చెప్పకుంటాం అంతే..
- స్త్రీ శక్తి లేకపోతే ఈ ప్రపంచం శూన్యం అవుతుంది..
- ప్రతి స్త్రీతోనూ తల్లిని, చెల్లిని, సోదరిని చూద్దాం..
- ఆదుకునే బొమ్మలా కాకుండా ఆదుకునే అమ్మలా గౌరవిద్దాం..
- ఆకాశమే హద్దుగా మహిళ ఇప్పుడు సాగిపోతోంది..
- ఆమెను రక్షించుకుందాం.. మనల్ని మనం కాపాడుకుందాం..
- - " ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ " సంస్థ అందిస్తున్న ప్రత్యేక కథనం..






# మహిళలను.. మనుషులుగా చూడండి..

**హైదరాబాద్, ఆగష్టు 13 ( భారత శక్తి ):** కుటుంబాల్లో జరిగే హింసని నేరంగా గుర్తించాలని, దాని కోసం ఒక చట్టం చేయ్యాలని మహిళా సంఘాలు ఎప్పటి నుండో కోరుతున్నాయి. దేశవ్యాప్తంగా ఎన్నో ఉద్యమాలు నడిచాయి. వీటి ఫలితంగానే ప్రభుత్వం మొట్ట మొదటిసారి గృహహింసని నేరంగా గుర్తించి, గృహహింస నిరోదక చట్టం 2005 ను తీసుకోచ్చింది. జమ్ము కాశ్మీర్ తప్ప మిగిలిన దేశమంతా ఈ చట్టం అమలులో కొచ్చింది. గృహహింస నేదుర్కొనే స్త్రీలందరూ ఈ చట్టం పరిధిలోకి వస్తారు. ఇది ఒక సివిల్ చట్టం. నేరం చేసిన వాళ్ళను దండించడం కాకుండా బాధితులకు ఉపశమనం కల్పించే దిశగా ఈ చట్టం ఏర్పడింది.

తన కుటుంబానికి సంబందించిన సమీప బంధువులైన మగవారు, ఆడవారుకూడా, అత్తా, ఆడపడుచు, తోడికోడలు అలాగే భర్త/ బావ/ మరిది/ అన్నదమ్ములు/ మామ/ కొడుకు/ అల్లుడు/ తండ్రి వీరందరూ జరిపే ఎటువంటి గృహహింస నుంచైనా మహిళలకు రక్షణ కల్పించేందుకు ఈ చట్టం ఏర్పడింది.

ముఖ్యంగా మహిళలకు ఎక్కడైతే రక్షణ కొరవడిందో, ఎక్కడైతే హింసకు గురౌతుందో అక్కడే వుండి తన న్యాయపోరాటం కొనసాగించే వెసులు బాటు ఈ చట్టం ద్వారా లభించింది. మహిళలకు తాము నివసించే ఇంటిలో హక్కును మొదటి సారి ఈ చట్టం కల్పించింది. ఈ నివాస హక్కు అనేది ఈ చట్టంలో అతి ముఖ్యమైన అంశంగా చెప్పుకోవాలి.

ఇది సివిల్ చట్టం అయినప్పటికీ పకడ్బందీగా అమలు కోసం నేరన్యాయ వ్యవస్థకు అమలు భాధ్యత పొందుపరిచారు. వైవాహిక జీవింతంలోని సున్నితమైన భార్యభర్తల సంబంధాన్ని దృష్టిలో పెట్టుకుని, పోలీస్ పాత్రని పరిమితం చేస్తూ మేజిస్ట్రేట్ పాత్రని, కుటుంబపెద్దగా హింసకు పాల్పడే పురుషులకు కౌన్స్ లింగ్ సౌకర్యం కల్పిస్తూ హింసకు పాల్పడరాదనీ ఆదేశాలిస్తూ చిన్న చిన్న సమస్యలను సరిదిద్దేలా మేజిస్ట్రేట్ పాత్రని రూపొందించారు. మేజిస్ట్రేట్ ఇచ్చిన ఆదేశాలను ధిక్కరించిన పక్షంలో ఇది క్రిమినల్ కేసవుతుంది. నిందుతులని శిక్షించే వీలు కూడా ఈ చట్టంలో పొందుపరిచారు.



కుటుంబాల్లో స్త్రీలు ఎదుర్కొనే హింసని చాలా విస్తృతంగా నిర్వచించింది ఈ చట్టం. శారీరక హింస, లైంగిక హింస, భావోద్రేక హింస, మానసిక హింస, ఆర్థిక హింసలను వివరంగా నిర్వచిస్తూ ఇలాంటి హింసలన్ని ఈ చట్ట పరిధిలోకి తెచ్చారు.

గృహహింస నిరోధక చట్టం కింద మహిళలకు రక్షణ చేకూర్చే కొన్ని సంస్థల వివరాలు :

**రక్షణాధికారులు :**

ఈ చట్టం సక్రమంగా అమలవ్వడంలో ముఖ్య పాత్ర పోషించేది రక్షణాధికారులే . భాధితురాలికి ఉచిత న్యాయ సేవలు, ఆర్థిక సహాయం, పిల్లల కస్టడి, ఆశ్రయం అందించే సంస్థల వివరాలు, వైద్య సహాయం మొదలైన సమాచారాన్ని అందించడం రక్షణాధికారి ముఖ్య భాద్యత. కుటుంబ హింసకు గురైన భాధితురాలు రక్షణాధికారిని కలిసి తన ఫిర్యాదును ఇవ్వవచ్చు. ప్రతి జిల్లాలోను ఐ.సి.డి. ఎస్.పి.డి నే రక్షణాధికారిగా నియమించారు. రెవెన్యూ డివిజన్లలో ఉండే ఆర్.డి.వో.లు కూడా రక్షణాధికారులే.

*** సర్వీస్ ప్రొవైడర్లు లేదా సహాయసంస్థలు :**

కుటుంబహింస నుండి మహిళలకు రక్షణ చట్టం 2005 అమలులో రక్షణాధికారులకు ఎంత కీలక పాత్ర వుందో సర్వీస్ ప్రొవైడర్లకు కూడా అంతే ముఖ్య పాత్ర వుంది. ఆయా ప్రాంతాలలో పనిచేసే స్వచ్ఛంద సంస్థలు, సర్వీస్ ప్రొవైడర్స్ గా ప్రభుత్వంలో రిజిస్టర్ చేయించుకోవాలి. ఈ క్రమంలోనే స్త్రీల సమస్యలపై పనిచేసే 72 స్వచ్ఛంధ సంస్థలను ప్రభుత్వం సర్వీస్ ప్రొవైడర్ల్ గా నియమించింది.

కుటుంబ హింసకు గురైన భాదిత మహిళ కోరితే కుటుంబ హింస నివేదిక (డి.ఐ.ఆర్)ను తయారు చేసి రక్షణాధికారికి లేదా మేజిస్ట్రేట్ కి ఇవ్వడం, వైద్య సహాయం అందించడం, షెల్టర్ హోంలో ఆశ్రయం కల్పించడం లాంటి విధాముగ సర్వీస్ ప్రోవైడర్లు నిర్వర్తించాలి.

*** మేజిస్ట్రేటు బాధ్యతలు :**

కుటుంబహింసకు గురైన బాధిత మహిళ నేరుగా మేజిస్ట్రేట్ కు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ చట్టం కింద బాధితురాలు కొన్ని ఉపశమనాలను మేజిస్ట్రేటును కోరవచ్చు.

ప్రతివాదితో కలిసివున్న ఇంటిలో నివసించే హక్కు.. రక్షణ ఉత్తర్వులు.. వేరుగా వుండేందుకు నివాసహక్కులు.. ఆర్థిక ఉపశమన ఉత్తర్వులు.. పిల్లల ఆధీనపు ఉత్తర్వులు.. భాదితురాలిని ఫోన్ల ద్వారా, ఉత్తరాల ద్వారా, ఇ మెయిల్ ద్వారా మానసిక వేదనకు గురిచేస్తే వాటిని నిలుపుదల చేస్తూ మేజిస్ట్రేటు ఉత్తర్వులివ్వవచ్చు. గృహహింసకు సంబందించిన కేసులను 60 రోజుల్లో విచారించి తీర్పు నివ్వాలి. కోర్టు ఉత్తర్వులను నిందితులు ఉల్లంఘిస్తే ఏడాది జలు శిక్ష గాని, రూ. 20,00 జరిమానా గానీ రెండింటిని గానీ మేజిస్ట్రేటు విధించవచ్చు.

*** పోలీసుల పాత్ర :**

ఈ చట్టం సివిల్ చట్టం కాబట్టి దీని అమలులో పోలిసుల పాత్ర నామమాత్రమే. అయితే భాదిత మహిళ కుటుంబహింసకు సంబందించిన ఫిర్యాదు ఇవ్వడానికి పోలీస్ స్టేషన్ కు వస్తే గృహహింస చట్టం గురించి, ఆ చట్టం ద్వారా లభించే ఉపశమనాల గురించి ఆమెకు వివరించి రక్షణాధికారి దగ్గరకు గానీ, సర్వీస్ ప్రోవైడర్ల దగ్గరకు గాని ఆమెను పంపించాలి. ఇక మేజిస్ట్రేటు జారీ చేసిన వివిధ ఉత్తర్వులని ప్రతివాది ఉల్లంఘిస్తే అది నేరమౌతుంది. ఈ అంశాన్ని భాధితురాలు కోర్టు దృష్టికి గాని, పోలీసుల దృష్టికి గాని తేవాల్సి వుంటుంది. ఉత్తర్వుల అమలు చేయడంలో పోలిసులు తప్పని సరిగా రక్షణాధికారికి సహకరించాలి.

ఏ మహిళ అయినా గృహ హింసకు గురైతే " ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ" ను సంప్రదించండి.. మీకు తగిన సూచనలు, సలహాలు ఉచితంగా అందిస్తాం..

## 2030 కామన్వెల్త్ గేమ్స్.. ఆతిథ్యం కోసం భారత్ అధికారిక బిడ్..

**ఢిల్లీ, ఆగష్టు 13 (భారత శక్తి):** 2030 కామన్వెల్త్ క్రీడల ఆతిథ్యం దిశగా భారత్ ఒక కీలక ముందడుగు వేసింది. ఈ మెగా క్రీడల నిర్వహణకు భారత్ దాఖలు చేయనున్న బిడ్‌కు భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అధికారికంగా ఆమోదముద్ర వేసింది. బుధవారం జరిగిన ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో (ఎస్‌జీఎం) ఈ మేరకు ఏకగ్రీవ నిర్ణయం తీసుకున్నారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్ నగరాన్ని ప్రధాన వేదికగా ప్రతిపాదిస్తూ ఈ బిడ్‌ను సిద్ధం చేస్తున్నారు. ఈ పోటీ నుంచి కెనడా వైదొలగడంతో 2030 కామన్వెల్త్ క్రీడల ఆతిథ్య హక్కులను పొందేందుకు భారత్‌కు అవకాశాలు గణనీయంగా మెరుగుపడ్డాయి. ఇప్పటికే ప్రాథమిక ఆసక్తిని వ్యక్తం చేసిన భారత్, తుది బిడ్ పత్రాలను ఆగస్టు 31 లోపు సమర్పించాల్సి ఉంది. ఈ క్రీడల నిర్వహణకు అయ్యే పూర్తి ఖర్చును కేంద్ర ప్రభుత్వమే భరిస్తుందని ఐఓఏ స్పష్టం చేసింది. ఈ సమావేశం అనంతరం ఐఓఏ జాయింట్ సెక్రటరీ కల్యాణ్ చౌబే మాట్లాడుతూ, "జనరల్ హౌస్ ఈ ప్రతిపాదనను ఏకగ్రీవంగా ఆమోదించింది. ఇకపై మా సన్నాహాలను వేగవంతం చేస్తాం" అని తెలిపారు. ఇటీవల కామన్వెల్త్ స్పోర్ట్ గేమ్స్ డైరెక్టర్ డారెన్ హాల్ నేతృత్వంలోని బృందం అహ్మదాబాద్‌లోని క్రీడా వేదికలను పరిశీలించి, గుజరాత్ ప్రభుత్వ అధికారులతో సమావేశమైంది. ఈ నెలలోనే మరో పెద్ద ప్రతినిధి బృందం పర్యటించనుంది. 2026 గ్లాస్గో క్రీడల మాదిరిగా కాకుండా, 2030లో పూర్తిస్థాయిలో అన్ని క్రీడాంశాలతో గేమ్స్ నిర్వహిస్తామని ఐఓఏ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడు రోహిత్ రాజ్‌పాల్ అన్నారు. "భారత్‌కు ఎక్కువ పతకాలు తెచ్చిపెట్టే షూటింగ్, ఆర్చరీ, రెజ్లింగ్ వంటి క్రీడలతో పాటు మన దేశీయ క్రీడలైన కబడ్డీ, ఖోఖోలను కూడా చేర్చాలని యోచిస్తున్నాం" అని ఆయన వివరించారు. కామన్వెల్త్ స్పోర్ట్ జనరల్ అసెంబ్లీ నవంబర్ చివరి వారంలో గ్లాస్గోలో సమావేశమై ఆతిథ్య దేశంపై తుది నిర్ణయం తీసుకోనుంది. భారత్ గతంలో 2010లో ఢిల్లీ వేదికగా కామన్వెల్త్ క్రీడలను విజయవంతంగా నిర్వహించిన విషయం తెలిసిందే.

## రాఖీ పండుగ.. ఆర్టీసీలో రికార్డు స్థాయిలో మహిళల ప్రయాణాలు

**హైదరాబాద్, ఆగష్టు 13 ( భారత శక్తి ):** రాఖీ పండుగ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో మహిళలు రికార్డు స్థాయిలో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణాలు సాగించారు. ఆగస్టు 7 నుంచి 12వ తేదీ వరకు ఈ ఆరు రోజుల్లో మొత్తం 3.68 కోట్ల మంది రాకపోకలు సాగించగా, అందులో 2.51 కోట్ల ఉచిత ప్రయాణాలు ఉన్నట్లు ఆర్టీసీ సంస్థ తెలిపింది. ఈ మేరకు సంస్థ ఎండీ సజ్జనార్ 'ఎక్స్' వేదికగా ఒక ప్రకటన విడుదల చేశారు. అన్నాచెల్లెళ్ల, అక్కాతమ్ముళ్ల అనుబంధానికి ప్రతీక అయిన రాఖీ పండుగ రోజున 45.62 లక్షల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారని సజ్జనార్ తన ప్రకటనలో పేర్కొన్నారు. ఆగస్టు 11న అత్యధికంగా 45.94 లక్షల మంది రాకపోకలు సాగించారని, ఒక్కరోజులో ఇంతమంది మహిళలు ప్రయాణించడం ఇదే తొలిసారి అని వెల్లడించారు. గత ఏడాది రాఖీ పండుగకు 2.75 కోట్ల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేశామని, అప్పటితో పోలిస్తే ఈ సంవత్సరం 92.95 లక్షల మంది ఎక్కువగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారని ఆయన తెలిపారు. ఈ ఏడాది బస్సులు 2.28 కోట్ల కిలోమీటర్ల మేర తిరిగాయని, గత ఏడాదితో పోలిస్తే 53 లక్షల కిలోమీటర్లు అదనంగా తిరిగాయని ఆయన వెల్లడించారు.

## తెలంగాణలో 4 రోజుల పాటు భారీ వర్షాలు...

**హైదరాబాద్, ఆగష్టు 13 (భారత శక్తి):** తెలంగాణలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. నాలుగు రోజుల పాటు రాష్ట్రంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో నీటిపారుదల శాఖ అధికారులకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇరిగేషన్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆయన హెచ్చరించారు. భారీ వర్షాల నేపథ్యంలో అన్ని విభాగాలకు సెలవులు రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రాజెక్టులు, ఆనకట్టలు, కాలువలతో పాటు చెరువులపై నిఘా పెంచాలని ఉత్తమ్ సూచించారు. ఎక్కడైనా విపత్తు సూచన కనిపిస్తే వెంటనే అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాలని తెలిపారు. క్షేత్ర స్థాయిలో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ఆయా జిల్లాల కలెక్టర్లతో పాటు అన్ని విభాగాల అధికారులతో ఇరిగేషన్ అధికారులు సమన్వయం చేసుకుంటూ పని చేయాలని చెప్పారు. ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటూ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ మేరకు ఆయన నీటిపారుదల శాఖ చీఫ్ సెక్రటరీ రాహుల్ బొజ్జా, స్పెషల్ సెక్రటరీ జీవన్ పాటిల్, జాయింట్ సెక్రటరీ కె.శ్రీనివాస్, ఈఎన్సీ అంజాద్ హుస్సేన్ లతో పాటు జిల్లాల సీఈలకు ఆదేశాలు జారీ చేశారు.

## కేబీసీలో 'ఆపరేషన్ సిందూర్' అధికారులు .. దుమారం

(మొదటిపేజీ తరువాయి)

వాడుకుంటున్నారంటూ నెటిజన్లు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 15న ప్రసారం కానున్న ఈ ప్రత్యేక ఎపిసోడ్‌కు సంబంధించిన టీజర్‌ను నిర్వాహకులు ఇటీవలే విడుదల చేశారు. ఇందులో హోస్ట్ అమితాబ్ బచ్చన్ సైనిక అధికారులకు ఘన స్వాగతం పలికారు. ఈ ప్రోమోలో కల్నల్ ఖురేషి మాట్లాడుతూ "పాకిస్థాన్ పదేపదే ఉగ్ర చర్యలకు పాల్పడుతోంది. దీనికి గట్టిగా బదులివ్వడం అవసరం, అందుకే ఆపరేషన్ సిందూర్ చేపట్టాం" అని వివరించారు. ఈ ఎపిసోడ్‌లో వీరితో పాటు, భారత నావికాదళంలో యుద్ధనౌకకు కమాండర్‌గా నియమితులైన తొలి మహిళా అధికారి కమాండర్ ప్రేరణా దేవ్‌స్థలే కూడా పాల్గొన్నారు. అయితే, అత్యంత కీలకమైన ఆపరేషన్‌లో పాల్గొన్న అధికారులు ఇలా యూనిఫాంలో ఒక ఎంటర్‌టైన్‌మెంట్ షోలో కనిపించడంపై నెటిజన్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. "ఏ దేశంలోనైనా కీలకమైన సైనిక ఆపరేషన్ తర్వాత అధికారులు ఇలా టీవీ షోలలో పాల్గొనడం చూశామా? విధి నిర్వహణలో ఉన్నవారికి ఇలా ఎలా అనుమతిస్తారు? ప్రస్తుత ప్రభుత్వం తమ స్వార్థ రాజకీయాల కోసం మన సైన్యాన్ని సిగ్గు లేకుండా వాడుకుంటోంది," అని ఒక యూజర్ మండిపడ్డారు. "భారత సాయుధ దళాలకు ఒక గౌరవం, హుందాతనం ఉన్నాయి. రాజకీయ నాయకులు తమ వ్యక్తిగత ప్రయోజనాల కోసం వాటిని నాశనం చేస్తున్నారు. ఇది సిగ్గుచేటు" అని మరో యూజర్ వ్యాఖ్యానించారు. "మన సైన్యం రాజకీయాలకు, పీఆర్‌కు అతీతమైనది. దేశాన్ని రక్షించడం వారి విధి, రాజకీయ నాయకుల బ్రాండ్‌ను ప్రచారం చేయడం కాదు" అంటూ ఇంకొకరు విమర్శించారు.

## సెమీకండక్టర్ ప్రాజెక్టుపై తెలంగాణకు కేంద్రం అన్యాయం చేసింది

**హైదరాబాద్, ఆగష్టు 13 ( భారత శక్తి ):** సెమీకండక్టర్ ప్రాజెక్టు కేటాయింపు విషయంలో కేంద్ర ప్రభుత్వం తెలంగాణ పట్ల తీవ్ర వివక్ష ప్రదర్శించిందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు తీవ్రంగా విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనను ఉద్దేశపూర్వకంగా పక్కనపెట్టారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలు తెలంగాణకు అవమానకరంగా ఉన్నాయని చెప్పారు. కేంద్రం విధానాలను తెలంగాణ ఎట్టి పరిస్థితుల్లో సహించబోదని అన్నారు. ప్రపంచ పెట్టుబడిదారులకు ఇలాంటి నిర్ణయాలు ఇబ్బందికరంగా ఉంటాయని చెప్పారు. సెమీకండక్టర్ ప్రాజెక్ట్ కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రైమ్ లొకేషన్ లో 10 ఎకరాల స్థలం కూడా కేటాయించిందని తెలిపారు. ఇదే ప్రాజెక్ట్ కు ఏపీ ప్రభుత్వం ఒక ఎకరా కూడా కేటాయించకపోయినా... కేంద్రం ఆ ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని చెప్పారు. రాజకీయ కోణంలో తీసుకున్న నిర్ణయాలు తెలంగాణకు అవమానకరంగా ఉన్నాయని మండిపడ్డారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.